తెలంగాణ పేపర్

తెలుగు దినపత్రిక

కేంద్రమంత్రి గడ్కారీని కలిసిన బీజేపీ ఎంపీలు

న్యూ ఢిల్లీ : కేంద్ర రోడ్డు రవాణా మరియు రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ని తెలంగాణ బీజేపీ ఎంపీల బృందంతో ఎంపి ఈటల రాజేందర్ మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా కొంపల్లి ఫ్లై ఓవర్, ఉప్పల్ ఫ్లై ఓవర్ నిర్మాణం ఆలస్యం కావడంతో యాక్సిడెంట్స్ సంఖ్య రోజు రోజుకూ పెరుగుతుంది. కాబట్టి పక్కన ఉన్న సర్వీస్ రోడ్డులు గుంతలు లేకుండా చూడాలని నితిన్ గడ్కరీ కి విజ్ఞప్తి చేశారు. పదిరోజుల్లో సర్వీసు రోడ్డు పనులు పూర్తి చేయాలని కేంద్ర మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ గారు ఆదేశాలు జారీ చేశారపి ఈటల అన్నారు.
ఈ సమావేశంలో ఎంపీలు డీకే అరుణ, మాధవనేని రఘునందన్ రావు, ధర్మపురి అరవింద్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, గోడం నగేష్ ఉన్నారు.

హైదరాబాద్ సంపుటి: 13 సంచిక : 258 | సంపాదకులు : నస్రీన్ ఖాన్ | గురువారం, ఆగస్టు 06, 2026 | పేజీలు : 8 వెల : రూ. 2/-

తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు పెంపునకు అనుమతులు ఇప్పించండి - సీఎం రేవంత్ రెడ్డి



న్యూఢిల్లీ: ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం ఎత్తు పెంపునకు మహారాష్ట్ర నుంచి అనుమతులు ఇప్పించాలని జల్శక్తి మంత్రి సీఆర్ పాటిల్ కి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బ్యారేజీ ఎత్తు పెంపుతో మహారాష్ట్రలో ముంపు ప్రభావం పెద్దగా ఉండదని వివరించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి , రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తో కలిసి జల్శక్తి మంత్రిత్వ శాఖ కార్యాలయంలో కేంద్ర మంత్రి తో సమావేశమయ్యారు.

తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యత, ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కి తాను రాసిన లేఖ, దానికి ప్రధానమంత్రి కార్యాలయం స్పందించి జల్శక్తి శాఖకు పంపిన విషయాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రస్తావించారు. తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి గతంలోనే రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరిన విషయాన్ని గుర్తు చేశారు. 148 మీటర్ల నుంచి 152 మీటర్ల వరకు ఎత్తుతో బ్యారేజీ నిర్మాణంపై పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ సెంటర్ (అచిఖఖీూ) అధ్యయనం నిర్వహించిందని కేంద్ర మంత్రి కి వివరించారు.

అచిఖఖీూ అధ్యయనం ప్రకారం 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించినా, 152 మీటర్ల ఎత్తులో నిర్మించినా ముంపులో పెద్దగా తేడా లేదని స్పష్టమైందని తెలిపారు. ముంపులో 50 శాతం నదీ గర్భం (రివర్ బెడ్)లోనే ఉంటుందని చెప్పారు. 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మిస్తే గ్రావిటీ ద్వారా అవసరమైన నీటి సరఫరా సాధ్యం కాదని, అందువల్ల 150 నుంచి 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ ని ముఖ్యమంత్రి కోరారు.

తుమ్మిడిహెట్టి వద్ద 150 నుంచి 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణం చేపడితే గ్రావిటీ ద్వారా నీటి సరఫరాకు అవకాశం ఉంటుందని తెలిపారు. గ్రావిటీ ద్వారా నీటి సరఫరా వల్ల విద్యుత్ వినియోగ భారం తగ్గుతుందని వివరిస్తూ, ఈ అంశంపై సాధ్యమైనంత త్వరగా తెలంగాణ, మహారాష్ట్రల మధ్య సమావేశం ఏర్పాటు చేయాలని జల్శక్తి మంత్రి సీఆర్ పాటిల్ ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే వెనుకబడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగునీటి వసతి ఏర్పడుతుందని వివరించారు.

ప్రధానమంత్రి కార్యాలయం నుంచి లేఖ అందిందని జల్శక్తి మంత్రి ముఖ్యమంత్రి కి తెలిపారు. ఈ అంశంపై మొదట కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్ర స్థాయి అధికారులతో చర్చల ప్రక్రియ ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం తెలంగాణ, మహారాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రుల సమావేశం ఏర్పాటు చేస్తానని చెప్పారు.

ఈ సమావేశంలో ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్ , వేం నరేందర్ రెడ్డి , డాక్టర్ మల్లు రవి , రామసహాయం రఘురాంరెడ్డి , పోరిక బలరాం నాయక్ , గడ్డం వంశీకృష్ణ , డాక్టర్ కడియం కావ్య , ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి , నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్ , నీటి పారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఈ. శ్రీధర్ , ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి, ముసారాంబాగ్ బ్రిడ్జి పనులను పరిశీలించిన మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్

హైదరాబాద్ : బుధవారం నాడు మంత్రులు పొన్నం ప్రభాకర్, ఆజారుద్దీన్ సైదాబాద్ స్టీల్ బ్రిడ్జ్, ముసారాంబాగ్ బ్రిడ్జ్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా,కాలేరు వెంకటేష్, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, జీహెచ్ ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్,ఇతర ముఖ్య నేతలు,అధికారులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ చాలా కాలంగా పెండింగ్ లో ఉండి 680 కోట్ల రూపాయలతో పూర్తి చేసుకున్న సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి పనులు చంచల్ గూడా జైలు నుండి ఒవైసీ హాస్పిటల్ వరకు, చంపాపేట కి మరో లైన్ తో పూర్తి చేసుకుంది. త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభం జరుగుతుంది. సంతోష్ నగర్, చంచల్ గూడ జైలు, సైదాబాద్ ప్రజలకు ఇబ్బందులు లేకుండా తక్కువ సమయంలో ఇతర ప్రాంతాలకు వెళ్లేలా ఈ బ్రిడ్జి ఉపయోగపడుతుందని అన్నారు.

సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి తో పాటు మూసారాంబాగ్ బ్రిడ్జి తర్వలోనే ప్రారంభం చేసుకొని ప్రజలకు ఉపయోగంలోకి వస్తుంది. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఈ బ్రిడ్జి సౌకర్యం ఉంటుంది. దీనికి అప్రోచ్ రోడ్డు విస్తరణ చేయాలి పెండింగ్ లో ఉన్న ఈ బ్రిడ్జి లను ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. నగరంలో పెరుగుతున్న జనాభా కి అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుంది.



కేబీఆర్ పార్క్ వద్ద బ్రిడ్జి పనులు వేగంగా కొనసాగిస్తున్నాం. ట్రాఫిక్ ప్రజా సేవల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

వరంగల్ లో రైల్వే క్రాసింగ్ సమస్యలపై పార్లమెంట్ లో ప్రశ్నించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య..



వరంగల్ జిల్లాలో రైల్వే లెవల్ క్రాసింగ్ల వద్ద ప్రమాదాలను తగ్గించడంతో పాటు ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం చేపట్టిన రైల్వే ఓవర్ బ్రిడ్జిలు (ఖీూఃలు), రైల్వే అండర్ బ్రిడ్జిలు (ఖీజఃలు), లెవల్ క్రాసింగ్ల తొలగింపు పనుల పురోగతిపై వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో కీలక ప్రశ్న లేవనెత్తారు..

గత ఐదేళ్లలో వరంగల్ జిల్లాలో ఆమోదించిన ఖీూఃలు, ఖీజఃలు, లెవల్ క్రాసింగ్ల నిర్మాలన పనుల వివరాలు, వాటి వ్యయం, నిధుల విధానం, ప్రస్తుతం పనుల పురోగతి, ఖర్చు చేసిన నిధులు, పూర్తయ్యే గడువు వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు..

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఈమేరకు 2026 జూన్ 1 నాటికి వరంగల్ జిల్లాలో 3 రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, 7 రైల్వే అండర్ బ్రిడ్జిలు, 8 లెవల్ క్రాసింగ్లు ఉన్నాయని, ప్రస్తుతం వరంగల్ జిల్లాలో 4 ఖీూఃఖీజఃపనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని తెలిపారు.

వాటిలో వరంగల్? చింతలపల్లి మధ్య లెవల్ క్రాసింగ్ నెం.64 వద్ద రూ.77 కోట్లతో ఖీూఃనిర్మాణానికి టెండర్ ఖరారైందన్నారు. అలాగే కాజీపేట?వరంగల్ మధ్య లెవల్ క్రాసింగ్ నెం.60, ఎల్గూర్?నెక్కొండ మధ్య లెవల్ క్రాసింగ్ నెం.66, 67 వద్ద మరో మూడు ఖీూఃలను రాష్ట్ర ప్రభుత్వమే తన స్వంత నిధులతో చేపట్టినట్లు కేంద్రం వెల్లడించింది. ప్రస్తుతం రాష్ట్రంలో రూ.4,883 కోట్ల అంచనా వ్యయంతో 118 ఖీూఃఖీజఃపనులు వివిధ దశల్లో కొనసాగుతున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ,..

వరంగల్ జిల్లాలో రైల్వే లెవల్ క్రాసింగ్ల వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు, ప్రమాదాల ముప్పు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న ఖీూఃఖీజఃపనులను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా టెండర్ పూర్తయిన పనులు, ఉంఆ దశలో ఉన్న ప్రాజెక్టులు ఆలస్యం కాకుండా నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని కేంద్ర రైల్వే శాఖను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మూడు ఖీూఃల నిర్మాణానికి కూడా రైల్వే శాఖ పూర్తి సహకారం అందించాలని సూచించారు.

వరంగల్ జిల్లా ప్రజలకు సురక్షితమైన, అంతరాయం లేని రవాణా సౌకర్యం కల్పించేందుకు పార్లమెంట్‌లో తన ప్రయత్నాలను నిరంతరం కొనసాగిస్తానని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య స్పష్టం చేశారు..

ఢిల్లీ పర్యటనలో బిజీగా ఉన్న రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 5 : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హస్తిన పర్యటన రాజకీయంగా, అభివృద్ధి పరంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఉదయం కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌తో సమావేశమైన రేవంత్ రెడ్డి... రాష్ట్రానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న పలు కీలక ప్రాజెక్టులకు తక్షణమే అటవీ, పర్యావరణ క్లియరెన్స్ ఇచ్చి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు కాంగ్రెస్ ఎంపీలు పాల్గొన్న ఈ సమావేశం అనంతరం, సీఎం జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో భేటీ కానున్నారు. గోదావరి–కృష్ణా నదీ జలాల పంపిణీ, ఆంధ్రప్రదేశ్‌తో ఉన్న జల వివాదాలు, కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ వంటి ప్రాధాన్యత కలిగిన అంశాలపై చర్చించనున్నారు.కేంద్ర మంత్రులతో వరుస సమావేశాల అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అధిష్ఠాన పెద్దలతో భేటీ కానున్నట్లు సమాచారం. పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో మంత్రివర్గ కూర్పును విజయవంతంగా కొలిక్కి తెచ్చిన హైకమాండ్, ఇప్పుడు తెలంగాణలో కూడా పెండింగ్‌లో ఉన్న కేబినెట్ విస్తరణపై దృష్టి సారించింది.
రాజీనామా బెదిరింపులకు వెనక్కి తగ్గకుండా కర్ణాటకలో ప్రయోగించిన ‘కఠిన వైఖరి’ ఫార్ములానే తెలంగాణలోనూ వర్తింపజేసి, మంత్రిపదవుల ఆశావహుల అసంతృప్తులకు చెక్ పెట్టాలని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తోంది. ఈ భేటీ తర్వాత తెలంగాణ కేబినెట్ విస్తరణపై ఏఐసీసీ నుంచి కీలక ప్రకటన వెలువడే అవకాశాలు ఉండటంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

మూడేళ్లలో ఒక్క కొత్త ప్రాజెక్టుకు కూడా అనుమతి తీసుకురాలేదు - హరీష్ రావు

హైదరాబాద్ : తెలంగాణ భవన్లో మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు మీడియాతో మాట్లాడారు.

ఈనెల 18న హైదరాబాద్ వేదికగా జీఆర్ఎంబీ (ఉఖీఓఃఖీ) సమావేశం జరగబోతోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ చెరో ఎజెండాను సిద్ధం చేసుకున్నాయి. తెలంగాణ ప్రభుత్వం మౌనం చూస్తుంటే... జీఆర్ఎంబీ సమావేశం కేవలం ఏపీ ప్రయోజనాల కోసమే జరుగుతోందా? అనే అనుమానం కలుగుతోంది. ఎజెండా వచ్చి ఇన్ని రోజులు అవుతున్నా తెలంగాణ ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం దారుణమని అన్నారు.

ఏపీ ప్రతిపాదించిన అంశాలు చూస్తే తెలంగాణ ఆత్మగౌరవం ఉన్న ప్రతి ఒక్కరి కడుపు మండక మానదు. రక్తం మరిగిపోక తప్పదు. తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీసే కుట్రలను పటాపంచలు చేయాల్సిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏం చేస్తున్నారు? గుడ్డి గుర్రం పళ్లు తోముతున్నారా? లేక తెలంగాణ నీటి ప్రయోజనాలను గంపగుత్తగా ఏపీకి తాకట్టు పెట్టాలని చూస్తున్నారా అని ప్రశ్నించారు.

చంద్రబాబు తెలంగాణకు ద్రోహం చేయాలని చూస్తుంటే... రేవంత్ రెడ్డి రక్తం ఎందుకు మరిగడం లేదు? తెలంగాణ సోయి లేదా? తెలంగాణ ఆత్మగౌరవం లేదా? గురుదక్షిణ కోసమేనా ఈ మౌనం?

ప్రతిపక్షాలపై అడ్డగోలుగా మాట్లాడే రేవంత్ రెడ్డి... పక్క రాష్ట్రం తెలంగాణ నీటి హక్కులను కాలరాస్తుంటే ఎందుకు మాట్లాడటం లేదు? “గుడ్లు పీకుతా... పేగులు మెడలో వేసుకుంటా” అంటూ రాక్షస భాష మాట్లాడే రేవంత్ రెడ్డి... చంద్రబాబు విషయంలో ఎందుకు నోరు మెదపడం లేదు? చంద్రబాబు అంటే అంత భయమా అని నిలదీసారు.



తెలంగాణ జల ప్రయోజనాలను శాశ్వతంగా సమాధి చేసే విధంగా పక్క రాష్ట్రం కుట్రలు చేస్తోంది. ఈనెల 18న జరిగే జీఆర్ఎంబీ సమావేశం ఎజెండా చూస్తే ఏపీ ఎంత వితండవాదం చేస్తుందో స్పష్టంగా అర్థమవుతుంది. తెలంగాణ ప్రాజెక్టులపై ఏపీ మొత్తం విషం చిమ్మింది. చంద్రబాబు తెలంగాణ ప్రాజెక్టులను తాను ఎప్పుడూ వ్యతిరేకించలేదని పదేపదే చెబుతారు. కానీ జీఆర్ఎంబీ ముందు పెట్టిన ఎజెండా చూస్తే అసలు నిజం ఏంటో అర్థమవుతుంది. కాళేశ్వరం, చౌటుపల్లి హన్మంతరావు, చిన్న కాళేశ్వరం, చనాకా–కొరటా, మోదికుంట వాగు, కడెం గూడెం లిఫ్ట్, సీతారామ లిఫ్ట్ వంటి ప్రాజెక్టులకు ఇచ్చిన అనుమతులను నిలిపివేయాలని, వాటిని పునఃసమీక్షించాలని ఏపీ కోరుతోంది. సమ్మక్క బ్యారేజీకి సంబంధించిన క్లియరెన్సులను కూడా నిలిపివేయాలని ఏపీ ప్రతిపాదిస్తోంది.

కొత్తగా అనుమతులు ఇవ్వాలని కాదు... కేసీఆర్ ప్రభుత్వం సాధించిన ఈ ఏడు ప్రాజెక్టుల అనుమతులను రివ్యూ చేయాలని ఏపీ కోరుతోంది. ప్రతిపాదనను జీఆర్ఎంబీ ఎజెండాలో చేర్చడం అత్యంత దుర్మార్గమైన విషయం. ఖమ్మం జిల్లాకు సీతారామ ప్రాజెక్టు నీళ్లు వస్తున్నాయంటే... కేసీఆర్ ప్రభుత్వం సాధించిన అనుమతుల వల్లే. ఇప్పుడు అదే సీతారామ ప్రాజెక్టు అనుమతులను రద్దు చేయాలని ఏపీ కోరుతోంది. తెలంగాణకు చెందిన ఏడు కీలక ప్రాజెక్టుల అనుమతులను నిలిపివేయాలని ఏపీ ప్రతిపాదిస్తుంటే తెలంగాణ ప్రభుత్వం ఏం చేస్తోంది? తెలంగాణ ఇంజినీర్లు ఏం చేస్తున్నారు? ఇప్పటికే అనుమతులు సాధించిన ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేసే అధికారం ఎవరు ఇచ్చారు? తెలంగాణ కోసం ఉద్యమం చేసి, పోరాడి కేసీఆర్ ప్రభుత్వం 383 టీఎంసీల గోదావరి జలాలకు అనుమతులు సాధించింది. ఇప్పుడు ఆ అనుమతులను రద్దు చేసే పరిస్థితి ఎందుకు వచ్చింది? కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దాదాపు మూడేళ్లలో ఒక్క కొత్త ప్రాజెక్టుకు కూడా అనుమతి తీసుకురాలేదని మండిపడ్డారు.

తెలంగాణ పవర్

సంపాదకీయం


గురువారం, ఆగస్టు 06, 2026

గేమ్ ఛేంజర్ కానున్న సముద్ర మంథన్

ముడిచమురు, సహజవాయువు (గ్యాస్) అవసరాల కోసం విదేశీ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు భారత్ కీలక అడుగు వేసింది.సముద్రగర్భంలో దాగి ఉన్న చమురు, గ్యాస్ నిల్వలను వెలికితీయడమే లక్ష్యంగా రూ.84,084 కోట్ల అంచనా వ్యయంతో 'సముద్ర మంథన్ ఆఫ్‌షోర్ ఎక్స్‌ప్లోరేషన్ పథకం'కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.ఈ పథకం కింద సముద్రంలోని అత్యంత లోతైన, ప్రమాదకర ప్రాంతాల్లో చమురు, గ్యాస్ అన్వేషణ కోసం తవ్వే బావులకు అయ్యే ఖర్చులో సగం లేదా గరిష్ఠంగా రూ.650 కోట్ల వరకు కేంద్ర ప్రభుత్వం నేరుగా బడ్జెట్ ద్వారా భరించనుంది.ఈ పథకం కింద వచ్చే ఐదేళ్లలో, అంటే 2031 నాటికి, సముద్రగర్భంలో సుమారు 60 లోతైన, అత్యంత లోతైన బావులు తవ్వేందుకు రూ.43,200 కోట్లు కేటాయించారు.ఒక్కో బావికి గరిష్ఠంగా రూ.650 కోట్ల వరకు వ్యయం చేయనున్నారు. అలాగే ఆఫ్‌షోర్ ప్రాంతాల్లో సీస్మిక్, జియోలాజికల్ సర్వేలు నిర్వహించి చమురు, గ్యాస్ నిల్వల అవకాశాలను గుర్తించేందుకు రూ.28,534 కోట్లు వెచ్చించనున్నారు.సముద్రంలో లభించే చమురు, గ్యాస్‌ను తీర ప్రాంతాలకు తరలించేందుకు గ్యాస్ పైప్‌లైన్‌లు, ప్రాసెసింగ్ ప్లాంట్ల ఏర్పాటు కోసం రూ.10,000 కోట్లు ఖర్చు చేయనున్నారు.అదనంగా ఆఫ్‌షోర్ రంగానికి అవసరమైన యంత్రాలు, సేవలు అందించే పారిశ్రామిక జోన్‌ల అభివృద్ధికి రూ.2,000 కోట్లు కేటాయించారు.లోతైన సముద్ర ప్రాంతాల్లో చమురు అన్వేషణలో విజయవంతం కాకపోతే భారీ పెట్టుబడులు వృథా అవుతాయనే భయంతో ప్రైవేట్ కంపెనీలు ఇప్పటివరకు ఈ రంగానికి దూరంగా ఉన్నాయి.చమురు నిల్వలు ఉన్నట్లు నిర్ధారణ అయిన తర్వాత మాత్రమే పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయి.ఈ నేపథ్యంలో ప్రపంచంలోనే తొలిసారిగా ప్రభుత్వం స్వయంగా బడ్జెట్ నిధులతో ఈ అన్వేషణలోని రిస్క్‌ను భరించేందుకు ముందుకొచ్చింది.చిన్న మొత్తాల్లో చమురు నిల్వలు లభించినా వాటిని వాణిజ్యపరంగా వినియోగించుకునేలా ప్రభుత్వ సాయంతో ఉమ్మడి పైప్‌లైన్‌లు, ప్రాసెసింగ్ మౌలిక వసతులు అభివృద్ధి చేయనుంది. దీంతో కంపెనీలపై పడే మౌలిక సదుపాయాల ఖర్చు గణనీయంగా తగ్గనుందగత పదేళ్లలో దేశంలో ముడిచమురు అవసరాల కోసం దిగుమతులపై ఆధారపడటం 77 శాతం నుంచి 88 శాతానికి పెరిగిందిఅలాగే దేశ అవసరాల్లో సగానికి పైగా సహజవాయువు కూడా దిగుమతుల ద్వారానే వస్తోంది.'సముద్ర మంథన్' పథకం ద్వారా ప్రతి ఏడాది 10 నుంచి 15 మిలియన్ టన్నుల అదనపు చమురు ఉత్పత్తి సాధించి, దిగుమతులను 3 నుంచి 5 శాతం వరకు తగ్గించే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేస్తోంది.భారత్‌లో చమురు, గ్యాస్ రంగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం 1997 నుంచి విధానాలను క్రమంగా సరళీకరిస్తోంది.ఇందులో భాగంగా 2016లో హైడ్రోకార్బన్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ లైసెన్సింగ్ పాలసీ , ఓపెన్ ఎకరేజ్ లైసెన్సింగ్ పాలసీ లను ప్రవేశపెట్టింది.అలాగే 2025 ఏప్రిల్‌లో అమల్లోకి వచ్చిన ఆయిల్ ఫీల్డ్స్ సవరణ చట్టం ద్వారా పన్నులు, లీజు విధానాలను మరింత సులభతరం చేసింది.ఇంధన అవసరాల కోసం ఇతర దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు భారత్ తన చమురు అన్వేషణను యుద్ధ ప్రాతిపదికన వేగవంతం చేస్తోంది. ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్‌జీసీ సుమారు 18 నుంచి 20 బిలియన్ డాలర్ల భారీ వ్యయంతో లోతైన సముద్ర గర్భంలో డ్రిల్లింగ్ చేసేందుకు ప్రపంచవ్యాప్త టెండర్లను ఆహ్వానించింది. ఐదేళ్ల కాల పరిమితితో అత్యాధునిక డ్రిల్‌షిప్‌లు, సెమీ-సబ్ మెర్సిబుల్ రిగ్‌లను అద్దెకు తీసుకోవడమే ఈ టెండర్ ప్రధాన ఉద్దేశం. ఓఎన్‌జీసీ తన అన్వేషణ ప్రణాళికను కేవలం పాత బేసిన్‌లకే పరిమితం చేయకుండా, కొత్త సరిహద్దులను వెతుకుతోంది. ప్రస్తుతం చమురు ఉత్పత్తి అవుతున్న కృష్ణ-గోదావరి బేసిన్‌లో కార్యకలాపాలను ముమ్మరం చేయడంతో పాటు, ఇప్పటివరకు పెద్దగా అన్వేషించని అండమాన్, నికోబార్ దీవుల సమీపంలోని అత్యంత లోతైన జలాలపై దృష్టి సారించింది. ఈ ప్రాజెక్టులోని సాంకేతిక సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రపంచ చమురు దిగ్గజాలైన ఎక్సాన్‌మొబిల్, బీపీ, టోటల్ ఎనర్జీస్, పెట్రోబ్రాస్‌ల సహకారాన్ని ఓఎన్‌జీసీ కోరుతోంది. ముంబైలో జరిగిన ప్రీ-బిడ్ సమావేశానికి ఇప్పటికే డజనుకు పైగా అంతర్జాతీయ సంస్థలు హాజరవ్వడం ఈ ప్రాజెక్టు ప్రాధాన్యతను చాటిచెబుతోంది. రష్యా చమురుపై పెరిగిన మొగ్గు.. ఒకవైపు స్వదేశీ అన్వేషణ జరుగుతుండగానే, మరోవైపు తక్షణ అవసరాల కోసం భారత్ రష్యా నుంచి భారీగా ముడి చమురును దిగుమతి చేసుకుంటోంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరియు హార్ముజ్ జలసంధి వద్ద అంతరాయాల కారణంగా ప్రపంచ సరఫరా తగ్గడంతో, భారత రిఫైనరీలు ఏప్రిల్ డెలివరీ కోసం సుమారు 60 మిలియన్ బ్యారెళ్ల రష్యా ముడి చమురును కొనుగోలు చేశాయి. ఇది ఫిబ్రవరి నెల కొనుగోళ్ల కంటే రెట్టింపు కావడం గమనార్హం. అమెరికా ఇచ్చిన తాత్కాలిక మినహాయింపులు కూడా రష్యా నుంచి చమురు సేకరణ పెరగడానికి మార్గం సుగమం చేశాయి.సంస్కరణలకు కొనసాగింపుగానే ఇప్పుడు 'సముద్ర మంథన్ ఆఫ్‌షోర్ ఎక్స్‌ప్లోరేషన్ పథకం'ను తీసుకొచ్చింది.ఈ పథకం ద్వారా భారత చమురు క్షేత్రాల్లోకి అంతర్జాతీయ ఇంధన దిగ్గజాలను ఆకర్షించడంతో పాటు, దేశ ఇంధన భద్రతను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

- ఎడిటర్

టీ కాంగ్రెస్ లో పట్టభద్రుల ఎన్నికల వేడి



హైదరాబాద్, ఆగస్టు 5 (న్యూస్ పల్స్) తెలంగాణ రాజకీయం ప్రస్తుతం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల చుట్టూ తిరుగుతోంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న కీలకమైన ఎన్నికలు కావడం, విద్యావంతులు, ఉద్యోగుల నాడిని ప్రతిబింబించే పోరు కావడంతో అధికార కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఇటీవల జరిగిన పార్టీ కోర్ కమిటీ సమావేశంలోనూ ఎమ్మెల్సీ ఎన్నికల సమరసన్నాహాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఏదేమైనా రెండు స్థానాల్లోనూ గెలిచి తీరాల్సిందేనని, విజయం సాధించడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని పార్టీ అధిష్టానం ముఖ్యనేతలకు స్పష్టమైన టార్గెట్ నిర్దేశించింది.అధికార పార్టీ తరఫున రేసులో నిలిచి ఎమ్మెల్సీగా సభలో అడుగుపెట్టేందుకు సీనియర్లు, యువ నేతలు తీవ్రస్థాయిలో పోటీపడుతున్నారు. పోటీకి దిగేందుకు ఆశావహుల సంఖ్య భారీగా ఉండటంతో కాంగ్రెస్ అధిష్టానానికి అభ్యర్థుల ఎంపిక కత్తిమీద సాములా మారింది. మహబూబ్‌నగర్ ? హైదరాబాద్ ? రంగారెడ్డి పట్టభద్రుల స్థానానికి ఆశావహులు భారీగా ఉన్నారు. ఇక రాజధాని నగరం పరిధిలోని ఉమ్మడి మహబూబ్‌నగర్ ? హైదరాబాద్ ? రంగారెడ్డి పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు కాంగ్రెస్‌లో గట్టి పోటీ నెలకొంది. ఉపాధ్యాయ, విద్యార్థి, యువజన సంఘాల్లో పట్టున్న పలువురు ముఖ్య నేతలు తమవంతు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధిగా గుర్తింపు ఉన్న హర్ష వర్ధన్ రెడ్డి విద్యావంతుల మద్దతు తనకే ఉందనే ధీమాతో ఉన్నారు. సామ రామ్మోహన్ రెడ్డి కాంగ్రెస్ మీడియా కమిటీ చైర్మన్ గా పార్టీ వాణిని బలంగా వినిపిస్తున్నారు. ఆయన టికెట్ కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నారు. టీ శాట్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న శివసేనా రెడ్డి యువత, విద్యావంతులలో మంచి గుర్తింపు పొందారు. ఇక యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివచరణ రెడ్డి యువజన విభాగానికి ప్రాతినిధ్యం కల్పిస్తూ రేసులో ముందంజలో ఉన్నారు. వీళ్లతో పాటు పార్టీ సీనియర్ నాయకుడు గౌరీ సతీష్ తో పాటు మన్నే జీవన్ రెడ్డి కూడా టికెట్ రేసులో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది.కాంగ్రెస్‌కు పట్టున్న ప్రాంతంగా భావించే నల్గొండ ? ఖమ్మం ? వరంగల్ పట్టభద్రుల స్థానానికి డిమాండ్ ఊహించని స్థాయిలో ఉంది. పార్టీలోని కీలక సీనియర్ నేతలు, ప్రజాప్రతినిధులు ఎక్కువమంది ఈ ప్రాంతం నుంచే ప్రాతినిధ్యం వహిస్తుండటంతో ఇక్కడ టికెట్ దక్కించుకోవడంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కుమారుడు గుత్తా అమిత్ రెడ్డి పేరు ఈ స్థానం నుంచి ప్రముఖంగా వినిపిస్తోంది. ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉద్యమ నేతగా పేరుపొందిన చనగాని దయాకర్ సైతం విద్యార్థి, నిరుద్యోగ వర్గాల మద్దతు తనకే ఉందంటూ పోటీలో నిలిచారు. స్టేషన్ ఘన్‌పూర్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ ఇందిర కూడా ఈ నియోజకవర్గం నుంచి టికెట్ ఆశిస్తున్నారు.కోర్ కమిటీ సమావేశంలో విస్తృతంగా చర్చించిన అనంతరం, విజయావకాశాలు ఉన్న నేతలనే బరిలోకి దించాలని హైకమాండ్ సూచించింది. సామాజిక సమీకరణాలు, క్షేత్రస్థాయి సమీకరణాలు, ఉద్యమ నేపథ్యం, అలాగే పట్టభద్రులలో ఉన్న ప్రజాదరణ ఆధారంగా మాత్రమే అభ్యర్థులను ఖరారు చేయాలని భావిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుల నిర్ణయంపైనే ప్రస్తుతం ఈ ఆశావహుల జాతకాలు ఆధారపడి ఉన్నాయి. ఎవరికి ఎమ్మెల్సీ టికెట్ వరిస్తుంది? అధిష్టానం ఎవరి వైపు మొగ్గు చూపుతుంది

ఆర్టీసీ కొత్తగా 3 నుంచి 5 బస్ డిపోలు



హైదరాబాద్, ఆగస్టు 5 (న్యూస్ పల్స్)గ్రేటర్ హైదరాబాద్‌లో ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్య పెరుగుతుండటంతో ఆర్టీసీ కొత్తగా 3 నుంచి 5 బస్ డిపోల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోంది. డిసెంబరు నాటికి ప్రస్తుతమున్న 26 డిపోల సంఖ్యను 31కి పెంచేందుకు ముషీరాబాద్‌లో హైదరాబాద్-3, నాగారం రోడ్డులో జవహర్‌నగర్ డిపోలతో పాటు మూతబడిన రాణిగంజ్-2 డిపోను పునఃప్రారంభించనున్నారు. స్థల కేటాయింపుపై రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లను కోరారు. నగరంలో ప్రస్తుతం 493 ఈవీ బస్సులు నడుస్తుండగా.. అన్ని డిపోల్లో ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు.గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రయాణికులకు మెరుగైన రవాణా సేవలు అందించేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. నగరంలో ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటం, మరోవైపు నగర శివారు ప్రాంతాలు వేగంగా విస్తరిస్తుండటంతో పెరిగిన రద్దీకి అనుగుణంగా కొత్త బస్ డిపోలను అందుబాటులోకి తేనుంది. సంస్థ అవసరాలు, భవిష్యత్తు రవాణా ప్రణాళికలను దృష్టిలో ఉంచుకుని నగరంలో కొత్తగా 3 నుంచి 5 వరకు బస్ డిపోలను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ ఉన్నతాధికారులు భావిస్తున్నారు.ఈ విస్తరణ ప్రణాళికలో భాగంగా ముందస్తుగా ముషీరాబాద్‌లోని 5 ఎకరాల స్థలంలో హైదరాబాద్-3 డిపోను, నాగారం రోడ్డులోని 5 ఎకరాల విస్తీర్ణంలో జవహర్‌నగర్ డిపోను ఏర్పాటు చేసేందుకు ఆర్టీసీ యాజమాన్యం వేగంగా చర్యలు తీసుకుంటోంది. వీటితో పాటు గతంలో రకరకాల కారణాలతో మూతబడిన రాణిగంజ్-2 డిపోను పునరుద్ధరించి, ఆధునిక వసతులతో రీ-మోడిఫికేషన్ చేసి త్వరలోనే పునఃప్రారంభించాలని నిర్ణయించారు. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 26 బస్ డిపోలు కొనసాగుతుండగా.. ఈ ఏడాది డిసెంబరు నాటికి వీటి సంఖ్యను 31కి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో శివారు ప్రాంతాల్లో కొత్త డిపోల ఏర్పాటుకు తగిన స్థలాలు కేటాయించాలని రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లను ఆర్టీసీ అధికారులు కోరారు. శివారు ప్రాంతాల్లో డిపోలు అందుబాటులోకి వస్తే నగర శివార్ల ప్రజలకు ప్రజారవాణా మరింత సులభతరం కానుంది.ప్రస్తుతం గ్రేటర్ ఆర్టీసీ ప్రతినిత్యం సుమారు 2800 బస్సులను నడుపుతుండగా.. వాటిలో 493 ఎలక్ట్రిక్ బస్సులు సేవలు అందిస్తున్నాయి. ప్రస్తుతం హయత్ నగర్-2 డిపో నుంచి 98, హెచ్‌సీయూ డిపో నుంచి 101, కూకట్‌పల్లి డిపో నుంచి 20, మియాపూర్-2 డిపో నుంచి 100, కంటోన్మెంట్ డిపో నుంచి 80, రాణిగంజ్ డిపో నుంచి 75 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయి. గ్రేటర్ హైదరాబాద్‌ను పూర్తిస్థాయి ఈవీ జోన్‌గా మార్చాలనే లక్ష్యంతో ప్రస్తుతం ఉన్న 26 డిపోలలోనూ ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు అందుబాటులో ఉండేలా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.నగర శివారు ప్రాంతాల్లోని ప్రతి డిపోలో ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడం వల్ల ఎంతో మేలు జరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. జిల్లాల నుంచి హైదరాబాద్ నగరానికి వచ్చే ఎలక్ట్రిక్ బస్సులు కూడా రాత్రి వేళల్లో సమీపంలోని ఈ డిపోలలో సులువుగా ఛార్జింగ్ చేసుకొని తెల్లవారుజామున మళ్లీ జిల్లాలకు తిరుగు ప్రయాణమయ్యే వెసులుబాటు కలుగుతుంది. ఈ చర్యల ద్వారా పర్యావరణహిత రవాణాతో పాటు నగరంలో బస్సు సర్వీసుల సమర్థత మరింత పెరుగుతుందని ఆర్టీసీ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కాళేశ్వరమే అజెండా

హైదరాబాద్, ఆగస్టు 5 (న్యూస్ పల్స్)తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాలు త్వరలో ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర రాజకీయం ఒక్కసారిగా తీవ్ర ఉద్రిక్తతలకు వేదికగా మారింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మొదటి నుంచి బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కె. చంద్రశేఖర్ రావు నేరుగా అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనాలని విసురుతున్న సవాళ్లు.. ఈసారి సభలో తీవ్ర దుమారం రేపేలా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా రూ. లక్ష కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం , మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు, నిధుల వినియోగంపై జరగనున్న చర్చే ఈ సమావేశాల్లో ప్రధానాంశంగా మారనుంది.కాళేశ్వరం ప్రాజెక్టును రాజకీయంగా, పరిపాలనాపరంగా తమకు ప్రధాన ఆయుధంగా మార్చుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తుండగా, రైతుల నీటి అవసరాలను చూపుతూ ప్రభుత్వాన్ని కార్నర్ చేయాలని బీఆర్ఎస్ ప్రయత్నించింది. ఇందులో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో మేడిగడ్డ నుంచి నీళ్లను ఎత్తిపోయాలి అని చేపట్టిన నిరసనలు, క్షేత్రస్థాయి ఉద్యమాలు రాజకీయాన్ని వేడెక్కించాయి. అయితే, ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ఎల్లంపల్లి నుంచి వరద నీరు సహజంగానే తిరిగి మేడిగడ్డ వైపు ప్రవహించడం, బ్యారేజీ సాంకేతిక పరిమితులు బయటపడటంతో బీఆర్ఎస్ ఒక్కసారిగా తీవ్ర ఆత్మరక్షణలో పడింది.ఇరిగేషన్ నిపుణులు, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికలను ముందుపెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం వేస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పడం బీఆర్ఎస్‌కు సవాలుగా మారింది. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిన పరిస్థితుల్లో నీటిని నిల్వ చేయడం లేదా పంపింగ్ చేయడం అత్యంత ప్రమాదకరమని ప్రభుత్వం వాదిస్తుంటే.. బీఆర్ఎస్ మాత్రం కేవలం పొలాలకు నీళ్లు ఇవ్వకుండా నాటకాలు ఆడుతోందని ఆరోపించింది. అయితే, వరద నీటి సహజ ప్రవాహం , ఎల్లంపల్లి బ్యాక్ వాటర్ పరిణామాలు క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ వాదనకే బలాన్ని చేకూర్చడంతో, సోషల్ మీడియాలో సైతం బీఆర్ఎస్ రక్షణ ధోరణిలో పడాల్సి వచ్చింది.ఈ వర్షాకాల సమావేశాల్లో సీఎం రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న వ్యూహం అత్యంత స్పష్టంగా ఉంది. కేసీఆర్‌ను నేరుగా అసెంబ్లీకి రప్పించడం ద్వారా, ఆయన సమక్షంలోనే కాళేశ్వరం డిజైన్ లోపాలు, పీసీ ఘోష్ కమిషన్ విచారణ పురోగతి, మరియు రాష్ట్రంపై పడిన ఆర్థిక భారాన్ని ఎండగట్టాలని కాంగ్రెస్ భావిస్తోంది. గత సమావేశాలకు కేసీఆర్ దూరంగా ఉండటాన్ని రేవంత్ రెడ్డి రాజకీయంగా వాడుకుంటూ.. ప్రతిపక్ష నేతగా సభకు

వచ్చి తమ హయాంలో జరిగిన నిర్మాణాలను సమర్థించుకోవాలని సవాల్ విసురుతున్నారు. మరోవైపు, బీఆర్ఎస్ వర్గాలు కూడా ఈ సమావేశాలను వ్యతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. కాళేశ్వరం అంశంలో సాంకేతిక లోపాలను సరిదిద్దకుండా ప్రభుత్వం రాజకీయం చేస్తోందని, ఆరుగాలం కష్టపడే రైతులకు సాగునీరు అందించడంలో విఫలమైందని సభలో తిప్పికొట్టేందుకు కేటీఆర్, హరీష్ రావులు వ్యూహాలు రచిస్తున్నారు. అయితే, కేసీఆర్ స్వయంగా అసెంబ్లీకి వస్తారా లేదా అనేది ఇంకా ఉత్కంఠగానే మారింది. ఒకవేళ కేసీఆర్ సభకు హాజరైతే రేవంత్-కేసీఆర్ మధ్య జరిగే ప్రత్యక్ష సభ సమరం తెలంగాణ రాజకీయ చరిత్రలోనే అత్యంత కీలకమైన ఘట్టంగా మారనుంది.ఈ వర్షాకాల సమావేశాల్లో కాళేశ్వరంపై జరిగే చర్చ ప్రజాభిప్రాయాన్ని తీవ్రంగా ప్రభావితం చేయనుంది. కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ రీ-డిజైన్ వైఫల్యం గా ప్రజల్లో శాశ్వతంగా ముద్ర వేయాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తుంటే.. కాంగ్రెస్ నిర్లక్ష్యం వల్ల ప్రాజెక్టు ఎండిపోతోంది అని నిరూపించేందుకు బీఆర్ఎస్ పోరాడుతోంది. అదే సమయంలో నిరుద్యోగ సమస్యలు సహా రాష్ట్రంలో ఉన్న అన్ని అంశాలను హైలెట్ చేయాలని బీఆర్ఎస్ ప్రయత్నించడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ అసెంబ్లీ సమావేశాలు కేవలం చట్టసభల చర్చలకే పరిమితం కాకుండా, రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయ గమనాన్ని నిర్దేశించే అత్యంత కీలక పోరాట వేదికగా మారడం ఖాయంగా కనిపిస్తోంది.

మొక్కజొన్న ఆల్ టైమ్ రికార్డ్

అదిలాబాద్, ఆగస్టు 5 (న్యూస్ పల్స్)తెలంగాణలో రైతుల నుంచి సేకరించిన మొక్కజొన్న విక్రయాల్లో మార్క్‌ఫెడ్ ఆల్‌టైమ్ రికార్డు సృష్టించింది. ఈ-వేలం విధానం ద్వారా నిర్వహించిన టెండర్లలో చరిత్రలోనే తొలిసారిగా మద్దతు ధర కంటే ఎక్కువ ధర పలికింది. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు వ్యాపారుల సిండికేట్‌ను అడ్డుకుంటూ ఈ-వేలం నిర్వహించగా.. టన్నుకు గరిష్ఠంగా రూ.26,500 ధర లభించింది. కొనుగోలు ధర కంటే టన్నుకు సగటున రూ.1,370 లాభం రావడంపై మంత్రి తుమ్మల తీవ్ర హర్షం వ్యక్తం చేశారు.తెలంగాణలో రైతుల నుంచి సేకరించిన మొక్కజొన్నల విక్రయంలో మార్క్‌ఫెడ్ సరికొత్త చరిత్ర సృష్టించింది. సంస్థ చరిత్రలోనే మొదటిసారిగా ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కంటే అత్యధిక ధర లభించి రికార్డు స్థాయి లాభాలు నమోదయ్యాయి. ఈ-వేలం విధానం ద్వారా నిర్వహించిన పారదర్శక టెండర్ల వల్ల వ్యాపారుల సిండికేట్‌కు చెక్ పడటమే కాకుండా.. మార్క్‌ఫెడ్‌కు భారీగా ఆదాయం సమకూరింది.గతంలో ప్రతి ఏటా టెండర్ల సమయంలోవ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి మద్దతు ధర కంటే చాలా తక్కువ ధరకు కొటేషన్లు వేసేవారు. అధికారుల సహకారంతో తక్కువ ధరలకే విక్రయాలు జరగడం వల్ల మార్క్‌ఫెడ్ తీవ్ర నష్టాలను చవిచూసింది. ఇప్పటికే ఈ సంస్థ రూ. 1000 కోట్ల నష్టాల్లో ఉండటంతో పాటు, మరో రూ. 2 వేల కోట్ల అప్పుల భారంతో కూరుకుపోయింది. ఈ పరిస్థితిని తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మార్క్‌ఫెడ్ అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి టెండర్ల ప్రక్రియలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు.మంత్రి ఆదేశాల మేరకు సిండికేట్లకు ఎలాంటి అవకాశం లేకుండా కేవలం ఈ-వేలం ద్వారానే టెండర్లు నిర్వహించాలని నిర్ణయించారు. క్వింటాలుకు మద్దతు ధర రూ.2,400 చొప్పున, టన్నుకు కనీసం రూ.24 వేల కంటే తక్కువ ధర వస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించకూడదని కఠిన నిబంధన పెట్టారు. దీనికి అనుగుణంగా మార్క్‌ఫెడ్ యాసంగి సీజన్‌లో రైతుల నుంచి సేకరించిన 14.60 లక్షల టన్నుల మొక్కజొన్నలో 10.98 లక్షల టన్నులకు గాను జులై 31, ఆగస్టు 1, ఆగస్టు 3 తేదీల్లో మూడు విడతలుగా విజయవంతంగా ఈ-వేలం నిర్వహించింది. అనంతరం సోమవారం అధికారులు ఆ టెండర్లను సమగ్రంగా పరిశీలించి ఖరారు చేశారు.ఈ మూడు విడతల వేలంలో మొక్కజొన్నకు ఊహించని విధంగా విశేష స్పందన లభించింది. టన్నుకు గరిష్ఠ ధర రూ. 26,500 పలకగా, ఇది వేలం కనీస ధర కంటే రూ. 2,500 ఎక్కువ కావడం విశేషం. కనిష్ఠ ధర కూడా మద్దతు ధర కంటే ఎక్కువగా రూ.24,100 గా నమోదైంది. మొత్తంగా ఈ విక్రయాల్లో సగటున టన్నుకు రూ. 25,370 ధర లభించింది. దీంతో మార్క్‌ఫెడ్‌కు కొనుగోలు వెచ్చించిన సొమ్ముతో పోలిస్తే టన్నుకు సుమారు రూ. 1,370 లాభం సమకూరింది. సరైన నిర్ణయాలు, పారదర్శక విధానాల వల్ల సంస్థకు ఈ స్థాయిలో లాభాలు రావడం పట్ల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంతోషం వ్యక్తం చేశారు.

తెలంగాణకు ప్రాజెక్టులు ఇచ్చినా.. కనిపించనా ఫలితం

హైదరాబాద్, ఆగస్టు 5 (న్యూస్ పల్స్)ఏపీలోని విజయనగరం జిల్లాలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోడీ అదే వేదిక నుంచి మరిన్ని ప్రాజెక్టులను కూడా ప్రారంభించారు. వీటిలో తెలంగాణలోకి ఖమ్మం, దేవరపల్లి ప్రాంతాలకు సంబంధించిన ప్రాజెక్టులు కూడా ఉన్నాయి.అ యితే.. వీటిని ప్రస్తావిస్తూ.. తెలంగాణ బీజేపీ నాయకులు ఎక్కడా ప్రకటన చేయకపోవడం.. కనీసంకార్యక్రమాన్ని కూడా నిర్వహించకపోవడం గమనార్హం. నిజానికి ఏపీలో ప్రారంభించిన పలు ప్రాజెక్టుల్లో తెలంగాణకు చెందినవి.. అనుబంధంగాఉన్న ప్రాజెక్టులు కొన్ని ఉన్నాయి. కానీ, ఆ తరహా జోష్ తెలంగాణలో కనిపించకపోవడం గమనార్హంమోడీ ప్రారంభించిన వాటిలో.. కీలకమైన తెలంగాణ ప్రాజక్టుల విషయానికి వస్తే.. ఖమ్మం-దేవరపల్లి మధ్య ప్రధాన ఎక్స్ ప్రెస్ వే నిర్మాణం కోసం.. కొన్నేళ్లుగా ఇక్కడివారు ఎదురు చూస్తున్నారు. పలు సందర్భాల్లో ప్రభుత్వం కూడా విజ్ఞాపలు సమర్పించింది. ఈ నేపథ్యంలోనే 'ఖమ్మం -దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ పోర్ లేన్స్ ఎక్స్‌ప్రెస్‌వే'ను కేంద్రం మంజూరు చేసింది. దీనిని తాజాగా ప్రధాని ప్రారంభించారు. అలాగే ఖమ్మం -దేవరపల్లి ప్యాకేజీలో భాగంగా.. ఎక్స్ ప్రెస్ వే పక్కన గ్రామీణ రహదారులను కూడా ప్రధాని ప్రారంభించారు. వీటిని మూడు సంవత్సరాల్లో పూర్తి చేయనున్నారు. ఈ ప్రాజెక్టు.. సీఎం రేవంత్ రెడ్డి కలల ప్రాజెక్టు అయిన.. ఫ్యూచర్ సిటీతోనూ అనుసంధానం చేయనున్నారు.

ఒడిస్సా సీఎం రేసులో ధర్మేంద్ర

భువనేశ్వర్, ఆగస్టు 5,నీట్ ప్రశ్నపత్రం లీకేజీ, దేశ విద్యావిధానంలో లోపాలపై ఇటీవల కాక్రోచ్ జనతాపార్టీ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నెల రోజులు ఆందోళన చేసింది. మంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామాకు డిమాండ్ చేసింది. చివరకు మంత్రి ప్రధాని వారించినా వినకుండా పదవికి రాజీనామా చేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో మంత్రి పదవికి రాజానీమా చేసిన ధర్మేంద్ర ప్రధాన్ ఇప్పుడు ఏం చేయబోతున్నారు అన్న ఆసక్తి దేశవ్యాప్తంగా నెలకొంది. ఒడిశా నుంచి కొన్ని సంకేతాలు వస్తున్నాయి. రాజీనామా తర్వాత వచ్చిన ప్రతిస్పందనలు భిన్నంగా ఉన్నప్పటికీ, ఇటీవల



భువనేశ్వర్ ఎయిర్‌పోర్టులో కార్యకర్తలు, మంత్రులు, ఎమ్మెల్యేలు ఇచ్చిన గ్రాండ్ వెల్కమ్ రాష్ట్ర రాజకీయాల్లో ఆయన పాత్రను గురించి కొత్త చర్చ మొదలైంది. నైతిక బాధ్యత తీసుకుని పదవి వదిలినట్లు చెప్పుకుంటున్నా, ఈ నిర్ణయం ఆయన రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందని కొందరు భావించారు. కానీ ఒడిశాలో మాత్రం విషయం వేరేలా కనిపిస్తోంది. ఎయిర్‌పోర్టు వద్ద జరిగిన స్వాగతం కేవలం ఆచారం కాదు. అనేక మంది రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరు కావడం ఆయనకు పార్టీలో ఇంకా బలమైన ఆధారం ఉందని స్పష్టం చేస్తోంది. రాజకీయ వర్గాలు దీన్ని ఆయన రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా మారే అవకాశంగా చూస్తున్నాయి.ప్రధాన్‌కు ముఖ్యమంత్రి పదవి ఇచ్చే అవకాశం ఉందని స్థానిక స్థాయిలో చర్చలు మొదలైంది. ఇది కొందరు స్థానిక నేతల్లో కలవరాన్ని కలిగిస్తోంది. 2024లో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పుడు ఆయన సీఎం అభ్యర్థిగా బలంగా ఉన్నప్పటికీ అధిష్ఠానం వేరే నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన తర్వాత మళ్లీ ఆ చర్చలు తలెత్తడం సహజం. అయితే వెంటనే మార్పు జరగడం సులభం కాదని పరిశీలకులు చెబుతున్నారు. ప్రస్తుత నాయకత్వం, సామాజిక సమీకరణలు, యువత అభిప్రాయం వంటి అంశాలు ఇందులో పాత్ర పోషిస్తాయి.ఇప్పటికీ అధికారికంగా ఏమీ స్పష్టం కాలేదు. ఆయనను కొంతకాలం విశ్రాంతి తీసుకునేలా చేయడం, పార్టీ సంస్థాగత పనుల్లో నియమించడం లేదా రాష్ట్ర రాజకీయాల్లో క్రమంగా పెద్ద పాత్ర ఇవ్వడం వంటి ఎంపికలు ముందున్నాయి. ఒడిశా బీజేపీలో ఆయనకు ఉన్న ప్రభావం, ఎమ్మెల్యేల మద్దతు బలంగా ఉన్నప్పటికీ, అంతిమ నిర్ణయం కేంద్ర అధిష్ఠానం చేతుల్లోనే ఉంది. ఆ నిర్ణయం ఎలా ఉంటుందనేది రాష్ట్రంలో అధికార సమీకరణలను, అంతర్గత సమతుల్యతను ప్రభావితం చేస్తుంది.ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఢిల్లీలో ఒక అధ్యాయం ముగిసినట్లు కనిపించినా, ఒడిశాలో మరో అధ్యాయం తెరవడానికి దారి తీస్తోంది. ఎయిర్‌పోర్టు స్వాగతం ఆ సంకేతాలను బలపరుస్తోంది. అయితే ఆయన రాష్ట్ర రాజకీయాల్లో ఎంత వరకు కీలకమవుతారు, సీఎం పాత్ర వైపు అడుగులు పడతాయా అనేది కేవలం సమయం, అధిష్ఠానం నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది

ఇన్సూరెన్స్ లేకపోతే..పెట్రోల్, డీజిల్ బంద్..

భువనేశ్వర్, ఆగస్టు 5బీమా లేని వాహనాలపై కఠిన చర్యలకు భారత అత్యున్నత న్యాయస్థానం సిద్ధమవుతోంది. మోటార్ థర్డ్-పార్టీ ఇన్సూరెన్స్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయించే లక్ష్యంతో సుప్రీంకోర్టు పలు కీలక ప్రతిపాదనలు చేసింది. ఇందులో భాగంగా, వాహనానికి చెల్లుబాటు అయ్యే బీమా ఉందో లేదో ధృవీకరించిన తర్వాతే పెట్రోల్, డీజిల్ సరఫరా చేసే విధానంపై పైలట్ ప్రాజెక్టును రూపొందించాలని భారత బీమా నియంత్రణ, అభివృద్ధి సంస్థ , కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖను ఆదేశించింది. ప్రతిపాదిత విధానం ప్రకారం, బీమా లేని వాహనాలకు అవసరమైన కవరేజీ పొందే వరకు ఇంధనం నిరాకరించే అవకాశాన్ని పరిశీలించనున్నారు. అయితే, ఇది ప్రస్తుతం కేవలం పైలట్ ప్రాజెక్టు మాత్రమేనని, దేశవ్యాప్తంగా వెంటనే అమల్లోకి రాదని స్పష్టం చేసింది.అంతే కాకుండా, ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ కెమెరాలను వాహన్ డేటాబేస్, బీమా డేటాబేస్‌లతో అనుసంధానించాలని కూడా సుప్రీంకోర్టు ప్రతిపాదించింది. దీంతో బీమా లేని వాహనాలను ఆటోమెటిక్‌గా గుర్తించి, అవసరమైతే ఇ-చలాన్లు జారీ చేసే అవకాశం ఉంటుంది. ఇప్పటికే అతివేగం, రెడ్ సిగ్నల్ ఉల్లంఘన, రాంగ్ సైడ్ డ్రైవింగ్ వంటి ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను గుర్తించేందుకు ఉపయోగిస్తున్న ఎఐఖఖీ వ్యవస్థను బీమా ధృవీకరణకు కూడా వినియోగించాలని సూచించింది.రోడ్డు తనిఖీల సమయంలో ట్రాఫిక్ పోలీసులకు మొబైల్ యాప్‌లు లేదా హ్యాండ్‌హెల్డ్ పరికరాలను అందించి, వాహన బీమా వివరాలను తక్షణమే పరిశీలించేలా చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు పేర్కొంది. దీంతో భౌతిక బీమా పత్రాలపై ఆధారవడకుండా అధికారులు ఆన్‌లైన్‌లోనే బీమా స్థితిని నిర్ధారించగలరు.కొత్తగా కొనుగోలు చేసే వాహనాలకు తప్పనిసరి థర్డ్-పార్టీ బీమా కాలపరిమితిని కూడా పెంచాలని సుప్రీంకోర్టు సూచించింది. కొత్త ప్రైవేట్ కార్లకు ప్రస్తుతం ఉన్న మూడు సంవత్సరాల బీమాను నాలుగు సంవత్సరాలకు, ద్విచక్ర వాహనాలకు ఐదు సంవత్సరాల బీమాను ఆరు సంవత్సరాలకు పొడిగించాలని ప్రతిపాదించింది. ప్రారంభ బీమా గడువు ముగిసిన తర్వాత బీమా పునరుద్ధరించకుండా రోడ్లపై తిరిగే వాహనాల సంఖ్యను తగ్గించడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని కోర్టు పేర్కొంది. ఇప్పుడు ఈ ప్రతిపాదనలను ఎలా అమలు చేయాలనే అంశాన్ని సంబంధిత అధికారులు పరిశీలించనున్నారు.



మళ్లీ తెరపైకి కావేరి అంశం...

బెంగళూరు, ఆగస్టు 5, ఈ సమస్య ఇప్పటిది కాదు. దశాబ్దాలు నాటిది. ఇంతవరకు పరిష్కార మార్గం దొరకలేదు. పరిష్కరించే బాధ్యత ఎవరూ తీసుకోలేదు.. ఎవరి రాజకీయ ప్రయోజనాలు వారు చేసుకున్నారు.అందువల్లే ఈ సమస్య మళ్లీ రిపీట్ అయింది. ఈసారి రాచ పుండు మాదిరిగా ఇబ్బంది పెడుతోంది. రెండు రాష్ట్రాల మధ్య ఇబ్బంది కరమైన వాతావరణానికి కారణమవుతోంది. దక్షిణాది రాష్ట్రాలలో ప్రముఖమైనవి తమిళనాడు, కర్ణాటక. ఈ రెండు రాష్ట్రాల మధ్య కావేరి నదీ జలాల వివాదం చాలా సంవత్సరాలుగా కొనసాగుతోంది.ప్రస్తుతం కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. తమిళనాడులో కూడా కాంగ్రెస్ పార్టీ సపోర్ట్ తో విజయ్ ప్రభుత్వానికి కొనసాగిస్తున్నారు. కావేరి జలాల వివాదం నేపథ్యంలో ఈ రెండు రాష్ట్రాల మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ఈ వివాదం కాంగ్రెస్ పార్టీకి జీవన్మరణ సమస్యగా మారిపోయింది. కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. తమిళనాడులో అధికార పార్టీకి సపోర్ట్ చేస్తోంది. రెండు రాష్ట్రాలలో నాయకులకు బలమైన సెంటిమెంట్లను కాంగ్రెస్ పార్టీకి ఏం చేయాలో అర్థం కావడం లేదు . ఇందులో ఏమాత్రం పొరపాటు జరిగినా సరే కాంగ్రెస్ పార్టీ దుకాణం సర్దుకోవాల్సిందే .ఇటీవల రివర్ రెగ్యులేషన్ కమిటీ కీలక ఆదేశాలు జారీ చేసింది. దాని ప్రకారం తమిళనాడు రాష్ట్రానికి రోజు 3500 క్యూసెక్కుల కావేరి నది నీటిని విడుదల చేయాలి. ఈ ఆదేశాలు రావడమే ఆలస్యం కర్ణాటకలో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. వర్షాలు లేకపోవడంతో సరిగ్గా నీటి నిల్వలేదని.. ఇలాంటి సమయంలో నీరు విడుదల చేయడం కష్టమని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే క్లారిటీ ఇచ్చారు. అయితే పరిస్థితి చేయి దాటిపోతున్న నేపథ్యంలో నేరుగా కర్ణాటక వచ్చి శివకుమార్ తో మాట్లాడాలని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నిర్ణయించారు. అయితే కర్ణాటక రాష్ట్రంలో అక్కడి ప్రజలు.. ఇతర సంఘాల నుంచి తిరుగుబాటు వివరీతంగా ఉండడంతో విజయ్ పర్యటనను రద్దు చేసుకోవాలని శివకుమార్ సూచించారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కర్ణాటక రాష్ట్రానికి అసలు రావద్దని శివకుమార్ విజయ్ కి సూచించారు.తమిళనాడు రాజకీయాలను కావేరి నది నీటిని వేరుగా చూడడం సాధ్యం కాదు . కావేరి నది నీటి ఆధారంగానే తమిళనాడు రైతులు పంటలు సాగు చేస్తుంటారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో కర్ణాటక ఒత్తిడికి తలవంచితే విజయ్ కి తమిళనాడు రాష్ట్రంలో ఇబ్బందికరమైన పరిణామం ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలోనే విజయ్ ప్రభుత్వం కావేరి నది జలాల వ్యవహారాన్ని సుప్రీంకోర్టులో తేల్చుకోవాలని భావించింది. మరోవైపు విజయ్ క్యాబినెట్ లో ఉన్న చాలామంది

మంత్రులు కర్ణాటక ముఖ్యమంత్రి మీద తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నారు. కావేరి నది నీళ్లు విడుదల చేయకపోతే.. విజయ్ తన ప్రభుత్వానికి సంబంధించి కాంగ్రెస్ ఇచ్చిన సపోర్ట్ పై ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అక్కడ మీడియాలో వార్తలు వస్తున్నాయి.తమిళనాడు మంకుపట్టు వీడకపోవడం.. కర్ణాటక ప్రభుత్వం పట్టుదలతో ఉండడంతో కావేరి వివాదం కాంగ్రెస్ పార్టీకి చాలా ఇబ్బందికరంగా మారింది. కర్ణాటక ముఖ్యమంత్రి పై స్థానిక రైతులు.. బిజెపి.. జెడిఎస్ పార్టీల నుంచి ఒత్తిడి వస్తోంది. ఒకవేళ కర్ణాటక రాష్ట్రం నుంచి తమిళనాడుకు కావేరి నది జలాలు విడుదల చేస్తే మాత్రం కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ తుడిచి పెట్టుకోపోయే ప్రమాదం ఉంది. అందువల్లే ఓటు బ్యాంకు ను కాపాడుకోవడానికి.. బిజెపి వేసిన ఉచ్చు నుంచి రక్షించుకోవడానికి కాంగ్రెస్ పార్టీ అనేక రకాల ప్రయత్నాలు చేస్తుంది. దీనికి తోడు ఇటీవల శివకుమార్ ఆధ్వర్యంలో తమిళనాడు ప్రభుత్వం ప్రతిపాదించిన మేకదాటు ప్రాజెక్టును ఏకపక్షంగా వ్యతిరేకించారు. దీంతో రెండు రాష్ట్రాల మధ్య వివాదం మరింత పెరిగింది. ఈ రెండు రాష్ట్రాల్లో ప్రాంతీయ సెంటిమెంట్లు అధికంగా ఉంటాయి.. ఈ సెంటిమెంట్లకు రెచ్చెక్ట్ ఇవ్వకపోతే కాంగ్రెస్ పార్టీ పుట్టి కావేరిలో మునగడం ఖాయం

ఆగస్టు 11న 'రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్తాన్ కొత్త దేశం

న్యూఢిల్లీ, ఆగస్టు 5, (న్యూస్ పల్స్) బలూచిస్తాన్.. పాకిస్తాన్‌లో అతిపెద్ద రాష్ట్రం. 45 శాతం భూభాగం కలిగి ఉంటుంది. 1948లో బలూచిస్తాన్‌ను పాకిస్తాన్ బలవంతంగా కలుపుకుంది. కొన్ని రోజులు బాగానే ఉన్నా.. వివక్షతో బలూచిస్తాన్ పాకిస్తాన్ నుంచి విడిపోవాలని కోరుకుంటోంది. ఈ క్రమంలో స్వాతంత్ర్యం కోసం పోరాటం దశాబ్దాలుగా కొనసాగుతోంది. ఇటీవల స్వయంప్రకటిత "రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్తాన్" పేరుతో స్వాతంత్ర్యం ప్రకటించుకుంది.ఆగస్టు 11న స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకోవాలని పిలుపునిచ్చింది.బలూచిస్తాన్.. పాకిస్తాన్‌లో అతిపెద్ద రాష్ట్రం. 45 శాతం భూభాగం కలిగి ఉంటుంది.1948లో బలూచిస్తాన్‌ను పాకిస్తాన్ బలవంతంగా కలుపుకుంది. కొన్ని రోజులు బాగానే ఉన్నా.. వివక్షతో బలూచిస్తాన్ పాకిస్తాన్ నుంచి విడిపోవాలని కోరుకుంటోంది. ఈ క్రమంలో స్వాతంత్ర్యం కోసం పోరాటం దశాబ్దాలుగా కొనసాగుతోంది. ఇటీవల స్వయంప్రకటిత "రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్తాన్" పేరుతో స్వాతంత్ర్యం ప్రకటించుకుంది. ఆగస్టు 11న స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకోవాలని పిలుపునిచ్చింది.బలూచ్ జాతీయవాదులు 1947 ఆగస్టు 11న కలాత్ రాజ్యం (ఆధునిక బలూచిస్తాన్‌లోని ముఖ్య భాగం) స్వతంత్రంగా ప్రకటించబడిందని చెబుతారు. బ్రిటిష్ వైదొలగడం సమయంలో కలాత్ ఖాన్‌తో స్టాండ్‌స్టిల్ ఒప్పందం కుదిరి, దానిని స్వతంత్ర సార్వభౌమ రాజ్యంగా గుర్తించినట్లు కొన్ని నివేదికలు ఉన్నాయి. అయితే 1948 మార్చిలో పాకిస్తాన్ సైన్యం జోక్యం చేసుకుని కలాత్‌ను విలీనం చేసింది. బలూచ్ వైపు ఇది బలవంతపు విలీనం అని, పాకిస్తాన్ వైపు ఇది చట్టబద్ధమైన అనుసంధానం అని వాదనలు ఉన్నాయి. అయితే ఈ చారిత్రక అసంతృప్తి ఆధారంగా 1948 నుంచి అనేక తిరుగుబాటు దశలు జరిగాయి. ప్రస్తుత ఉద్యమం దాని కొనసాగింపుగా కనిపిస్తుంది.2026 జూలైలో మిర్ యార్ బలోచ్ వంటి నాయకులు "రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్తాన్" పేరుతో స్వాతంత్ర్యం ప్రకటించారు. వారు జాతీయ జెండా, గీతం, కరెన్సీ (బలోచి ఫాలస్) ప్రవేశపెట్టినట్లు, 85 శాతం భూభాగంపై నియంత్రణ ఉన్నట్లు, స్వంత పరిపాలనా వ్యవస్థ ఉన్నట్లు దావా చేశారు. ఆగస్టు 3, 2026న ఆగస్టు 11ను స్వాతంత్ర్య దినోత్సవంగా ప్రకటించి, ప్రపంచవ్యాప్తంగా జెండా ఎగురవేసి జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఇది 1947 చారిత్రక తేదీపై ఆధారపడి ఉంది. అయితే ఈ దావాలు స్వతంత్రంగా ధ్రువీకరించబడలేదు. ఏ దేశం లేదా అంతర్జాతీయ సంస్థ ఈ "రిపబ్లిక్"ను గుర్తించలేదు. బలూచిస్తాన్ అంతర్జాతీయంగా పాకిస్తాన్ ప్రావిన్స్‌గానే కొనసాగుతోంది.బలూచ్ వైపు ప్రధాన ఆరోపణ సహజ వనరులు (గ్యాస్, ఖనిజాలు, గ్వాదర్ పోర్ట్) స్థానికులకు ప్రయోజనం లేకుండా చైనా?పాక్ ఎకనామిక్ కారిడార్ ద్వారా బయటకు వెళ్తున్నాయని, యువతపై అణచివేత, మహిళలు మాయం కావడం వంటి మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయని పేర్కొంటోంది. బీఎల్ఏ వంటి సమూహాలు ఈ కారణాలతో పోరాటం చేస్తున్నాయని చెబుతాయి. ఈ ఆరోపణలు హ్యూమన్ రైట్స్ సంస్థలు, కొన్ని అంతర్జాతీయ నివేదికలలో కూడా ప్రస్తావించబడ్డాయి. అదే సమయంలో పాకిస్తాన్ ఈ సమూహాలను ఉగ్రవాద సంస్థలుగా పరిగణిస్తుంది. బీఎల్ఏను కొన్ని దేశాలు విదేశీ ఉగ్రవాద సంస్థగా గుర్తించాయి.బీఎల్ఏ, ఇతర సమూహాలు సైనిక స్థావరాలు, మౌలిక వసతులపై దాడులు చేస్తూ ఉన్నాయి. 2026లో కోఆర్డినేటెడ్ దాడులు జరిగాయి, కానీ పాకిస్తాన్ సైన్యం కౌంటర్?ఆపరేషన్లు కొనసాగిస్తోంది. ప్రావిన్స్‌పై పూర్తి నియంత్రణ బలూచ్ సమూహాల చేతుల్లో ఉందన్న దావా స్వతంత్ర మూలాల ద్వారా నిర్ధారించబడలేదు. పాకిస్తాన్ ప్రభుత్వం, సైన్యం ఇప్పటికీ అధికారిక నిర్వహణలో ఉన్నాయి. స్వాతంత్ర్య ప్రకటన చట్టపరంగా రాజకీయ వ్యక్తీకరణగా ఉండవచ్చు, కానీ ప్రభావవంతమైన ప్రభుత్వం, విదేశీ సంబంధాల సామర్థ్యం రాష్ట్రంగా నిలబడటానికి అవసరమైన అంశాలు లేవు.బలూచిస్తాన్ సమస్య చారిత్రక అసంతృప్తి, వనరుల పంపిణీ అసమానత, మానవ హక్కుల ఆరోపణలు, సాయుధ పోరాటాల మిశ్రమం. స్వయంప్రకటిత స్వాతంత్ర్యం గుర్తింపు పొందకపోయినా, ఉద్యమం కొనసాగుతోంది. శాంతియుత రాజకీయ పరిష్కారం, స్థానిక అభివృద్ధి, మానవ హక్కుల రక్షణ లేకుండా ఈ సంఘర్షణ మరింత సంక్లిష్టం కావచ్చు. పాకిస్తాన్ ఎలా స్పందిస్తుందో, అంతర్జాతీయ సమాజం ఎలా చూస్తుందో ఆగస్టు 11 తర్వాత స్పష్టం అవుతుంది.

యాక్టివ్ పాలిటిక్స్ లోకి నల్లారి

హైదరాబాద్, ఆగస్టు 5, (న్యూస్ పల్స్)ఏపీ బీజేపీలో చాలామంది నేతలు ఉన్నారు. మొన్నటి ఎన్నికల్లో ఆ పార్టీ నేతలు బాగానే గెలిచారు. 8 మంది ఎమ్మెల్యేలు ఆ పార్టీ నుంచి విజయం సాధించారు. మరో ముగ్గురు ఎంపీలు సైతం ఉన్నారు. ఒక రాష్ట్ర మంత్రి తో పాటు కేంద్ర మంత్రి కూడా ఉన్నారు.. ఎందరు ఉన్న బిజెపి పెద్దగా సౌండ్ చేయడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి లైన్ లోకి వచ్చారు. ప్రెస్ మీట్ పెట్టి రాష్ట్రాల మధ్య జలవివాదం గురించి మాట్లాడారు. ఏపీ ప్రభుత్వానికి కీలక సూచనలు చేశారు. జలవివాదాలు విషయంలో ఎటువంటి మొహమాటలకు పోవద్దని.. పక్క రాష్ట్రాలతో చర్చలు జరిపి పరిష్కరించుకోవాలని సూచించారు. అవసరం అనుకుంటే పోరాటం చేయాలని కూడా పిలుపునిచ్చారు. రాష్ట్ర విభజన సాహేతుకంగా జరగలేదని.. అప్పట్లోనే జల పంపకాలు చేపడుతూనే వివాదాలు పరిష్కరించుంటే ఇంతవరకు పరిస్థితి వచ్చి ఉండేది కాదు అని అభిప్రాయపడ్డారు



కిరణ్ కుమార్ రెడ్డి.ఉమ్మడి రాష్ట్రానికి చివరి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి. రాజశేఖర్ రెడ్డి అకాల మరణంతో రోశయ్య ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన స్వచ్ఛందంగా తప్పుకోవడంతో.. స్పీకర్ గా ఉన్న కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. అయితే ఆయన హయాంలోనే రాష్ట్ర విభజన జరిగింది. దానిని తీవ్రంగా వ్యతిరేకించారు కిరణ్ కుమార్ రెడ్డి. కాంగ్రెస్ అగ్ర నాయకత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆ పార్టీ నుంచి బయటకు వచ్చేసారు. సొంతంగా సమైక్యాంధ్ర పార్టీని ఏర్పాటు చేశారు. కానీ అది అంతగా వర్కౌట్ కాలేదు. చివరకు బిజెపిలోకి వచ్చి ఆ పార్టీ తరఫున మొన్నటి ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. ఇప్పుడు ఉన్నట్టుండి మీడియా ముందుకు వచ్చి రాష్ట్ర విభజన సమస్యలు, జలవివాదాలు గురించి ప్రస్తావించడం ప్రాధాన్యత సంతరించుకుంది.ప్రస్తుతం గోదావరి తో పాటు కృష్ణా జలాలకు సంబంధించి వివాదాలు నడుస్తున్నాయి. ప్రధానంగా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య జలవివాదం ఉంది. ఆపై పోలవరం ప్రాజెక్టు విషయంలో ఒడిస్సా తో పాటు చత్తీస్గడ్ తో కూడా వివాదం నడుస్తోంది. వాటన్నింటినీ పరిష్కరించుకోవాలని ఏపీ ప్రభుత్వానికి కిరణ్ కుమార్ రెడ్డి సూచించడం గమనార్హం. అవసరం అనుకుంటే కేంద్ర ప్రభుత్వంతో గట్టిగా మాట్లాడాలని సూచిస్తున్నారు కిరణ్. ఎన్నికల వరకు మాత్రమే పొత్తు కానీ.. పార్టీలు, ప్రభుత్వం వేరు అన్న విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. అయితే చాలా రోజులకు కిరణ్ కుమార్ రెడ్డి ముందుకు రావడం గమనార్హం. రాష్ట్రం కోసం కీలక సూచనలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే రాజ్యసభ ఎన్నికల సమయంలో కిరణ్ కుమార్ రెడ్డి పేరు ప్రముఖంగా వినిపించింది. కానీ వివిధ సమీకరణల్లో ఆయనకు పదవి దక్కలేదు. ఇప్పుడు ఆయన పొలిటికల్ గా యాక్టివ్ అవుతారన్న టాక్ వినిపిస్తోంది. అందులో భాగంగానే సరిహద్దు జలాల వివాదంపై మాట్లాడుతున్నారని ప్రచారం సాగుతోంది. మరి చూడాలి ఆయన పాత్ర ఎలా ఉండబోతుందో..

భూ పరిహార చెల్లింపులో జాప్యం

ఆర్డీవో కార్యాలయ ఆస్తుల జప్తుకు కోర్టు ఆదేశం

వికారాబాద్ ,వికారాబాద్లో దాదాపు నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ పరిహార వివాదం సంచలన మలుపు తిరిగింది. కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ రైతుకు చెల్లించాల్సిన పరిహారం ఇప్పటికీ అందించకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన వికారాబాద్ సీనియర్ సివిల్ కోర్టు... ఏకంగా ఆర్డీవో కార్యాలయంలోని కదిలే ఆస్తులను జప్తు చేయాలని ఆదేశించింది. కోర్టు బెలిఫ్ కార్యాలయానికి చేరుకుని జప్తు ప్రక్రియ చేపట్టగా, అనంతరం రెండు నెలల్లో రూ. 61.29 లక్షల పరిహారం చెల్లిస్తామని అధికారులు రాతపూర్వక హామీ ఇవ్వడంతో జప్తు చేసిన వస్తువులను తిరిగి కార్యాలయ కస్టడీకే అప్పగించారు. 1986-87లో రైల్వే ప్రాజెక్టు కోసం రైతు శశాంక్ రెడ్డికి చెందిన భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోగా, అప్పట్లో గజానికి కేవలం రూ. 50 మాత్రమే పరిహారం నిర్ణయించారు.

కాంగ్రెస్, బిఆర్ఎస్ ల మధ్య క్షుద్ర పూజల పంచాయితీ

హైదరాబాద్, ఆగస్టు 5 (న్యూస్ పల్స్)నేటి కాలంలో కూడా బ్లాక్ మ్యాజిక్ నమ్ముతారా.. ఏవో శక్తులు ఉన్నాయంటే విశ్వసించాలా.. నిజంగానే.. దయ్యాలు.. ఉన్నాయా.. ఉంటే వాటికి పూజలు చేసి వశం చేసుకోవచ్చా.. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న ప్రస్తుతం పరిణామాలు దయ్యాలు.. క్షుద్ర పూజల చుట్టూ తిరుగుతున్నాయి.. ప్రస్తుతం మనం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలో ఉన్నాం. అరచేతులలో ప్రపంచం మొత్తాన్ని నులువుగా చూడగలుగుతున్నాం. ఏం జరిగిందో వెంటనే తెలుసుకోగలుగుతున్నాం. ఏం జరుగుతుందో కూడా అంచనా వేయగలుగుతున్నాం. ఇటువంటి కాలంలో క్షుద్ర పూజలు చేయడం ఏంటి.. ఎదుటివారి కీడును కోరుకునేందుకు పూజలు చేయడమేంటి.. వీటి ద్వారా అవన్నీ జరుగుతాయా.. అసలు అవన్నీ సాధ్యమేనాఇటీవల భారత రాష్ట్ర సమితి సీనియర్ నాయకుడు తన్నీరు హరీష్ రావు పుణ్యక్షేత్రాలను సందర్శించారు. తెలుగు రాష్ట్రాలలోనే కాకుండా.. ఇతర ప్రాంతాలలో ఉన్న ప్రఖ్యాతమైన క్షేత్రాలను ఆయన సందర్శించారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ ఈ క్షేత్రాలను సందర్శించడం వెనక కారణం వేరే ఉందని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు.. ముఖ్యంగా చిత్ర పూజలు చేయడానికి హరీష్ రావు వేరే ప్రాంతాలలో ఉన్న క్షేత్రాలను సందర్శించారని.. అక్కడ క్షుద్ర పూజలు కూడా చేశారని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు.పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఏకంగా విలేకరుల ముందుకు వచ్చి హరీష్ రావును తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను చూసి ఓర్వలేక క్షుద్ర పూజలు చేశారని ఆరోపించారు. భారత రాష్ట్ర సమితి నాయకులకు క్షుద్ర పూజలు చేయడం అలవాటేనని ఆయన పేర్కొన్నారు. హరీష్ రావు ఎక్కడికి వెళ్లింది.. ఎవరిని కలిసింది.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టడానికి ఏ తరహాలో వ్యవహరించింది అంతా తెలుసని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.మరోవైపు హరీష్ రావు మీద చేస్తున్న ఆరోపణల పట్ల ఆయన వర్గం నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులకు మతిభ్రమించిందని.. ప్రజలకు ఎటువంటి మంచి పనులు చేయకపోగా.. డైవర్షన్ పాలిటిక్స్ కోసం ఇటువంటి ఆరోపణలు చేస్తున్నారని హరీష్ వర్గం నాయకులు మండిపడుతున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ నాయకులు మీద హరీష్ రావు లీగల్ నోటీసులు ఇచ్చారు. తాను క్షుద్ర పూజలు చేశానని ఆరోపిస్తున్న కాంగ్రెస్ నాయకులు క్షమాపణ చెప్పాలని.. లేకపోతే పరువు నష్టం దావా ఎదుర్కోవాల్సి ఉంటుందని హరీష్ రావు ఆ నోటీసులలో పేర్కొన్నారు. ఇటీవల కుటుంబంతో కలిసి హరీష్ రావు వివిధ పుణ్యక్షేత్రాలను సందర్శించారు. అయితే ఆ పుణ్యక్షేత్రాల సందర్శన వెనక క్షుద్ర పూజలు ఉన్నాయని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. హరీష్ రావు ఎన్ని రకాల పూజలు చేసినప్పటికీ గెలిచేది కాంగ్రెస్ పార్టీనేనని.. మళ్లీ కాంగ్రెస్ పార్టీని తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని హస్తం నేతలు స్పష్టం చేస్తున్నారు.

జార్ఖండ్ విద్యార్థులు నిరవధిక నిరాహార దీక్ష.. వాంగ్‌చుక్ అభ్యర్థన మేరకు నీరు తాగిన స్టూడెంట్ లీడర్



రాంచి: జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఇతర పోటీ పరీక్షల్లో అవకతవకలు, అక్రమాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జార్ఖండ్ విద్యార్థి నాయకుడు దేవేంద్ర నాథ్ మహతో, మరో ఐదుగురు విద్యార్థులు జూలై 3 నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నారు. సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్, జార్ఖండ్ విద్యార్థుల నిరసనకు సంఘీభావం ప్రకటించారు. స్టూడెంట్ లీడర్ దేవేంద్రతో బుధవారం వీడియో కాల్‌లో మాట్లాడారు. ఆయన ఆరోగ్యం క్షీణించడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం మంచి నీరైనా తాగాలని సూచించారు. దీంతో వాంగ్‌చుక్ విజ్ఞప్తి మేరకు దేవేంద్ర నీరు తాగారు.కాగా, నీరు తాగినంత మాత్రాన తన నిరసన ముగిసినట్లు కాదని దేవేంద్ర మహతో స్పష్టం చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించే వరకు తాను నిరాహార దీక్ష కొనసాగిస్తానని, ఆహారం తీసుకోబోనని చెప్పారు. జార్ఖండ్ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు గురువారం నుంచి ప్రారంభం కావడంతో విద్యార్థులు తమ నిరసనను తీవ్రం చేశారు. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షను రద్దు చేయాలని, జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్‌లో సమగ్ర సంస్కరణలు తీసుకురావాలని, పరీక్షల అవకతవకలపై సీబీఐ లేదా రాష్ట్రం వెలుపలికి చెందిన విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తులతో కూడిన స్వతంత్ర కమిటీ ద్వారా విచారణ జరుపాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.

గుర్రంగూడెం రోడ్డును తక్షణమే బాగు చేయాలని రైతుల నిరసన



చంద్రుగొండ, ఆగస్టు 05 : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే ఆదినారాయణ చంద్రుగొండ మండలం గుర్రంగూడెం గ్రామానికి వెళ్లే రోడ్డును బాగు చేయాలని గ్రామానికి చెందిన రైతులు రోడ్డుపై బురద నీటిలో నిలబడి బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చంద్రుగొండ నుండి గుర్రంగూడెం గ్రామానికి వెళ్లాలంటే గుంతలు గుంతలుగా రోడ్డు తయారైందన్నారు. రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద మీటర్ లోతు నీళ్లు నిలిచి రాకపోకలు తీవ్ర అంతరాయం ఏర్పడిందని తెలిపారు. గ్రామంలోని రైతులు తమ వ్యవసాయ భూములకు మోటార్ సైకిల్, ఆటోలపై మందు కట్టలు, ఎరువులు తీసుకెళ్లాలంటే నానా ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం విద్యార్థులు బురద నీటిలో పడుతూ పాఠశాలలకు వెళ్లలేకపోతున్నట్లు వెల్లడించారు. ఇన్ని ఇబ్బందులు పడుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. తక్షణమే రోడ్డుకు మరమ్మతులు చేయకపోతే చంద్రుగొండ జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు.

నితిన్ గడ్కరీ డీప్‌ఫేక్ వీడియోలను వెంటనే తొలగించండి : బాంబే హైకోర్టు

న్యూఢిల్లీ, ఈ20 పెట్రోల్‌విషయంలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని లక్ష్యంగా చేసుకుని పలువురు నెటిజన్‌లు ఆన్‌లైన్‌లో డీప్‌ఫేక్ వీడియోలు పోస్టులు పెట్టడంపై బాంబే హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. కేంద్రమంత్రిని, ఆయన కుటుంబాన్ని ఇంధన వివాదంతో ముడిపెడుతున్న ఏఐ వీడియోలు, పోస్టులను వెంటనే తొలగించాలని మెటా, గూగుల్ సహా పలు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ను ఆదేశించింది.అది అత్యంత నీచమైన కంటెంట్ అని హైకోర్టు మండిపడింది. ఆన్‌లైన్‌లో ఇలాంటి పోస్టులకు చోటు ఉండకూడదని అభిప్రాయపడింది. బాధితులు న్యాయస్థానాలను ఆశ్రయించకుండానే ఇలాంటి నకిలీ పోస్టులను తొలగించడానికి ఏదైనా యంత్రాంగం ఉందా..? అని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లను



న్యాయస్థానం ఈ సందర్భంగా ప్రశ్నించింది. విస్తృతమైన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నప్పుడు తప్పుడు పోస్టులపై చర్యలు తీసుకునే యంత్రాంగం మాత్రం ఎందుకు లేదని కోర్టు నిలదీసింది.వ్యక్తుల పరువుకు భంగం కలిగించేలా ఉండే పోస్టులను స్వచ్ఛందంగా తొలగించాలని సూచించింది. ఈ20 (ఇ20) పెట్రోల్‌తో తన కుటుంబం లబ్ధి పొందుతోందంటూ కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని గడ్కరీ ఇటీవల తెలిపారు. దీనిపై ఆన్‌లైన్‌లో డీప్‌ఫేక్ వీడియోలు పెడుతున్నారని పేర్కొంటూ ఆయన బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ఈ విషయంలో తన పరువుకు భంగం కలిగించినందుకుగానూ రూ. 11 కోట్ల నష్టపరిహారం కోరారు. ఇథనాల్-బ్లెండింగ్ కార్యక్రమం పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరుగుతుందని, ఇందులో తనకు వ్యక్తిగతంగా ఎలాంటి సంబంధం లేదని గడ్కరీ స్పష్టంచేశారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పిల్లలు పుడితే ఒక గ్రామ్ బంగారు ఉంగరం.. తమిళనాడు బడ్జెట్‌లో ప్రకటన

తమిళనాడు ప్రభుత్వం బుధవారం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టింది. విజయ్ టీవీకే ఆధ్వర్యంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ ఇది. తమిళనాడు ఆర్థిక శాఖ మంత్రి ఎన్ మేరీ విల్సన్ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. 2036లోపు తమిళనాడు ఆర్థిక వ్యవస్థను 1.5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా కీలక పథకాల్ని ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పిల్లలు పుడితే వారికి ఒక గ్రామ్ బంగారం అందించే పథకాన్ని కూడా ప్రభుత్వం అమలు చేయనుంది. ఈ బడ్జెట్‌లోని కొన్ని కీలక అంశాలివి. 'తాయ్ మామన్ తంగా మోతిరం తిట్టం' పథకం కింద ప్రభుత్వ ఆస్పత్రుల్లో జన్మించే ప్రతి బిడ్డకు 1 గ్రామ్ బంగారు ఉంగరాన్ని అందిస్తారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఆర్థిక సాయాన్ని పెంచనున్నారు. దీనివల్ల 1.93 లక్షల కుటుంబాలకు ప్రతి ఏటా రూ.7,000 వరకు ఆర్థిక సాయం అందిస్తారు.



ఇందుకోసం రూ.135 కోట్లు కేటాయించారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు 'అన్నన్ నీర్ తిట్టమ్' అనే పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీనికింద వధువుకు 8 గ్రాముల బంగారంతోపాటు ఒక పట్టుచీరను అందిస్తారు. వెట్రి ల్యాప్‌టాప్ స్కీమ్ కింద అర్హులైన పేద విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేస్తారు. రైతులకు విద్యుత్ సబ్సిడీ కింద రూ.7,432 కోట్లు కేటాయించింది. రైతులు, వ్యవసాయ రంగం సంక్షేమానికి రూ.14,984 కోట్లు కేటాయించింది. అరివగం పేరుతో దేశంలోనే మొదటి ఏఐ అండ్ ఇన్నోవేషన్ సిటీని ఏర్పాటు చేస్తారు. అలాగే, తూతుకుడి, తిరునెల్వేలి ప్రాంతాల్ని స్పేస్ ఇండస్ట్రియల్ ఇన్వెస్ట్‌మెంట్ జోన్‌గా ప్రకటించారు.మహిళా సాధికారతలో భాగంగా స్వయం సహాయక గ్రూపులకు రూ.38,000 కోట్లు కేటాయించారు. ప్రభుత్వ ఉద్యోగులకు అందించే హెల్త్ ఇన్సూరెన్స్ స్కీంను రూ.5 లక్షల నుంచి రూ.7.5 లక్షలకు పెంచబోతున్నారు. గరిష్టంగా రూ.12 లక్షలతో మరో హెల్త్ ఇన్సూరెన్స్ స్కీం కూడా ఉంది. 12 జిల్లాల్లో 12 వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేస్తారు. మధురైలో ప్రత్యేక లా కాలేజీని ఏర్పాటు చేస్తారు. 2027-28 విద్యాసంవత్సరం నుంచి ఇది ప్రారంభమవుతుంది. రాష్ట్రంలో ఉన్నత విద్య కోసం రూ.8,393 కోట్లు కేటాయించారు. అలాగే, కొత్తగా ఐదు ఐటీఐలను ఏర్పాటు చేస్తారు. ప్రభుత్వ స్కూళ్లలో 11వ తరగతి చదివే విద్యార్థులకు హెల్మెట్, లైట్స్, వాటర్ బాటిల్స్‌తో కూడిన సైకిళ్లు అందజేస్తారు.

'సిద్ధివినాయక ఆలయం విరాళాలపై ఆడిట్ చేయండి'.. షిండే ఆదేశం

ముంబై: మహారాష్ట్ర రాజధాని ముంబైలోని ప్రసిద్ధ సిద్ధివినాయక ఆలయం విరాళాల చోరీ ఆరోపణలపై డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే స్పందించారు. ఐదేళ్లుగా ఆలయానికి అందిన నగదు విరాళాలు, ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులపై ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఆడిట్ నిర్వహించి, సవివరమైన నివేదికను సిద్ధం చేసేందుకు అదనపు ప్రధాన కార్యదర్శి అసిమ్ గుప్తాను ఆయన నియమించారు. ప్రత్యేక ఆడిట్‌లో ఏవైనా అవకతవకలు బయటపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.కాగా, దేశంలోనే అత్యంత సంపన్న దేవాలయాలలో ఒకటిగా పరిగణించే సిద్ధివినాయక ఆలయం విరాళాలు చోరీ అవుతున్నట్లు మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) అధినేత రాజ్ ఠాక్రే ఆరోపించారు. ఉద్యోగుల చేతివాటం వల్ల ప్రతి ఏటా రూ.18 కోట్ల విరాళాలు దొంగతనానికి గురవుతున్నాయని పార్టీ కార్యక్రమంలో తెలిపారు. అయోధ్యలోని రామ మందిరం నుంచి రూ. 1,400 కోట్లు



అదృశ్యమయ్యాయని, సిద్ధివినాయక ఆలయం కూడా ఇలాంటి సమస్యనే ఎదుర్కొంటున్నదని రాజ్ ఠాక్రే విమర్శించారు. ఎనిమిది మంది ట్రస్టీలు ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేకు రాసిన లేఖను ఆయన చదివి వినిపించారు.మరోవైపు సిద్ధివినాయక ఆలయ ట్రస్ట్ చైర్మన్, శివసేన షిండే వర్గం నేత సదా సర్వంకర్ కూడా ఈ ఆరోపణలను ధృవీకరించారు. అక్రమాల గురించి తాను స్వయంగా ఏసీబీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సీసీటీవీలో అనుమానాస్పదంగా కనిపించిన ట్రస్ట్ అధికారులను తొలగించినట్లు చెప్పారు. ప్రధాన నిందితుడు రాజన్ పెందుల్కర్, ఆయన తొమ్మిది మంది సహచరులను అరెస్టు చేసినట్లు వివరించారు. ఈ కేసులో 45 మందిపై చర్యలు తీసుకున్నామని, వారందరినీ సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. అలాగే డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండేను మంగళవారం కలిసి విరాళాల చోరీ ఆరోపణలపై చర్చించారు.

'నేను ఎంకే స్టాలిన్ తనయుడిని'.. ఉదయనిధి స్టాలిన్ కీలక వ్యాఖ్యలు

సినీ నటి త్రిషా కృష్ణన్‌పై చేసిన వ్యాఖ్యల వివాదంలో పోలీసులు అరెస్టయి, విడుదలైన.. డీఎంకే సీనియర్ నేత, తమిళనాడు ప్రతిపక్ష నాయకుడు ఉదయనిధి స్టాలిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. విడుదల అనంతరం తన తండ్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్‌తో ఉన్న ఫొటోను సోషల్ మీడియా 'ఎక్స్'లో షేరే చేసిన ఆయన.. రాజకీయ ఒత్తిళ్లకు తాను భయపడబోనని స్పష్టం చేశారు.'నేను కలైంజర్ మనవడిని.. ఎంకే స్టాలిన్ కుమారుడిని.. డీఎంకే కార్యకర్తను. ఇలాంటి బెదిరింపులకు భయపడేది లేదు. రైతుల కోసం పోరాడే క్రమంలో ఒక్కసారి కాదు.. అవసరమైతే వందసార్లు అరెస్ట్ అయ్యేందుకైనా సిద్ధమే. ప్రజాసేవను ఎలాంటి అణచివేత ఆపలేదు' అని ఉదయనిధి స్టాలిన్ తన ఎక్స్ పోస్ట్‌లో రాసుకొచ్చారు.అంతకుముందు.. త్రిషా కృష్ణన్‌పై ఉదయనిధి చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీశాయి. దీంతో మంగళవారం(ఈనెల 4న) పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం సాయంత్రం విడుదల చేశారు. ఆ తర్వాత అధికార పక్షాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారాయన. రైతుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన ప్రభుత్వం.. ప్రజల దృష్టిని మళ్లించేందుకే తనను అరెస్ట్ చేయించిందని ఆరోపించారు. తంజావూరులో తాను చేసిన ప్రసంగాన్ని వక్రీకరించి అసత్య ప్రచారం చేశారని, తప్పుడు కేసులు బనాయించి రాజకీయంగా వేధించేందుకు యత్నించారన్నారు. అరెస్ట్ చేసిన సమయంలో తానేమాత్రం భయపడలేదని, మీడియా ఎదుట ఈ చర్యను హాస్యాస్పదంగా భావిస్తున్నానని చెప్పి మరీ పోలీసులతో వెళ్లానని తెలిపారు. తానెప్పుడూ పారిపోలేదని, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గబోనని చెప్పుకొచ్చారు ఉదయనిధి.అలాగే గతంలో కరూర్ తొక్కిసలాట ఘటనను ప్రస్తావిస్తూ.. అధికార పక్షంపై ఉదయనిధి విమర్శలకు దిగారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వం స్పందించకుండా రాజకీయ కక్షసాధింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. తన అరెస్ట్‌ను ఖండిస్తూ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టిన డీఎంకే కార్యకర్తలు, మిత్రపక్ష, ఇతర రాజకీయ పార్టీల నేతలకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు.



కేంద్రం సమన్లు.. స్పందించిన ఫేస్‌బుక్ యాజమాన్యం



ఢిల్లీ, ఆగస్టు 5 ఫేస్‌బుక్ యాజమాన్యానికి కేంద్రప్రభుత్వం నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. కేంద్రం సమన్లకు ఫేస్‌బుక్ యాజమాన్యం స్పందించింది. మెటా గ్లోబల్ బృందం, కేంద్ర ఐటీ శాఖ అధికారులు సమావేశమయ్యారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పోస్ట్ తొలగింపు, చైల్డ్ అబ్యూస్ కంటెంట్‌పై మెటాను కేంద్ర ప్రభుత్వం స్పష్టత కోరింది. సాంకేతిక లోపాలు, అల్గోరిథం పక్షపాతంపై ఐటీ మంత్రిత్వ శాఖ ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రధాని వీడియోను అకారణంగా తొలగించడంపై మెటా బృందాన్ని కేంద్రం నిలదీసింది. 'సాంకేతిక లోపం' వల్లే ఇలా జరిగిందని మెటా ప్రతినిధులు వాదించగా.. కేంద్ర ప్రభుత్వం తోసిపుచ్చింది. ఈ అంశంపై నిష్పాక్షిక విచారణ జరిపి.. నివేదిక ఇవ్వాలని మెటా ప్రతినిధులకు కేంద్రం స్పష్టం చేసిందిమూడు రోజుల్లో మార్క్ జుకర్‌బర్గ్ క్షమాపణ చెప్పకపోతే 'సేఫ్ హార్బర్' రక్షణ రద్దు చేస్తామని పార్లమెంటరీ ప్యానెల్ హెచ్చరించిన వేళ ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. ప్లాట్‌ఫామ్‌లలో బాలల లైంగిక వేధింపుల మెటీరియల్ (ఆంఓ), డీప్‌ఫేక్ కంటెంట్ నిరోధంలో వైఫల్యాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రశ్నించింది. ప్రధాని వీడియోను బ్లాక్ చేసే అల్గోరిథం.. అశ్లీల, నేరపూరిత కంటెంట్‌ను ఎందుకు అడ్డుకోవడం లేదని కేంద్ర అధికారులు ప్రశ్నించారు. భారతీయ చట్టాలు, సార్వభౌమాధికారానికి లోబడి నడుచుకోవాల్సిందేనని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

భద్రతా బలగాలు సంయమనంతో ఉండాలి.. జెన్ జీ నిరసనలపై సుప్రీం కోర్టు



'సంసద్ చలో' మార్చ్‌లో ఉద్రిక్తతలపై సుప్రీంకోర్టు తాజాగా కీలక వ్యాఖ్యలు చేసింది. ఆందోళనల వేళ పోలీసులు, భద్రతా బలగాలు సంయమనం పాటించాలని స్పష్టం చేసింది. యువత రాళ్లు విసిరినా కఠినంగా వ్యవహరించవద్దని పేర్కొంది. కౌన్సెలింగ్ ఇచ్చి శాంతింపజేయడమే ప్రభుత్వాల బాధ్యత అని సుప్రీంకోర్టు పేర్కొంది. జులై 20న 'సంసద్ చలో' మార్చ్‌లో హింసను ప్రేరేపించిన నిర్వాహకులపై చర్యలు కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. పిటిషనర్లు తమ వాదన వినిపిస్తూ నిరసన సమయంలో హద్దుమీరిన వారిపై చర్యలు తీసుకోకపోతే ప్రమాదకరమై ఒరవడికి నాంది పలికినట్టు అవుతుందని హెచ్చరించారు.అయితే, నిరసనకారుల సమస్యను 'వినడమే' బలమైన ఆయుధమని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. ప్రభుత్వం వైపు నుంచి దూకుడు ప్రదర్శిస్తే సామాజికంగా హింస మరింత పెరుగుతుందని కూడా సీజేఐ ధర్మాసనం హెచ్చరించింది. దారితప్పిన మూకలు రాళ్లు రువ్వినా యువతను శాంతింపజేయడానికే ప్రాధాన్యం ఇవ్వాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే తీవ్రమైన ప్రతిస్పందన సమాజంలో మంటలను మరింత పెంచుతుందని హెచ్చరించారు. అయితే, ఇటువంటి పరిస్థితులను ఎలా అదుపు చేయాలనే విషయంలో పోలీసులకే అనుభవం, అవగాహన ఉంటాయని కూడా ధర్మాసనం అభిప్రాయపడింది. శాంతియుత నిరసనలను ప్రోత్సహించాలని, పరిస్థితి చేయి దాటకుండా చూడాలని కూడా సర్వోత్తన్న న్యాయస్థానం సూచించింది. పిటిషనర్ల కేసును ఈ నిరసనలకు సంబంధించిన ఇతర పిటిషన్‌లతో ట్యాగ్ చేసింది.

సింగరేణి ,ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యంతో వృథాగా పోతున్న చెరువు నీరు

చుంచుపల్లి, ఆగస్టు 05 : చుంచుపల్లి మండలంలోని పెనగడప గ్రామ పరిధిలో ఉన్న పెద్ద చెరువుతో పాటు ఎర్ర చెరువు, చిట్యాల కుంట చెరువుల నుండి వర్షపు నీరు తూముల షట్టర్లు దెబ్బతినడంతో వృథాగా పోతోందని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువుల్లోకి భారీగా నీరు చేరినప్పటికీ, తూముల షట్టర్లు పూర్తిగా నిర్లక్ష్యానికి గురవడంతో నీరు నిరంతరం బయటకు వెళ్లిపోతోందని తెలిపారు. వర్షపు నీటిని నిల్వ చేసి సాగు అవసరాలకు వినియోగించాల్సిన కీలక సమయంలో ఇలా వృథాగా పోవడం వల్ల భవిష్యత్‌లో తీవ్ర నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ సమస్యను పలుమార్లు ఇరిగేషన్ అధికారులు, సింగరేణి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి స్పందన లేకపోవడం పట్ల రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే చెరువుల పరిస్థితి ఇంత దారుణంగా మారిందని వారు ఆరోపిస్తున్నారు. నీటి వృథాను అరికట్టేందుకు రైతులే స్వచ్ఛందంగా రాళ్లు, ఇసుక బస్తాలతో తాత్కాలికంగా అడ్డుకునే ప్రయత్నం చేసినప్పటికీ అది కూడా విఫలమైందని తెలిపారు.గతంలో కూడా షట్టర్ల మరమ్మతుల కోసం సింగరేణి పీవో దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని రైతులు మండిపడుతున్నారు. కృష్ణారాయుడు చెరువుకు మాత్రం రైతులే తమ సొంత ఖర్చులతో షట్టర్లను మరమ్మతులు చేయించుకోవాల్సి రావడం అధికార యంత్రాంగం వైఫల్యాన్ని స్పష్టంగా చూపుతోందని పేర్కొన్నారు. పెద్ద చెరువు, ఎర్ర చెరువు, చిట్యాల కుంట చెరువుల తూముల షట్టర్లను వెంటనే మరమ్మతులు చేయకపోతే వర్షపు నీరు పూర్తిగా వృథా అయ్యే పరిస్థితి నెలకొంటుందని రైతులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ శాఖతో పాటు సింగరేణి అధికారులు కేవలం హామీలకే పరిమితం కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని రైతులు తీవ్రంగా డిమాండ్ చేస్తున్నారు.

ఏపీలో డిప్లమెటిక్ పాలిటిక్స్...

విజయవాడ, ఆగస్టు 5 రాజకీయాల్లో నాయకులకు వ్యక్తిగత అహం, సిద్ధాంత భేషజాలు ఉండటం సాధారణం. అయితే, ప్రజాస్వామ్యంలో అధికారం దక్కినప్పుడు వ్యక్తిగత ఆత్మగౌరవం కంటే తన్ను నమ్మి ఓటేసిన కోట్ల మంది ప్రజల ప్రయోజనాలు, రాష్ట్ర పునరుద్ధరణే ముఖ్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన పరిపాలనా శైలి ద్వారా స్పష్టం చేస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీని ఆయన పదే పదే ప్రశంసించడం, వికసిత భారత్ 2047 లక్ష్య సాధనలో మోదీ నాయకత్వాన్ని బలపరచడంపై రాజకీయ ప్రత్యర్థులు, నెటిజన్లలో కొంత మంది విమర్శలు గుప్పిస్తున్నప్పటికీ.. ఆ విమర్శలను ఏమాత్రం లెక్కచేయకుండా చంద్రబాబు ముందుకు సాగుతున్నారు.పైకి కనిపించే ఈ ప్రశంసలు వెనుక అత్యంత పటిష్టమైన కోఆపరేటివ్ ఫెడరలిజం వ్యూహం దాగి ఉందని అనుకోవచ్చు. 2024లో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చే నాటికి ఏపీ ఆర్థికంగా, పరిపాలనాపరంగా తీవ్ర సంక్షోభంలో మునిగిపోయింది. రాష్ట్ర బడ్జెట్ లోటు, అప్పుల భారం, నిలిచిపోయిన రాజధాని అమరావతి నిర్మాణం, అటకెక్కిన పోలవరం ప్రాజెక్టును మళ్లీ గాడిలో పెట్టాలంటే కేంద్ర ప్రభుత్వ పూర్తి స్థాయి మద్దతు, ప్రత్యక్ష ఆర్థిక నిధుల కేటాయింపు అత్యంత ఆవశ్యకం. ఈ క్రమంలో కేంద్రంతో సఖ్యతగా ఉంటూనే రాష్ట్రానికి రావాల్సిన ప్రతి రూపాయిని రాబట్టుకోవడం చంద్రబాబు అనుసరిస్తున్న వ్యూహాత్మక రాజకీయ లౌక్యం.ఈ లౌక్యానికి తగ్గ ఫలితాలు ఇప్పటికే క్షేత్రస్థాయిలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. అమరావతి రాజధాని నిర్మాణానికి ప్రపంచ బ్యాంక్ సాయంతో పాటు కేంద్రం ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీలు, గ్రాంట్లు విడుదల చేయడం, పోలవరం ప్రాజెక్టు సవరించిన అంచనాలకు ఆమోదం తెలపడం, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణ ప్యాకేజీలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం వంటి కీలక పురోగతులు కేంద్ర-రాష్ట్రాల మధ్య ఉన్న సానుకూల సంబంధాల వల్లే సాధ్యమయ్యాయి. ప్రధాని మోదీకి, కేంద్ర కేబినెట్‌కు పదే పదే కృతజ్ఞతలు చెప్పడం ద్వారా చంద్రబాబు కేంద్ర నిధుల ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా మార్గం సుగమం చేసుకుంటున్నారు.మరోవైపు, ప్రతిపక్షాల విమర్శల నరేటివ్‌ను గమనిస్తే.. గతంలో 2018లో ధర్మపోరాటం

పేరుతో మోదీపై చంద్రబాబు చేసిన ఘాటు విమర్శల వీడియోలను సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తూ రాజకీయ ఆత్మవంచన గా అభివర్ణించే ప్రయత్నం చేస్తున్నాయి. కానీ, 2019 నుండి 2024 వరకు కేంద్రంతో విభేదించి రాష్ట్రం సాధించిందేమీ లేదని, తీవ్రంగా నష్టపోయిందని గ్రహించిన చంద్రబాబు.. గత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకున్న రాజకీయ పరిపక్వతను ప్రదర్శిస్తున్నారు. కేంద్రంతో ఘర్షణ వైఖరి కంటే చర్చలు-లబ్ధి విధానమే ఏపీకి మేలనే స్పష్టమైన అంచనాతో ఆయన వ్యవహరిస్తున్నారు. ఢిల్లీ పెద్దలతో ఈ సఖ్యత కేవలం నిధులకే పరిమితం కాకుండా.. విశాఖ-రాయపూర్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే, రైల్వే జోన్ పనులు వేగవంతం కావడం, ఐఐటీ, ఎన్ఐటీ వంటి జాతీయ విద్యాసంస్థలకు కేంద్ర గ్రాంట్లు పెరగడం, కొత్త పారిశ్రామిక కారిడార్ల కేటాయింపుల్లో ఏపీ ప్రాధాన్యత పెరగడం వంటి దీర్ఘకాలిక లాభాలను తెచ్చిపెడుతోంది. జాతీయ స్థాయిలో ఎన్డీఏ ప్రభుత్వంలో టీడీపీ అత్యంత కీలక భాగస్వామిగా ఉన్న తరుణంలో.. ఆ రాజకీయ ప్రభావాన్ని వ్యక్తిగత ఇమేజ్ కంటే రాష్ట్ర ఆర్థిక పునర్నిర్మాణానికి ఇంధనంగా వాడుకోవడమే చంద్రబాబు బ్రాండ్ డిప్లొమసీగా అనుకోవచ్చు. విమర్శలను స్వీకరిస్తూనే, వాటిని అధిగమించి అమరావతి సమగ్ర నిర్మాణం, పోలవరం పూర్తి, పరిశ్రమల తరలింపు ద్వారా యువతకు ఉపాధి కల్పించడమే తమ ప్రాథమిక లక్ష్యమని చంద్రబాబు ప్రభుత్వం భావిస్తోంది. విమర్శకులు సెటైర్లు వేసినా, సోషల్ మీడియాలో మీమ్స్ వచ్చినా.. రాష్ట్రానికి చేకూరే నిధులు, అభివృద్ధి ప్రాజెక్టులే రేపటి రోజున తమ సమర్థతకు నిదర్శనంగా నిలుస్తాయని ఆయన విశ్వసిస్తున్నారు. వ్యక్తిగత రాజకీయ అహాన్ని పక్కనపెట్టి రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా చంద్రబాబు నాయుడు నడుపుతున్న ఈ డిప్లొమాటిక్ పాలిటిక్స్ ఏపీ రాజకీయ చరిత్రలో ఒక సరికొత్త అధ్యాయంగా భావిస్తున్నారు.

దక్షిణ కోస్తా అభివృద్ధికి కొత్త అక్షమా?

గుంటూరు, ఆగస్టు 5 దక్షిణ కోస్తా అభివృద్ధి గురించి మాట్లాడేటప్పుడు నీటి వనరులు, వ్యవసాయం, పోర్టులు, పారిశ్రామిక అవకాశాల గురించి ఎంత చెప్పినా, గత దశాబ్దంలో ఈ ప్రాంత భవిష్యత్తుపై అత్యధిక చర్చకు దారితీసిన అంశం మాత్రం అమరావతి . అయితే అమరావతి గురించి జరిగిన చర్చల్లో చాలా వరకు రాజకీయ వాదోపవాదాలే ప్రధానంగా నిలిచాయి. అభివృద్ధి కోణంలో దాని పాత్ర ఏమిటి? ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం ఎంత? అనే ప్రశ్నలు మాత్రం చర్చకు రాకుండా ఇప్పటికీ ప్రశ్నలుగానే మిగిలిపోయాయి. రాజధాని అంటే కేవలం శాసనసభ, సచివాలయం, ప్రభుత్వ కార్యాలయాల సముదాయం కాదు. పరిపాలన, విధాన రూపకల్పన, పెట్టుబడులు, విద్య, వైద్యం, సేవారంగం, సాంకేతిక రంగాలు పరస్పరం అనుసంధానమయ్యే కేంద్రం. ప్రపంచంలోని అనేక ప్రణాళికాబద్ధ నగరాల అనుభవం కూడా ఇదే విషయాన్ని చెబుతోంది.ఒక సమర్థవంతమైన రాజధాని తన సరిహద్దులకే అభివృద్ధిని పరిమితం చేయకుండా, చుట్టుపక్కల ప్రాంతాల ఆర్థిక కార్యకలాపాలకు కూడా కొత్త ఊపును అందించగలగాలి. ఆ కోణంలో చూస్తే, అమరావతి విజయాన్ని నిర్మించిన భవనాల సంఖ్యతో కొలవడం సరైన ప్రమాణం కాదు. ప్రభుత్వ సంస్థలు ఎంత స్థిరంగా పనిచేస్తున్నాయి? ప్రైవేట్ పెట్టుబడులను ఎంతవరకు ఆకర్షించగలిగింది? సేవారంగం ఎంత విస్తరించింది? విద్యా, వైద్య సంస్థలు ఎంత వేగంగా అభివృద్ధి చెందాయి? నైపుణ్యాధారిత ఉద్యోగాలకు ఎంత మేర అవకాశాలు సృష్టించబడ్డాయి?... ఈ ప్రశ్నలే అమరావతి అభివృద్ధి విలువను నిర్ణయిస్తాయి.ఒక రాజధాని నగరం నిర్మాణం అంటే ప్రభుత్వ కార్యాలయాలను ఒక చోటుకి తరలించడం మాత్రమే కాదు. ఒకచోట కేంద్రీకృతం చేయడమే కాదు. పరిపాలనా వ్యవస్థ స్థిరపడిన చోట నిర్ణయాల వేగం పెరుగుతుంది. ప్రభుత్వ శాఖలు, నియంత్రణ సంస్థలు, న్యాయవ్యవస్థ, ప్రజా సేవలకు సంబంధించిన అనేక సంస్థలు ఒకదానితో మరొకటి సమన్వయంతో పనిచేసే అవకాశం ఏర్పడుతుంది. దాని ప్రభావం క్రమంగా ప్రభుత్వ వ్యవస్థను దాటి ప్రైవేట్ పెట్టుబడులు, సేవారంగం, ఉపాధి అవకాశాల వరకు విస్తరిస్తుంది. అందుకే ఒక రాజధాని నగర విజయాన్ని నిర్మించిన భవనాల సంఖ్యతో కాదు; అక్కడ ఏర్పడిన సంస్థల బలంతో కొలవాలి.దక్షిణ కోస్తా అభివృద్ధి కథలో అమరావతి ఒక ప్రత్యేక అధ్యాయం. దీనిని కేవలం ప్రభుత్వ కార్యాలయాల సమాహారంగా చూస్తే దాని పూర్తి విలువ అర్థం కాదు. ఒక రాజధాని నగరం పరిపాలనకు కేంద్రంగా మారవచ్చు. కానీ విద్య, వైద్యం, పరిశోధన, సాంకేతికత, సేవారంగం కలిసినప్పుడే అది ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థను కొత్త దిశగా నడిపిస్తుంది. సుమారు 217 చదరపు కిలోమీటర్ల (దాదాపు 53,700 ఎకరాల) రాజధాని నగర ప్రాంతం దీర్ఘకాలిక దృష్టితో రూపొందించబడింది.పరిపాలనతో పాటు నివాసం, విద్య, ఆరోగ్యం, వ్యాపారం, పరిశోధన, సేవారంగం పరస్పరం అనుసంధానమయ్యే నగర నమూనాను ఇది లక్ష్యంగా పెట్టుకుంది. భవిష్యత్ దృష్టిలో క్వాంటమ్ వ్యాలీ ప్రతిపాదన అమరావతిని క్వాంటమ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధస్సు, డీప్ టెక్నాలజీ, ఆధునిక పరిశోధనల కేంద్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని ప్రతిబింబిస్తోంది. ఇక అనుసంధానం కూడా అంతే కీలకం. సుమారు 189 కిలోమీటర్ల ప్రతిపాదిత అమరావతి ఔటర్ రింగ్ రోడ్ విజయవాడ?గుంటూరు?తెనాలి పట్టణ సముదాయాన్ని విస్తృత ప్రాంతీయ ఆర్థిక వలయంగా అనుసంధానించే సామర్థ్యాన్ని కలిగి ఉంది.అదే విధంగా ప్రతిపాదిత విజయవాడ?అమరావతి మెట్రో కారిడార్ (సుమారు 35?38 కి.మీ.) విద్య, ఉపాధి, సేవారంగాన్ని మరింత దగ్గర చేసే పట్టణ రవాణా వ్యవస్థగా రూపుదిద్దుకుంటోంది. అయితే అమరావతి విజయాన్ని భవనాల సంఖ్య నిర్ణయించదు. విద్యార్థులను ఆకర్షించే విశ్వవిద్యాలయాలు, ప్రపంచస్థాయి వైద్య సేవలు, పరిశోధన సంస్థలు, స్టార్టప్ ఎకోసిస్టమ్, నాలెడ్జ్ ఎకానమీ, వాటిని కలిపే రవాణా వ్యవస్థ?ఇవన్నీ కలిసినప్పుడే అది ప్రాంతీయ అభివృద్ధి కేంద్రంగా నిలుస్తుంది.ఏ ప్రాంతమైనా శాశ్వత అభివృద్ధిని సాధించాలంటే భౌతిక మౌలిక సదుపాయాలు మాత్రమే సరిపోవు. విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, వైద్య కళాశాలలు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు సమాంతరంగా ఎదగాలి. అలాంటి వ్యవస్థ ఏర్పడినప్పుడే స్థానిక యువతకు నాణ్యమైన విద్య, వైద్య సేవలు అందడంతోపాటు, దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి కూడా ప్రతిభ, పెట్టుబడులు ఆకర్షితమవుతాయి. ఈ కోణంలో చూస్తే, అమరావతి చుట్టూ విద్యా, వైద్య సంస్థల అభివృద్ధి కేవలం రాజధాని అవసరమే కాదు. దక్షిణ కోస్తా మానవ వనరుల నాణ్యతను పెంచే దీర్ఘకాలిక పెట్టుబడిగా కూడా చూడాలి.ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పోటీ క్రమంగా భూమి, భవనాలు, పరిశ్రమల నుంచి జ్ఞానం, పరిశోధన, సాంకేతికత వైపు మారుతోంది. ఈ నేపథ్యంలో అమరావతిని కేవలం పరిపాలనా కేంద్రంగా కాకుండా నాలెడ్జ్ ఎకానమీకి వేదికగా తీర్చిదిద్దాలనే ఆలోచన ప్రాధాన్యం సంతరించుకుంది. క్వాంటమ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధస్సు, డేటా సైన్స్, సెమీకండక్టర్ పరిశోధన, డీప్-టెక్ స్టార్టప్‌లు, డిజిటల్ సేవలు వంటి రంగాల్లో దీర్ఘకాలిక సామర్థ్యాన్ని పెంచే ప్రయత్నాలు విజయవంతమైతే, అమరావతి దక్షిణ కోస్తా ఆర్థిక నిర్మాణానికి మరో కొత్త కోణాన్ని జోడించే అవకాశం ఉంది. అయితే ఈ ప్రయత్నాల విజయాన్ని ప్రకటనలతో కాదు; సంస్థల స్థాపన, పరిశోధన, పెట్టుబడులు, ఉపాధి సృష్టి వంటి స్పష్టమైన ఫలితాలతోనే కొలవాల్సి ఉ ంటుంది.ఒక్కటే. దాని అభివృద్ధి ప్రభావం గుంటూరు?కృష్ణా ప్రాంతానికే పరిమితమవుతుందా? లేక తూర్పు గోదావరి నుంచి నెల్లూరు వరకు మొత్తం దక్షిణ కోస్తాలో పెట్టుబడులు, సేవారంగం, విద్య, వైద్య రంగాల విస్తరణకు దోహదపడుతుందా? ఒక రాజధాని నిజమైన విజయాన్ని దాని పరిపాలనా సరిహద్దులు నిర్ణయించవు. దాని ప్రభావం ఎంత విస్తృత ప్రాంతానికి చేరిందన్నదే నిర్ణయిస్తుంది. అమరావతి కూడా అదే ప్రమాణంపై నిలబడాల్సి ఉంటుంది. “అయితే దక్షిణ కోస్తా అభివృద్ధి పటాన్ని మొత్తం ఒకసారి పరిశీలిస్తే, ఒక ఆసక్తికరమైన వ్యత్యాసం కనిపిస్తుంది. గోదావరి డెల్టా నుంచి కృష్ణా, గుంటూరు, నెల్లూరు వరకు అభివృద్ధి ప్రవాహం ఒక దిశలో సాగుతుండగా, మధ్యలో ఉమ్మడి ప్రకాశం జిల్లా మాత్రం మరో ప్రశ్నను మన ముందుంచుతోంది. సహజ వనరులు ఉన్నా, విస్తారమైన భాగం ఉన్నా, ఎందుకు అదే స్థాయి అభివృద్ధి అక్కడ కనిపించలేదు? ఇదే ఇప్పుడు పరిశీలించాల్సిన తదుపరి అధ్యాయం.


205 మండలాల్లో దారుణ పరిస్థితులు..

ఏలూరు, ఆగస్టు 5 ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి. ఖరీఫ్ సీజన్ మొదలై రెండు నెలలు అవుతున్నా వర్షాలు మాత్రం కురవడం లేదు. కొన్ని జిల్లాల్లో తేలికపాటి వానలు మినహా పెద్దగా వర్షాలు ఎక్కడా పడలేదు. దీంతో రాష్ట్రంలోని 205 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.. ఇటు రాష్ట్రవ్యాప్తంగా సాగు విస్తీర్ణం కూడా దారుణంగా తగ్గిపోయింది.ఆంధ్రప్రదేశ్‌లో రైతులకు కష్టాలు మొదలయ్యాయి.. ఖరీఫ్ మొదలై రెండు నెలలు గడిచినా రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఎదురవుతున్నాయి. జూన్ 1 నుంచి ఆగస్టు 3 వరకు చూస్తే రాష్ట్రంలో సాధారణ వర్షపాతంతో పోలిస్తే 50.80శాతం తక్కువ వానలు పడ్డాయి. అలాగే రాష్ట్రంలో పంటలు కూడా సాధారణ విస్తీర్ణంలో 43% మాత్రమే సాగయ్యాయి. ఇప్పటికే రాష్ట్రంలో ఎండల తీవ్రత కొనసాగుతోంది.. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40.8 డిగ్రీలు నమోదైందంటే పరిస్థితి ఎలా అర్థం చేసుకోవచ్చు. వచ్చే మూడు నెలల్లోనూ రాష్ట్రంలో తక్కువ వర్షపాతం నమోదవుతుందని అంచనా వేస్తుండటంతో రైతులు ఆందోళనలో ఉన్నారు.గత మూడు, నాలుగు రోజులుగా రాష్ట్రంలో చెదురుమదురు వర్షాలు మాత్రమే పడుతున్నాయి. కొన్ని జిల్లాల్లో 6 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదైనా సరే పరిస్థితి ఏమాత్రం మారలేదు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల్లో లోటు వర్షపాతమే నమోదైంది. రాష్ట్రంలోనే అత్యధికంగా అన్నమయ్య జిల్లాలో 73.50శాతం లోటు వర్షపాతం నమోదైంది. విశాఖపట్నం జిల్లాలో సాధారణం కంటే 66.80శాతం, చిత్తూరు జిల్లాలో 63.50శాతం, ప్రకాశం జిల్లాలో 59.70శాతం, కడప జిల్లాలో 59.20శాతం, పశ్చిమగోదావరి జిల్లాలో 57.60శాతం, శ్రీకాకుళం జిల్లాలో 57.20శాతం, తూర్పుగోదావరి జిల్లాలో 53.60శాతం, పార్వతీపురం మన్యం జిల్లాలో 50.90శాతం, మార్కాపురం జిల్లాలో 50.20శాతం తక్కువ వర్షాలు పడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా 397 మండలాల్లో లోటు వర్షపాతం.. 205 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి.ఖరీఫ్ సీజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 77 లక్షల ఎకరాలు ఉంటే.. ఇప్పటి వరకు 33.29 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేశారు. వరి నాట్లు 38 ఎకరాల్లో వేయాల్సి ఉంటే.. కేవలం 15 లక్షల ఎకరాలకు పరిమితం అయ్యింది. కంది 7.50 లక్షల ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా.. 3.60 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు.

కేసుల్లో నేతలు... కిం కర్తవ్యం...

విజయవాడ, ఆగస్టు 5,ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, మాజీ మంత్రులు, కీలక నేతలు వరుసగా క్రిమినల్ కేసుల్లో ఇరుక్కుని ముందస్తు బెయిళ్ల కోసం హైకోర్టు మెట్లు ఎక్కడం లేదా అజ్ఞాతంలోకి వెళ్లడం ఇప్పుడు అత్యంత చర్చనీయాంశంగా మారింది. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం భూకబ్జా, డెత్ సర్టిఫికెట్ల ఫోర్జరీ కేసుల విచారణ నెదుర్కొనడం, గుంటూరు మాజీ ఎమ్మెల్యే ముస్తఫా కిడ్నాప్ వివాదంలో చిక్కుకోవడం, మహిళా ఎస్ఐపై దౌర్జన్యం ఆరోపణలతో ఆముదాలవలస ఇన్‌ఛార్జ్ చింతాడ రవికుమార్ అజ్ఞాతంలోకి వెళ్లడం వంటి వరుస ఘటనలు విపక్షాన్ని తీవ్ర ఆత్మరక్షణలో పడేశాయి.ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టు అయ్యారు. ఆర్కే రోజా, కైలే అనిల్ కుమార్, విశ్వేశ్వర్ రెడ్డి వంటి కీలక నాయకులు సైతం రకరకాల క్రిమినల్ కేసులు, అరెస్టు భయంతో కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతోందని, వైఎస్సార్‌సీపీ నేతలను భయాందోళనకు గురిచేసేందుకే పోలీసులు, యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తూ అబద్ధపు కేసులు బనాయిస్తున్నారని పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నారు. అయితే, ప్రస్తుతం వెలుగులోకి వస్తున్న కేసులు ఎక్కువగా రాజకీయాలకు సంబంధం లేనివి. భూక్రమబద్ధీకరణ పత్రాల ఫోర్జరీ, బ్రతికి ఉన్న వ్యక్తిని చనిపోయినట్లు చూపించడం , సివిల్ తగాదాల్లో అపహరణలు , ఆన్-డ్యూటీ మహిళా పోలీసులపై భౌతిక దౌర్జన్యాలు వంటి తీవ్రమైన నాన్-బెయిలబుల్ క్రిమినల్ కేసులు .గత ఐదేళ్ల పాలనలో నియోజకవర్గాల్లో తిరుగులేని ఆధిపత్యం చెలాయించిన నాయకులు, ప్రభుత్వం మారిన తర్వాత కూడా తమ పాత ధోరణినే కొనసాగించడం. స్థానిక అధికార యంత్రాంగంపై భౌతిక దాడికి దిగడం లేదా చట్టవ్యతిరేక భూ లావాదేవీలలో భాగస్వాములు కావడం ద్వారా స్వయంగా కూటమి ప్రభుత్వానికి లీగల్ ఆధారాలను అందించి ఉచ్చులో చిక్కుకుంటున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది. అదే సమయంలో సానుభూతి కోసం వైఎస్సార్‌సీపీ ఎంచుకున్న వ్యూహాత్మక రాజకీయ బాధితులుగా నిలిచే స్ట్రాటజీ కూడా కావొచ్చని భావిస్తున్నారు. తాము ప్రతిపక్షంలో ఉన్నామని, ప్రభుత్వం కావాలనే కేసులు పెడుతోందని ప్రజల్లో చూపించుకోవడం ద్వారా రాజకీయంగా మైలేజ్ పొందే ప్రయత్నం జరుగుతోందనే అభిప్రాయం ఉంది. అయితే, సివిల్ వివాదాలు, వ్యక్తిగత క్రిమినల్ ఆరోపణలు ఉన్న కేసుల్లో ఈ పొలిటికల్ విక్టిమ్ కార్డ్ సరిగ్గా పనిచేయదన్న అభిప్రాయం కూడా వినిపిస్తోంది. సామాన్య ప్రజలు భూకబ్జాలు, కిడ్నాప్ కేసులను పొలిటికల్ వెండెట్టాగా చూడటానికి సిద్ధంగా లేకపోవడమే వైఎస్సార్‌సీపీ నరేటివ్‌కు అతిపెద్ద అడ్డంకిగా మారిందని అంటున్నారు. ఈ వరుస అరెస్టులు, ముందస్తు బెయిళ్ల కొట్టివేత పరిణామాలు వైఎస్సార్‌సీపీ కేడర్‌ను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. నియోజకవర్గ స్థాయిలో నడిపించే ప్రధాన నాయకులే రోజులు, వారాల తరబడి అజ్ఞాతంలోకి వెళ్లడం లేదా కోర్టుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండటంతో స్థానిక శ్రేణుల్లో నాయకత్వ శూన్యత ఏర్పడుతోంది. ద్వితీయ శ్రేణి నాయకులు కనీసం నిరసన ప్రదర్శనలు చేసేందుకు కూడా వెనకడుగు వేసేలా ఈ చట్టపరమైన చర్యలు మానసిక ఒత్తిడిని పెంచుతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే, రాబోయే రోజుల్లో వైఎస్సార్‌సీపీ తన డిఫెన్సివ్ మైండ్‌సెట్ నుండి బయటపడటం అత్యంత క్లిష్టంగా మారనుంది. చట్టబద్ధమైన నేరాలకు, రాజకీయ కక్షసాధింపు చర్యలకు మధ్య వ్యత్యాసాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో వైఎస్సార్‌సీపీ లీగల్, మీడియా విభాగాలు విఫలమవుతున్నాయని స్పష్టమవుతోంది.

విజయసాయి పార్టీకి స్పేస్ ఉందా...



నెల్లూరు, ఆగస్టు 5 ఏపీలో మరో కొత్త పార్టీకి తెర లేవనుందని లోకల్ పొలిటికల్ సర్కిల్స్‌లో టాక్. పొలిటికల్ ఎంట్రీకి మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి రంగం సిద్ధం చేసుకుంటున్నారని సమాచారం. చాలాకాలం వైసీపీలో ఉన్న ఆయన, కొన్నాళ్ల కిందట ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. అడపాదడపా వైసీపీ టార్గెట్‌గా విమర్శల బాణాలు సంధిస్తున్నారు. వైసీపీకి వ్యతిరేకంగా చీలో పోస్టులు పెడుతున్నారు. అటు టీడీపీపై కూడా విమర్శలు ఎక్కుపెడుతున్నారు. రాజధాని నిర్మాణంలో అవినీతి జరుగుతోందని ఆరోపిస్తున్నారు. ఆయన వైసీపీని వద్దనుకున్నారు. టీడీపీలోకి ఎంట్రీ ఇచ్చే పరిస్థితి లేదు. అయితే బీజేపీకి కోరస్‌గా హిందుత్వ సైరన్ మోగిస్తున్నారు. మొదట్లో ఆయన బీజేపీలోకి వెళదామనుకున్నారనే టాక్ వినిపించింది. అయితే కూటమిలో భాగస్వామిగా ఉన్న బీజేపీలోకి ఆయన వెళ్లే అవకాశం తక్కువగా ఉందంటున్నారు.దీంతో సొంత పార్టీ పెట్టాలనే నిర్ణయానికి వచ్చారట విజయసాయి రెడ్డి. దీనిలో భాగంగా ప్రాంతాలవారీగా త్వరలోనే సన్నాహక సమావేశాలు పెట్టడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలుస్తోంది. కొత్త పార్టీపై శ్రావణమాసంలో అధికారికంగా ప్రకటన చేయడానికి విజయసాయి సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఈ కొత్త పార్టీ ఏర్పాటు విషయంలో లెక్కల మాస్టారు ఆచితూచి అడుగులు వేస్తున్నట్టు చెబుతున్నారు. జెండాను, అజెండాను కేర్‌ఫుల్‌గా డిజైన్ చేస్తున్నారట. మోదీని ఆదర్శంగా తీసుకుని రాజకీయం చేయనున్నారట విజయసాయి. ఇక జెన్-జీ టార్గెట్‌గా పాలిటిక్స్ ఉంటాయని సమాచారం. జెన్-జీని ఆకట్టుకునే అజెండా, వ్యూహాలు రూపొందిస్తారట. దానిలో భాగంగా పార్టీలో యువతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తారని సమాచారం. రాబోయే ఎన్నికల్లో పార్టీ టికెట్లలో ఎక్కువభాగం వాళ్లకే అని చెబుతున్నారు. ఇక తమిళనాడు ఎన్నికల్లో విజయదుందుభి మోగించిన విజయ్‌ను కూడా విజయసాయి స్ఫూర్తిగా తీసుకున్నట్టు తెలుస్తోంది. విజయ్ తరహాలో డబ్బు లేని రాజకీయంపై ఫోకస్ పెట్టనున్నారట. ఇక హిందుత్వం సెంట్రిక్‌గా సాగే విజయసాయిరాజకీయంలో?సమానత్వం, కులాలకు అతీతంగా సామాజిక న్యాయంఅంశాలను పొందుపరిచారట.యువత, మహిళలు, రైతులను ఆకర్షించేలాపార్టీ విధానాలు ఉంటాయని చెబుతున్నారు. పార్టీకి బూస్టప్ ఇచ్చేందుకు,విజయసాయిరెడ్డి త్వరలో పాదయాత్రకు కూడా సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది.2029 ఎన్నికలే టార్గెట్‌గా విజయసాయి వ్యూహం రచిస్తున్నట్టు సమాచారం.తన పార్టీకి వెన్నుదన్నుగా ఉండేలా సొంత మీడియాను కూడా ఆయన ఏర్పాటు చేసుకుంటున్నారని తెలుస్తోంది. సోషల్ మీడియా, మీడియాప్లాట్‌ఫామ్‌ల అండతో తన వాయిస్‌ని, వాదనని ప్రజల్లోకి తీసుకెళ్లేలా చూసుకుంటున్నారట.ఏపీ రాజకీయాలు వైసీపీ వర్సెస్ కూటమి అన్నట్టు సాగుతూ ఉంటాయి. అక్కడ మిగిలిన పార్టీలకు పెద్దగా పొలిటికల్ స్పేస్ ఉండదు. ఇలాంటి పరిస్థితుల్లో?.విజయసాయిరెడ్డి పార్టీకి ఎంతవరకు పొలిటికల్ స్పేస్ దొరుకుతుందో చూడాలంటున్నాయి పొలిటికల్ సర్కిల్స్.

బోరుగడ్డ అనిల్ మెరుపు దీక్ష

గుంటూరు, ఆగస్టు 5 తాడేపల్లిలోని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి నివాసం ముందు వైసీపీ సానుభూతిపరుడు బోరుగడ్డ అనిల్ కుమార్ సంచలన ఆందోళనకు దిగారు. తనను పార్టీ కార్యాలయం లోపలకు అనుమతించడం లేదని నిరసన వ్యక్తం చేశారు. అంతేకాకుండా పార్టీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలతో అందరికీ షాక్ ఇచ్చారు. తాను వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అభిమాని అని, ఆయన కోసం పనిచేసిన తనకు పార్టీలో కనీస గౌరవం లేకుండా చేస్తున్నారని బోరుగడ్డ ఫైర్ అయ్యారు. జగన్ కోసం పనిచేసిన తనపై 22 కేసులు నమోదు చేశారని, తన కంపెనీలు మూసివేతకు గురయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. తన భార్యతో కలిసి జగన్ నివాసం వద్ద బోరుగడ్డ బైఠాయించడంతో కలకలం చెలరేగింది. వైసీపీ అధినేత జగన్ రెడ్డి నివాసం, పార్టీ కేంద్ర కార్యాలయం ముందు అనూహ్యంగా బోరుగడ్డ అనిల్ కుమార్ భార్యతో కలిసి బైఠాయించడం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వైసీపీ అభిమానిగా ఎన్నో త్యాగాలు చేసిన తాను అధినేతను కలుస్తానంటే పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. అంతేకాకుండా సజ్జల కోటరీతో తనను రౌడీషీటర్ అంటూ ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తనపై రౌడీషీట్ లేదని హైకోర్టు చెప్పినా, వైసీపీ అధికార ప్రతినిధి కారుమూరి వెంకట్ రెడ్డి మాత్రం బోరుగడ్డ రౌడీషీటర్ అంటూ మాట్లాడుతున్నారని, ఆయనకు నోటీసులు పంపానని వెల్లడించారు. ఈ సమయంలో గతంలో తాను కారుమూరు వెంకటరెడ్డితో మాట్లాడిన ఫోన్ కాల్ ఆడియోను మీడియాకు వినిపించారు తాను పార్టీ కోసం కష్టపడ్డానని, 9 నెలలు జైలులో ఉన్నానని అయినా తనను పార్టీ ఆఫీసులోకి రానీయడం లేదన్నారు. దళితులు మా మేనమామలు అని చెప్పే జగన్ రెడ్డి ఈ విషయంలో కల్పించుకోవాలని డిమాండ్ చేశారు. తనపై సజ్జల రామకృష్ణారెడ్డి కుట్ర పన్నుతున్నారని, ఈ విషయాలు ఏవీ ఆయనకు తెలియవని ఆరోపించారు. తమకు జగన్ రెడ్డి మాత్రమే నాయకుడు అని, సజ్జల నాయకుడు కాదని వ్యాఖ్యానించారు. ఇస్త్రీ బట్టలు వేసుకుని పార్టీ కార్యాలయంలో కూర్చునే సజ్జలకు ఇక్కడ పనేమీ లేదన్నారు. తమలాంటి వారు పార్టీ కోసం కష్టపడుతున్నామని, కేసులు పెట్టించుకుని రోడ్డు మీదపడ్డామని వాపోయారు. జగన్ సతీమణి భారతి, తల్లి విజయమ్మను అవమానించారనే తాను బయటకు వచ్చానని, అయినా అవమానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ ఆఫీసుకు రమ్మని నాలుగు గంటలు కూర్చోబెట్టారని అయినా జగన్ రెడ్డిని కలవనీయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, వైసీపీ అభిమానిగా చెప్పుకుంటున్న బోరుగడ్డ ఆకస్మికంగా నిరసనకు దిగడంతో తాడేపల్లిలోని మాజీ ముఖ్యమంత్రి జగన్ నివాసం వద్ద కలకలం చెలరేగింది. అంతేకాకుండా పార్టీలో జగన్ తర్వాత ఎక్కువ ప్రాధాన్యం ఉండే పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జలపై అత్యంత తీవ్ర వ్యాఖ్యలతో బోరుగడ్డ విమర్శలు గుప్పించడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ అవుతోంది. ఎన్నడూలేని విధంగా బోరుగడ్డ ఇలా ఆందోళనకు దిగడం వెనుక కారణాలు ఏంటి అనే చర్చ ఎక్కువగా జరుగుతోంది. వైసీపీ అధికారంలో ఉండగా, ఆ పార్టీ సానుభూతిపరుడిగా చెప్పుకుంటూ సోషల్ మీడియాలో బోరుగడ్డ చేసిన వ్యాఖ్యలు, ప్రత్యర్థులపై దారుణ దూషణలతో వైసీపీకి తీవ్ర నష్టం జరిగిందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇక కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత బోరుగడ్డపై రాష్ట్రవ్యాప్తంగా కేసులు నమోదు కావడం, 9 నెలలు జైలులో ఉండటం తెలిసిందే. ఆ తర్వాత సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ వస్తున్న బోరుగడ్డ ఇప్పుడు యూటర్న్ తీసుకున్నట్లు కనిపిస్తోందని అంటున్నారు.

స్పోర్ట్స్ న్యూస్

ప్రీతి జింటాతో డేటింగ్ పుకార్లు.. ఎట్టకేలకు నోరు విప్పిన బ్రెట్ లీ

ఆస్ట్రేలియా దిగ్గజ ఫాస్ట్ బౌలర్ బ్రెట్ లీ, తన వ్యక్తిగత జీవితంపై కొన్నేళ్లుగా వస్తున్న వదంతులపై ఎట్టకేలకు స్పందించాడు. బాలీవుడ్ నటి, పంజాబ్ కింగ్స్ సహా యజమాని ప్రీతి జింటాతో డేటింగ్‌లో ఉన్నట్లు వచ్చిన పుకార్లపై అతడు స్పష్టతనిచ్చాడు.ఐపీఎల్ ప్రారంభ సీజన్ (2008)లో బ్రెట్ లీ పంజాబ్ జట్టు తరఫున ఆడిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ప్రీతి జింటా, బ్రెట్ లీ మధ్య ప్రేమాయణం నడుస్తోందంటూ అనేక వదంతులు ప్రచారంలోకి



వచ్చాయి. అయితే దీనిపై ఏళ్లపాటు మౌనంగా ఉన్న బ్రెట్ లీ, తాజాగా ఓ ఇంటర్వ్యూలో స్పష్టతనిచ్చాడు.'నేను ఏ రోజు కూడా ఏ బాలీవుడ్ నటితోనూ డేటింగ్ చేయలేదు. ప్రీతి జింటాతో నాకు ఎలాంటి రొమాంటిక్ సంబంధం లేదు. మేమిద్దరం అప్పట్లోనూ, ఇప్పటికీ మంచి స్నేహితులమే. ఆమె ఆనాడు మా పంజాబ్ జట్టుకు ఓనర్‌గా వ్యవహరించారు. ప్రీతి జింటా ఎంతో తెలివైన వ్యక్తి.. ఆమెపై నాకు ఎంతో గౌరవం ఉంది. మా ఇద్దరి మధ్య స్నేహబంధం తప్పా.. ఏ ఇతర బంధం లేదు' అని బ్రెట్ లీ స్పష్టం చేశాడు. ఈ రకమైన వదంతులు తనను ఎప్పుడూ ఇబ్బంది పెట్టలేదని, నిజం ఏమిటో తనకు తెలుసునని అతడు తేల్చి చెప్పాడు.కాగా, ఈ రూమర్లపై 2010లోనే ప్రీతి జింటా స్పందిస్తూ.. ఏటా బ్రెట్ లీతో తనకు సంబంధాలు కలిపి వార్తలు రాయడం పాతబడిపోయిందని, తమ మధ్య కేవలం స్నేహం మాత్రమే ఉందని కుండబద్దలు కొట్టింది. ఇక బ్రెట్ లీ వ్యక్తిగత జీవిత విషయానికి వస్తే.. ఆయన 2006లో ఎలిజబెత్ కెంప్‌ను వివాహం చేసుకున్నాడు. మనస్పర్థల కారణంగా 2009లో విడాకులు తీసుకున్నారు. ఆ తర్వాత 2014లో లానా అండర్సన్‌ను రెండో వివాహం చేసుకున్నాడు.ప్రీతి జింటా విషయానికొస్తే.. ఆమె అమెరికాకు చెందిన జెన్ గుడెనఫ్ ను ఫిబ్రవరి 29, 2016న వివాహం చేసుకుంది. ఈ దంపతులకు 2021లో సరోగసి ద్వారా కవల పిల్లలు జన్మించారు. ప్రీతి జింటా గత కొన్నేళ్ల నుంచి బాలీవుడ్‌లో అంత చురుకుగా లేరు. అయితే ప్రస్తుతం సన్నీ డియోల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'బత్వారా 1947' సినిమా షూటింగ్‌లో ఉన్నట్లు సమాచారం. ఈ మూవీ ఆగస్టు 14న థియేటర్లలో విడుదల కానుంది.


భారత్‌ను ఓడించేందుకు ఆస్ట్రేలియా ప్రత్యేక ప్రణాళికలు



బోర్డర్-గావస్కర్ ట్రోఫీని కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో ఆస్ట్రేలియా జట్టు ఇప్పటి నుంచే ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. వచ్చే ఏడాది జరగనున్న ఈ ఐదు టెస్టుల సిరీస్‌కు భారత్ ఆతిథ్యం ఇస్తోన్న సంగతి తెలిసిందే. ఆసీస్ జట్టు భారత పర్యటనకు రావడానికి ఐదు నెలల ముందే సన్నాహాలు ప్రారంభించింది. ఈసారి సంప్రదాయ ప్రాక్టీస్ మ్యాచ్‌లకు బదులుగా భారత పరిస్థితులను ప్రతిబింబించే వేదికలో ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించాలని ఆసీస్ నిర్ణయించింది. ఈ సందర్భంగా బ్లూ ప్రింట్‌ను సిద్ధం చేసినట్లు ఆసీస్ ప్రధాన కోచ్ ఆండ్రూ మెక్‌డొనాల్డ్ వెల్లడించారు.'ఈసారి ప్రాక్టీస్ మ్యాచ్ ఆడే ఆలోచన లేదు. తొలి టెస్టు జరిగే పరిస్థితులకు దగ్గరగా ఉండే వాతావరణంలో శిక్షణ పొందడంపైనే మా దృష్టి ఉంది. అందుకు అనువైన వేదికను ఖరారు చేసే పనిలో ఉన్నాం. గతంలో యూఏఈ, బెంగళూరులోనూ శిక్షణ శిబిరాలు నిర్వహించిన అనుభవం మాకుంది. ఈసారి కూడా అలాంటి అవకాశాలనే పరిశీలిస్తున్నాం' అని వెల్లడించారు. 2027 జనవరి 21 నుంచి ప్రారంభమయ్యే ఐదు టెస్టుల బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ నాగ్‌పూర్‌లో ఆరంభమై, చెన్నై, గువాహటి, రాంచీ, అహ్మదాబాద్ వేదికలుగా కొనసాగనుంది.శిక్షణతో పాటు జట్టు ఎంపికలోనూ ఆస్ట్రేలియా ప్రత్యేక వ్యూహాన్ని అమలు చేయనుంది. న్యూజిలాండ్‌తో జరిగే స్వదేశీ టెస్టు సిరీస్ ముగిసిన తర్వాత భారత్‌కు అనువైన నైపుణ్యాలు ఉన్న ఆటగాళ్లను ప్రత్యేకంగా సిద్ధం చేయాలని భావిస్తోంది. దీంతో న్యూజిలాండ్ సిరీస్ ఆడిన జట్టే భారత్‌కు వస్తుందని చెప్పలేమని మెక్‌డొనాల్డ్ స్పష్టం చేశారు. భారత్ పర్యటనకు ఎంపికయ్యే ఆటగాళ్లు వేరే ఇతర టోర్నీలకు దూరంగా ఉండి రెడ్‌బాల్ క్రికెట్‌పై దృష్టి సారించనున్నారు. ఎడమచేతి స్పిన్నర్ మాథ్యూ కూనెమన్, ఆఫ్‌స్పిన్నర్ టాడ్ మర్ఫీ, ఆల్‌రౌండర్ కూపర్ కనోలీ, బ్యాటర్లు పీటర్ హ్యాండ్స్‌కాంబ్, మాథ్యూ రెన్షా వంటి ఆటగాళ్లు భారత్ పర్యటనకు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం.ఆస్ట్రేలియా చివరిసారిగా 2004-05లో భారత్‌లో టెస్టు సిరీస్ గెలిచింది. ఆ తర్వాత ప్రతి పర్యటనలోనూ నిరాశే ఎదురైంది. ఈసారి మాత్రం ప్రాక్టీస్ మ్యాచ్‌ల కంటే భారత పరిస్థితులకు అలవాటు పడటానికే అధిక ప్రాధాన్యం ఇస్తూ కొత్త వ్యూహంతో బరిలోకి దిగుతోంది. ఈ మాస్టర్ ప్లాన్ ఫలిస్తుందో లేదో వచ్చే ఏడాది జనవరిలో ప్రారంభమయ్యే బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో తేలనుంది.

షాకింగ్.. కామన్వెల్త్ గేమ్స్ తర్వాత ఏడుగురు అథ్లెట్ల అదృశ్యం

కామన్వెల్త్ గేమ్స్ 2026 ముగిసిన అనంతరం ఏడుగురు అథ్లెట్లు అదృశ్యమైన ఘటన సంచలనం రేపింది. గ్లాస్గోలో పోటీలు ముగిసిన తర్వాత తమ జట్లతో కలిసి స్వదేశాలకు తిరిగి వెళ్లకుండా కొందరు కనిపించకపోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. తొలుత పాకిస్థాన్‌కు చెందిన బాక్సర్ మిస్ అయ్యాడని సమాచారం వచ్చింది. ఆ తర్వాత మరో ఆరుగురు ప్లేయర్లు కూడా అదృశ్యమయ్యారని తెలిసింది. దీనిపై స్కాట్లాండ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ వ్యవహారంలో యూకే హోం ఆఫీస్‌తో కలిసి విచారణ కొనసాగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.ఉగాండా మీడియా కథనాల



ప్రకారం.. ఆ దేశానికి చెందిన ఆరుగురు బాక్సర్లలో నలుగురు స్వదేశానికి వెళ్లాల్సిన విమానం ఎక్కలేదు. వారిని నుహు బట్టే, ఏంజెల్ కటుషాబే, ఇబ్రహీం కెమిస్, ఎమిలీ నకలేమాగా గుర్తించారు. వారిలో ఒకరు స్కాట్లాండ్‌లో ఆశ్రయం కోరారని, అక్కడే మెరుగైన శిక్షణతో బాక్సింగ్ కెరీర్ కొనసాగించాలని నిర్ణయించుకున్నట్లు స్థానిక మీడియాకు తెలిపినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఈ విషయంపై ఉగాండా జట్టు అధికారులు స్పందించేందుకు నిరాకరించారు.మరోవైపు పాకిస్థాన్ బాక్సర్ ఖుద్రతుల్లా కూడా జట్టు హోటల్ నుంచి అదృశ్యమైనట్లు సమాచారం. స్వదేశానికి బయల్దేరే ముందు అతడు గదిలో లేకపోవడాన్ని అధికారులు గుర్తించారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, అతడి పాస్‌పోర్ట్ జట్టు మేనేజర్ వద్దే ఉన్నప్పటికీ ఖుద్రతుల్లా కనిపించకుండా పోయాడని పాకిస్థాన్ ఒలింపిక్ అసోసియేషన్ వర్గాలు వెల్లడించాయి. ఇలాంటి ఘటనలు కామన్వెల్త్ గేమ్స్‌లో కొత్తేమీ కాదు. 2022 బర్మింగ్‌హామ్ గేమ్స్ సందర్భంగా కూడా పాకిస్థాన్ బాక్సర్లు సులేమాన్ బలోచ్, నజీరుల్లా ఖాన్ అదృశ్యమయ్యారు. అలాగే 2018 గోల్డ్ కోస్ట్ కామన్వెల్త్ గేమ్స్ తర్వాత దాదాపు 50 మంది అథ్లెట్లు, అధికారులు ఆస్ట్రేలియా విడిచి వెళ్లకపోగా, మరో 190 మంది వరకు ఆశ్రయం కోసం దరఖాస్తు చేసినట్లు అప్పట్లో నివేదికలు వెల్లడించాయి. కాగా గ్లాస్గోలో 11 రోజుల పాటు జరిగిన కామన్వెల్త్ గేమ్స్‌లో 74 దేశాలకు చెందిన 3,000 మందికి పైగా అథ్లెట్లు పాల్గొన్నారు. పోటీలు ముగియడంతో అన్ని బృందాలు స్వదేశాలకు చేరుకుంటున్న నేపథ్యంలో అదృశ్యమైన అథ్లెట్ల కోసం అధికారులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

కీరన్ పొలార్డ్‌ను పక్కన పెట్టిన ఎంఐ



దక్షిణాఫ్రికా వేదికగా అత్యంత వైభవంగా జరిగే 'ఎస్ఏ20' (సా20) లీగ్ ఐదో సీజన్‌కు రంగం సిద్ధమవుతోంది. టోర్నమెంట్‌లో భాగంగా ఫ్రాంచైజీలు తమ రిటెన్షన్లు, ప్రీ-అక్షన్ సైనింగ్స్ ప్రక్రియను పూర్తి చేశాయి. ఐదో సీజన్ ప్రారంభానికి ముందే ఫ్రాంచైజీలు తమ జట్టులో పలు మార్పులు చేర్పులు చేస్తున్నాయి. ఎంఐ కేప్ టౌన్ యాజమాన్యం వెస్టిండీస్ దిగ్గజ ఆటగాడు కీరన్ పొలార్డ్‌ను విడుదల చేసింది. అలానే జోబర్గ్ సూపర్ కింగ్స్ ఫాఫ్ డుప్లెసిస్‌ను రిలీజ్ చేసింది.ఈ సీజన్?లో మిచెల్ మార్ష్, సామ్ కరన్, జో రూట్, ఫిల్ సాల్ట్, జాసన్ హోల్డర్ వంటి విదేశీ ఆటగాళ్లు ఈసారి లీగ్‌లో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నారు.మరోవైపు 'డర్బన్స్ సూపర్ జెయింట్స్', 'పార్ల్ రాయల్స్' జట్లు తమ 19 మంది సభ్యుల పూర్తి జట్లను ఇప్పటికే రిటెన్షన్లు, ప్రీ-అక్షన్ సైనింగ్స్ ద్వారా ఖరారు చేశాయి. మిగిలిన ఫ్రాంచైజీల వద్ద మరో 19 ఖాళీ స్థానాలు మిగిలి ఉన్నాయి. డిఫెండింగ్ ఛాంపియన్ 'సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్' తమ జట్టును మరింత పటిష్ఠం చేసుకునే క్రమంలో ఆస్ట్రేలియా టీ20 జట్టు కెప్టెన్ మిచెల్ మార్ష్‌ను తొలిసారిగా తమ జట్టులోకి సొంతం చేసుకుంది.డర్బన్ సూపర్ జెయింట్స్ ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ సామ్ కరన్‌ను దక్కించుకుంది. పార్ల్ రాయల్స్ ఇంగ్లండ్ టెస్ట్ కెప్టెన్ జో రూట్‌ను వైల్డ్‌కార్డ్ ఎంట్రీగా, అఫ్గానిస్థాన్ ఆల్‌రౌండర్ అజ్మతుల్లా ఒమర్జాయ్‌ను తమ జట్టులోకి ఆహ్వానించాయి. 'ప్రెటోరియా క్యాపిటల్స్' ఇంగ్లండ్ వికెట్ కీపర్-బ్యాటర్ ఫిల్ సాల్ట్, ఆస్ట్రేలియా ప్లేయర్ మాథ్యూ షార్ట్‌లను దక్కించుకుని తమ బ్యాటింగ్ ఆర్డర్‌ను మరింత బలోపేతం చేసుకున్నాయి.మరోవైపు, ప్రముఖ మార్పుల్లో భాగంగా ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ విల్ జాక్స్ ప్రెటోరియా క్యాపిటల్స్ నుంచి 'ఎండీ కేప్ టౌన్' జట్టుకు మారాడు. ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ యాజమాన్యంలోని జట్టులో జాక్స్‌కి ఇది మూడో సీజన్ కానుంది. ఈ మెగా టోర్నీ ఆరంభానికి ముందే ఆటగాళ్ల మార్పిడితో క్రికెట్ అభిమానుల్లో అంచనాలు తారస్థాయికి చేరాయి

స్టేడియం నుంచి 2 నుంచి 3 కోట్ల లీటర్లు

హైదరాబాద్, ఆగస్టు 5 హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో భూగర్భ జలాల వినియోగాన్ని తగ్గించేందుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. స్టేడియంలో వర్షపు నీటిని సేకరించి శుద్ధి చేసే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ)కి తెలిపింది. ఈ వ్యవస్థ అమల్లోకి వస్తే ప్రతి ఏడాది 2 నుంచి 3 కోట్ల లీటర్ల వరకు వర్షపు నీటిని సేకరించి వినియోగించే అవకాశం ఉందని వెల్లడించింది.పిచ్ నిర్వహణ కోసం భూగర్భ జలాలను అధికంగా వినియోగిస్తున్నారంటూ దాఖలైన కేసులో భాగంగా హెచ్‌సీఏ జూలై 2న ఎన్‌జీటీకి స్టేటస్ రిపోర్ట్ సమర్పించింది. కొత్త రైన్‌వాటర్ హార్వెస్టింగ్, ఫిల్ట్రేషన్ వ్యవస్థ ఏర్పాటుకు అవసరమైన అనుమతులు తీసుకుని పనులు పూర్తి చేసేందుకు కొంత గడువు ఇవ్వాలని, అప్పటి వరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని ట్రైబ్యునల్‌ను కోరింది.హెచ్‌సీఏ పరిశీలిస్తున్న ప్రతిపాదన ప్రకారం.. స్టేడియంలో పడే వర్షపు నీటిని సేకరించి శుద్ధి చేసి మైదానం నిర్వహణ, తోటల సాగు, ఇతర అవసరాలకు వినియోగించనున్నారు. అదనంగా భూగర్భ జలాలను రీచార్జ్ చేసే విధంగా ఈ వ్యవస్థ పనిచేస్తుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే స్టేడియాన్ని వాటర్ పాజిటివ్‌గా మార్చే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు హెచ్‌సీఏ తెలిపింది. వర్షపు నీటితో పాటు మురుగునీటిని శుద్ధి చేసి మైదానం, పచ్చదనం నిర్వహణ కోసం వినియోగించే అవకాశాలను కూడా హెచ్‌సీఏ పరిశీలిస్తోంది. దీంతో భూగర్భ జలాల వినియోగం మరింత తగ్గుతుందని పేర్కొంది.ప్రస్తుతం ఉప్పల్ స్టేడియంలో మొత్తం 8.2 లక్షల లీటర్ల నీటిని నిల్వ చేసే మూడు ట్యాంకులు ఉన్నాయి. గేట్ నంబర్-5 సమీపంలో 3.5 లక్షల లీటర్ల సామర్థ్యంతో ఒక ట్యాంకు ప్రజా అవసరాల కోసం వినియోగిస్తుండగా, 2.2 లక్షల లీటర్ల సామర్థ్యంతో మరో ట్యాంకును అగ్నిమాపక అత్యవసర అవసరాల కోసం కేటాయించారు. గేట్ నంబర్-3 వద్ద 2.5 లక్షల లీటర్ల సామర్థ్యంతో మరో ట్యాంకు సాధారణ కార్యకలాపాల కోసం ఉపయోగిస్తున్నారు.హైదర్ అలీ అనే వ్యక్తి ఎన్‌జీటీలో దాఖలు చేసిన పిటిషన్‌లో.. క్రికెట్ మైదానాల నిర్వహణ కోసం భూగర్భ జలాలను వినియోగిస్తున్నారని, బదులుగా శుద్ధి చేసిన నీరు లేదా రైన్‌వాటర్ హార్వెస్టింగ్ వంటి ప్రత్యామ్నాయాలను ఎందుకు ఉపయోగించడం లేదని ప్రశ్నించారు. ఐపీఎల్ వంటి వాణిజ్య టోర్నీల సమయంలో కూడా భారీగా నీరు వినియోగిస్తున్నారని ఆయన ఆరోపించారు.ఈ కేసులో 2021 నుంచే ఎన్‌జీటీ విచారణ కొనసాగుతోంది. పలుమార్లు ఆదేశాలు ఇచ్చినా హెచ్‌సీఏ సమయానికి స్టేటస్ రిపోర్ట్ సమర్పించకపోవడంతో ఈ ఏడాది జనవరిలో ట్రైబ్యునల్ రూ.5 వేల జరిమానా విధించింది. అనంతరం హెచ్‌సీఏ జరిమానా చెల్లించి, సాంకేతిక వివరాలు సేకరించడం, నిపుణుల సలహాలు తీసుకోవడం వల్లే ఆలస్యమైందని వివరణ ఇచ్చింది

ఆర్బీఐ బ్యాంకు ఉద్యోగిగా ఇషాన్ కిషన్..

భారత స్టార్ బ్యాటర్, వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ క్రికెట్‌కు కాస్త బ్రేక్ ఇచ్చాడు. ప్రస్తుతం బ్యాంకు ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. స్పోర్ట్స్ కోటాలో ఇషాన్‌కు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ)లో అసిస్టెంట్ మేనేజర్‌గా ఉద్యోగం వచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా బ్యాంక్‌కు వెళ్లిన ఇషాన్.. సహ ఉద్యోగులతో ఫొటోలు దిగాడు. ఇవి సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.అనివార్య కారణాల వల్ల జట్టుకు దూరమైన ఇషాన్.. మళ్లీ దేశవాళీ క్రికెట్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబర్చి భారత జట్టులోకి రీఎంట్రీ ఇచ్చాడు. నిలకడైన ఆటతీరుతో జట్టులో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. టీ20 ప్రపంచ కప్ 2026లో చివరి నిమిషంలో జట్టులోకి వచ్చి.. ట్రోఫీ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. భారత జట్టు ప్రస్తుతం శ్రీలంకతో రెండు టెస్టు సిరీస్‌లు ఆడనుంది. ఈ జట్టులో ఇషాన్ కిషన్ లేడు. టీమిండియా తదుపరి టీ20 సిరీస్ అక్టోబర్‌లో వెస్టిండీస్‌తో ఆడనుంది. దీనికి ముందు దేశవాళీ టోర్నీ దులీప్ ట్రోఫీలో ఈస్ట్ జోన్‌ను ఇషాన్ నడిపించనున్నాడు. ఆగస్టు 23 నుంచి ఈ టోర్నీ ప్రారంభం కానుంది. ఈ కొద్దిపాటి విరామంలో అతడు అసిస్టెంట్ మేనేజర్ హోదాలో విధులు నిర్వర్తించడానికి ఝార్ఖండ్ బ్రాంచ్‌కు వెళ్లాడు. ఇందుకు సంబంధించిన ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.



నార్తర్న్ ఆర్క్ క్యాపిటల్‌కు అత్యుత్తమ త్రైమాసిక ఫలితాలు

హైదరాబాద్, ఆగస్టు 6, 2026: నార్తర్న్ ఆర్క్ క్యాపిటల్ లిమిటెడ్ 2026 – 27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో చరిత్రలోనే అత్యుత్తమ పని తీరును నమోదు చేసింది. నికర లాభం 41 శాతం పెరిగి రూ. 114 కోట్లకు చేరింది. నికర వడ్డీ ఆదాయం 32 శాతం వృద్ధితో రూ. 394 కోట్లుగా నమోదైంది. లెండింగ్ ఆస్తుల నిర్వహణ రూ. 16,855 కోట్లకు చేరింది. స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి ఒక శాతానికి తగ్గడం సంస్థ ఆస్తుల నాణ్యత మరింత మెరుగుపడినట్లు వెల్లడించింది. క్యాపిటల్ అడిక్వసీ రేషియో 22.7 శాతంగా ఉంది. ఐసీఆర్ఏ నుంచి అత్యున్నత 'అవుట్‌స్టాండింగ్' ఈఎస్జీ ఇంపాక్ట్ రేటింగ్ కూడా లభించింది. ప్రీ-ప్రొవిజన్ ఆపరేటింగ్ ప్రాఫిట్ 27 శాతం పెరిగి రూ. 263 కోట్లకు చేరింది. ఈ సందర్భంగా నార్తర్న్ ఆర్క్ క్యాపిటల్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ అశిష్ మెహ్రోత్రా మాట్లాడుతూ ఈ ఫలితాలతో ఆర్థిక సంవత్సరాన్ని బలంగా ప్రారంభించామని తెలిపారు. దీర్ఘకాలిక వ్యూహాన్ని క్రమశిక్షణతో అమలు చేస్తూ వృద్ధి దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. విస్తృతమైన, విభిన్నమైన రిటైల్ రుణాల పోర్ట్‌ఫోలియో నిర్మాణంపైనే ప్రధానంగా మా దృష్టి ఉందన్నారు. ఈ త్రైమాసికంలో మా డైరెక్ట్-టు-కస్టమర్ రుణాల పోర్ట్‌ఫోలియో రూ. 10,000 కోట్ల మైలురాయిని దాటిందన్నారు. ఇదే సమయంలో మా ఆస్తుల నాణ్యత కూడా మరింత మెరుగుపడిందన్నారు. స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 20 బేసిస్ పాయింట్లు తగ్గి 1.0 శాతానికి చేరగా, క్రెడిట్ కాస్ట్ 2.6 శాతంగా నమోదైందన్నారు. ఇది మేము నిర్దేశించుకున్న 2.7–2.8 శాతం లక్ష్య పరిధిలోనే ఉందన్నారు. ఐసీఆర్ఏ నుంచి 81 స్కోర్‌తో పరిశ్రమలోనే అత్యున్నత 'అవుట్‌స్టాండింగ్' ఈఎస్జీ ఇంపాక్ట్ రేటింగ్ సాధించడం, బాధ్యతాయుతమైన, స్థిరమైన అభివృద్ధి పట్ల మా నిబద్ధతకు నిదర్శనమన్నారు. పశ్చిమ ఆసియాలోని భౌగోళిక-రాజకీయ పరిణామాలు, ఎల్-నినో ప్రభావంతో రుతుపవనాలపై పడే ప్రభావం వంటి బాహ్య సవాళ్లను నిశితంగా గమనిస్తున్నామని పేర్కొన్నారు. అయినా, మా విభిన్న వ్యాపార నమూనా, సమతుల్య రిస్క్ నిర్వహణ, క్రమబద్ధమైన అమలు విధానంతో ఈ సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనే స్థితిలో నార్తర్న్ ఆర్క్ ఉందన్నారు.

లెండింగ్ అసెట్స్ అండర్ మేనేజ్‌మెంట్ 26 శాతం వృద్ధితో రూ. 16,855 కోట్లకు చేరింది. స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 20 బేసిస్ పాయింట్లు తగ్గి 1.0 శాతానికి చేరింది. నికర నిరర్థక ఆస్తుల నిష్పత్తి 15 బేసిస్ పాయింట్లు తగ్గి 0.5 శాతం మెరుగుపడింది. 2026 జూన్ 30 నాటికి క్యాపిటల్ అడిక్వసీ రేషియో 22.7 శాతంగా నమోదైంది. రెండు డెట్ ఫండ్లకు సెబీ నుంచి అనుమతులు లభించాయి. ఐసీఆర్ఏ నుంచి 81/100 స్కోర్‌తో అత్యున్నత 'అవుట్‌స్టాండింగ్' ఈఎస్జీ ఇంపాక్ట్ రేటింగ్ లభించింది. లెండింగ్ ఏయూఎం 26 శాతం పెరిగి రూ. 16,855 కోట్లకు చేరింది. డైరెక్ట్ టు కస్టమర్ రుణాల ఏయూఎం 51 శాతం వృద్ధితో రూ. 10,766 కోట్లకు చేరగా, మొత్తం ఏయూఎంలో డీ2సీ వాటా 64 శాతానికి పెరిగింది. పనితీరు కనబరిచే క్రెడిట్ ఫండ్ ఏయూఎం రూ. 2,988 కోట్లుగా నమోదైంది. క్యూ1ఫైనాన్సియల్ ఇయర్ 27లో స్థూల లావాదేవీల విలువ రూ. 8,595 కోట్లుగా ఉంది. నికర వడ్డీ ఆదాయం 32 శాతం పెరిగి రూ. 394 కోట్లకు చేరింది. ఫీజులు, ఇతర ఆదాయం రూ. 22 కోట్లుగా నమోదైంది. నిర్వహణ వ్యయాల నిష్పత్తి 3.6 శాతం వద్ద స్థిరంగా కొనసాగింది. పీపీఓపీ 27 శాతం పెరిగి రూ. 263 కోట్లకు చేరింది. క్రెడిట్ కాస్ట్ 44 బేసిస్ పాయింట్లు తగ్గి 2.6 శాతం నమోదైంది. పన్ను అనంతర లాభం 41 శాతం పెరిగి రూ. 114 కోట్లకు చేరింది. రిటర్న్ ఆన్ అసెట్స్ 29 బేసిస్ పాయింట్లు పెరిగి 2.7 శాతం నమోదైంది. రిటర్న్ ఆన్ ఈక్విటీ 220 బేసిస్ పాయింట్లు పెరిగి 11.5 శాతానికి చేరింది. స్థూల ఎన్పీఏ నిష్పత్తి 20 బేసిస్ పాయింట్లు తగ్గి 1.0 శాతానికి మెరుగుపడింది. నికర ఎన్పీఏ నిష్పత్తి 15 బేసిస్ పాయింట్లు తగ్గి 0.5 శాతానికి చేరింది. స్టేజ్-××× ఆస్తులపై ప్రొవిజనింగ్ కవరేజ్ రేషియో 48.5 శాతానికి పెరిగింది.

న్యూ పద్మా నగర్ కాలనీ నందు అభివృద్ధి, సమస్యలపై పర్యటన

ఎమ్మెల్యే దేవీరెడ్డి సుధీర్ రెడ్డి

తెలంగాణ పవర్ న్యూస్ చంపాపేట డివిజన్ ఎల్బీనగర్ ఆగస్టు : చంపాపేట్ డివిజన్ పరిధిలో న్యూ పద్మా నగర్ కాలనీలోని గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాల కారణంగా బాక్స్ డ్రెయిన్ల నుంచి వరద నీరు పొంగిపొర్లి సమీపంలోని ఇండ్లలోకి చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఈ విషయం తెలుసుకున్న ఎల్.బి.నగర్ నియోజకవర్గ శాసనసభ్యులు జననేత, అభివృద్ధి ప్రధాత దేవిరెడ్డి సుధీర్ రెడ్డి గారు బుధవారం పర్యటించి పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఎమ్మెల్యేకు తమ సమస్యలను వివరించారు.

వంగ శంకరమ్మ ప్రాంతం నుంచి నిర్మించిన నూతన బాక్స్ డ్రెయిన్ పనులు పూర్తయ్యాయని, అయితే డ్రెయిన్లలో పేరుకుపోయిన పూడికను తొలగించకపోవడం, అలాగే నిర్మాణ సమయంలో ఉపయోగించిన ఇసుక బస్తాలు, సెంటరింగ్ సామగ్రిని తొలగించకపోవడంతో వరద నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి నీరు ఇండ్లలోకి చేరిందని స్థానికులు తెలిపారు.

దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి గారు సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, అన్ని బాక్స్ డ్రెయిన్లను వెంటనే తెరిచి పూడిక, చెత్తాచెదారం, నిర్మాణ సామగ్రిని తొలగించి వరద నీరు ఎలాంటి ఆటంకం లేకుండా సాఫీగా వెళ్లేలా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

అలాగే న్యూ పద్మా నగర్‌తో పాటు పరిసర కాలనీల్లో కూడా డ్రైన్స్ నందు వరద నీరు సాఫీగా పోయేందుకు అవసరమైన చర్యలు తీసుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాజిరెడ్డి,కృష్ణమాచారి,గండికోట శ్రీనాథ్,నదానంద రెడ్డి,రవి ముదిరాజ్,ఉమామహేశ్వర్,శివ,జగదీష్,సురేందర్ రెడ్డి,వసంత,వసంత్,రాజశేఖర్ రెడ్డి పలు కాలనీవాసులు అల్లంపల్లి శ్రీనివాస్,జయవర్ధన్ రెడ్డి,విజయనంద్ రెడ్డి,శ్రీను యాదవ్,శ్రీనుపంతులు,యాదయ్య,సుధాకర్ రెడ్డి,నరహరి రావు తదితరులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాల పంపిణీ బీఆర్ఎస్ యువ నాయకుడు రాజు పటేల్



వరంగల్, మండలం : వరంగల్ తూర్పు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ జన్మదినం పురస్కరించుకొని 12 డివిజన్ పరిధిలోని దేశాయిపేట లో బీఆర్ఎన్ పార్టీ యువజన నాయకులు రాజు పటేల్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజు పటేల్ మాట్లాడుతూ, ప్రజా సేవకులు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ న్ఫూర్తితో ప్రజాసేవకు అంకితభావంతో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను గౌరవించడం ఎంతో ఆనందంగా ఉందని, నన్నపునేని నరేందర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంజీవ్, అంకత్ రవి, సాగర్ గౌడ్, భారత్ రవి, ఇట్యాల కుమారస్వామి, జూలూరు నాగరాజ్, రాజన్ బాబు, సందీప్ పటేల్, శివ, రాయుడు, శ్రీకాంత్, ప్రశాంత్, భాను తదితర పార్టీ నాయకులు, యువత తో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్లాన్ పల్లి గ్రామంలో ఇండ్ల స్థలాలు ఇవ్వాలని తాసిల్దార్ కార్యాలయం ముందు లబ్ధిదారులు ధర్నా



ఆగస్టు : 5 : CPM. BSP. CPI. మద్దతు: తాడూరు మండల పరిధిలోని బాలాన్ పల్లి గ్రామంలో ఇళ్ల స్థలాల పట్టాలు పొందిన వారందరికీ తక్షణమే క్షేత్రస్థాయిలో మెక చూపించాలని ఈరోజు తాడూరు మండల కేంద్రంలో పెట్రోల్ బంక్ నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చారు అనంతరం ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించడం జరిగింది

ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి అంతటి కాశన్న బీఎస్పీ మండల ఇన్చార్జ్ జన్ను అంజి సిపిఐ కంట్రోల్ కమిషన్ సభ్యులు ఆనంజి వారు మాట్లాడుతూ గ్రామంలో 1999లో అప్పటి ప్రభుత్వం భూమి కొనుగోలు చేసి 56 మందికి పట్టాలిచి నేటికీ మూక చకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర నిరాశకు గురై అధికారులకు ఎన్ని సంవత్సరాలు తిరిగి వేసారి గత్యంతరలేని స్థితిలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే లబ్ధిదారులందరికీ మోకా చూపించాలన్నారు లైదా వివిధ జూవీ. దీ్రూ. జూ×. పార్టీల ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో లబ్ధిదారులను సమీకరించి ఎంతటి పోరాడానికైనా కొనుక్కుంటామని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సర్పంచి వార్ల వెంకటయ్య సిపిఎం నాయకులు అంతటి మహేష్ ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్ బీఎస్పీ పార్లమెంట్ ఇంచార్జ్ కళ్యాణ్ నాగార్జున్ భల్లాన్ పల్లి ఇండ్ల స్థలాల పోరాట కమిటీ :

ప్రధాన కార్యదర్శి :బారు గోపాల్
అధ్యక్షుడు :ప్యాట ప్రభాకర్
ఉప అధ్యక్షుడు:ఆనంద్ చారి, మేకల ముసలయ్య
సహాయ కార్యదర్శి :దాంగట్ల బాలస్వామి కమిటీ సభ్యులు :ఈకల రాములు
నాదిరి రాములమ్మ
దూదేకుల ఉశేన్ బి
మాదాసు నర్సింహా
శివలీల చారి
దాంగట్ల బాలిశ్వర్
తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి గారికి వినతి

మాజీ కార్పొరేటర్ కల్లెం నవజీవన్ రెడ్డి గారు.



తెలంగాణ పవర్ న్యూస్ హయత్ నగర్ డివిజన్ ఎల్బీనగర్ ఆగస్టు: ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్‌లోని పలు కాలనీల్లో భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ వ్యవస్థ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ కార్పొరేటర్ కల్లెం నవజీవన్ రెడ్డి గారు జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి గారిని వారి కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్ పరిధిలో భూగర్భ డ్రైనేజీ సౌకర్యం లేని కాలనీల్లో తక్షణమే డ్రైనేజీ పైప్‌లైన్ పనులు చేపట్టి, మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. వర్షాకాలంలో మురుగునీరు రోడ్లపైకి రావడం, దుర్వాసన, దోమల బెడద పెరగడం వల్ల ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆయన వివరించారు.

ప్రజల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని అవసరమైన నిధులు మంజూరు చేసి, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి త్వరితగతిన అభివృద్ధి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి గారు సమస్యలను సానుకూలంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే మా లక్ష్యం -- హయత్‌నగర్ అభివృద్ధికి నిరంతరం కృషి కొనసాగుతుంది" అని మాజీ కార్పొరేటర్ కల్లెం నవజీవన్ రెడ్డి గారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

తల్లి పాల వారోత్సవాలు ఘనంగా నిర్వహణ

తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించిన వైస్ ఉపసర్పంచ్ జి. ప్రవీణ్

ఖమ్మం రఘునాథపాలెం ఆగస్టు 5: జాతీయ తల్లి పాల వారోత్సవాల సందర్భంగా వెంకటాయపాలెం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ వైస్ సర్పంచ్ జి. ప్రవీణ్ ముఖ్య అతిథిగా హాజరై తల్లిపాల ప్రాముఖ్యతపై తల్లులకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పుట్టిన వెంటనే శిశువుకు తల్లిపాలు ఇవ్వడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందని, తొలి ఆరు నెలల పాటు తల్లిపాలే ఉత్తమ ఆహారమని అన్నారు. శిశువు ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు, మానసిక వికాసానికి తల్లిపాలు ఎంతో అవసరమని తెలిపారు. తల్లులు అపోహలకు లోనుకాకుండా వైద్యులు, అంగన్‌వాడీ సిబ్బంది సూచనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు గర్భిణులు, బాలింతలకు తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలు, సరైన పోషకాహారం, శిశు సంరక్షణపై వివరించారు. అనంతరం తల్లులతో పరస్పర చర్చ నిర్వహించి వారి సందేహాలకు సమాధానాలు ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.



అప్రమత్తతే సైబర్ నేరాలకు అడ్డుకట్ట

'సురక్షా తిరంగా'లో భాగంగా విద్యార్థులకు సైబర్ భద్రతపై అవగాహన - ఎస్సై శ్రీనివాస్ గౌడ్



మెదక్ ప్రతినిధి ఆగస్టు 5 తెలంగాణ పవర్ : సైబర్ నేరాల బారిన పడకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలని పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ సూచించారు. 'సురక్షా తిరంగా' కార్యక్రమంలో భాగంగా పాపన్నపేటలోని కళాశాలలో బుధవారం నిర్వహించిన సైబర్ అవగాహన సదస్సులో ఆయన పాల్గొని విద్యార్థులకు సైబర్ భద్రతపై విలువైన సూచనలు చేశారు.


ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, డిజిటల్ యుగంలో స్మార్ట్‌ఫోన్, ఇంటర్నెట్ వినియోగం పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా కొత్త రూపాల్లో పెరుగుతున్నాయని అన్నారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, ఈ-మెయిల్స్, సోషల్ మీడియా లింకులను నమ్మవద్దని సూచించారు. ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్, పాస్‌వర్డు వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ వెల్లడించరాదని స్పష్టం చేశారు. ఫేక్ ఉద్యోగాల ప్రకటనలు, ఆన్‌లైన్ పెట్టుబడులు, డిజిటల్ అరెస్ట్, కేవైసీ అప్‌డేట్, లాటరీ, రివార్డు పేర్లతో జరుగుతున్న మోసాలపై ప్రత్యేక అప్రమత్తత అవసరమని తెలిపారు. సైబర్ నేరగాళ్లు అమాయకులను లక్ష్యంగా చేసుకుని ఆర్థికంగా మోసం చేస్తున్నందున ప్రతి సందేశాన్ని, ప్రతి లింకును జాగ్రత్తగా పరిశీలించిన తర్వాతే స్పందించాలని విద్యార్థులకు సూచించారు.

సైబర్ నేరానికి గురైన వెంటనే ఆలస్యంచేయకుండా 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని, సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని, సకాలంలో ఫిర్యాదు చేస్తే నష్టాన్ని నివారించే అవకాశం ఎక్కువగా ఉంటుందని వివరించారు.

విద్యార్థులు సాంకేతికతను సద్వినియోగపరుచుకుంటూనే జాగ్రత్తలు పాటించాలని, కుటుంబ సభ్యులు, స్నేహితుల్లో కూడా సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని ఎస్సై శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నర్సింలు , అధ్యాపకులు శ్రీనివాస్, ప్రవీణ్, శ్రీనివాస్ , విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బడి పిల్లల వాహనాలపై రవాణా శాఖ కొరడా

- అధికంగా విద్యార్థులను తరలిస్తున్న రెండు వాహనాలు సీజ్



వేములవాడ, ఆగస్ట్ 05: బడి పిల్లలను తరలించే వాహనాలపై రవాణా శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా మోటారు వాహనాల తనిఖీ అధికారి గంధం వంశీధర్ ఆధ్వర్యంలో వేములవాడ నుంచి చందుర్తి, రుద్రంగి వరకు పాఠశాల విద్యార్థులను తీసుకెళ్లే వాహనాలను తనిఖీ చేశారు.

పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్న వాహనాలపై కేసులు నమోదు చేశారు. నిబంధనలు పాటించని రెండు మోటార్ క్యాబ్ టాటా ఏస్ వాహనాలను సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు.

వాహన డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని, వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. సామర్థ్యానికి మించి ప్రయాణికులు, విద్యార్థులను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈ తనిఖీల్లో కానిస్టేబుల్ రమ్య, హోంగార్డు ఎల్లయ్య పాల్గొన్నారు.

కోహీర్ లో కార్వాన్ కాంగ్రెస్ ఇంచార్జికి ఘన సన్మానం




జహీరాబాద్ ఆగష్టు 5: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, కార్వాన్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి ఉస్మాన్ అల్-హజ్రీ బుధవారం కోహీర్ మండలాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నేత మల్లన్న పాటిల్, మాజీ ఎంపిపి అధ్యక్షులు మహమ్మద్ షాకీర్ అలీ, నాయకులు అజు పటేల్ తో పాటు సర్పంచ్ అశోక్, ప్రభాకర్ రెడ్డి. అబ్దుల్ సత్తార్, అబ్దుల్ మతీన్, అబ్దుల్ రషీద్ తదితరులు ఘన స్వాగతం పలికారు. పార్టీ కార్యాలయంలో ఆయనను ఘనంగా సన్మానించారు.

మణుగూరు ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్‌గా డా. ముదిగొండ రామకృష్ణ

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి ఆగస్టు 05 తెలంగాణ పవర్ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశాల మేరకు మణుగూరు ఏరియా ఆసుపత్రికి మెడికల్ సూపరింటెండెంట్‌గా జనరల్ సర్జన్ డా. ముదిగొండ రామకృష్ణను నియమిస్తూ జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్స్ (డీసిహెచ్ఎస్) డా. రవి బాబు ఉత్తర్వులు జారీ చేశారు.

డా. ముదిగొండ రామకృష్ణ గతంలో భద్రాచలం ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్‌గా సేవలందించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీలలో ఆయన మణుగూరు ఏరియా ఆసుపత్రికి బదిలీ అయ్యారు.

జిల్లా ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వైద్య నిపుణుల సేవలను సమర్థవంతంగా వినియోగిస్తూ అవసరమైన పరిపాలనా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్స్ (డి సి హెచ్ ఎస్) డా. రవి బాబు తెలిపారు.



సినిమా

అగధ' మూవీలో కథతో పాటు స్క్రీన్ ప్లే కొత్తగా ఉంటుంది - ఎం.ఎస్. రాజు

శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద అజయ్ కేఆర్ సమర్పణలో కాశీ విశాలాక్షి బలుసు నిర్మాణంలో ఎం.ఎస్. రాజు తెరకెక్కించిన చిత్రం 'అగధ'. ఈ మూవీలో కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి, ఉల్కా గుప్తా, జోవికా విజయ్‌కుమార్, భాను చందర్, షిజు, వనిత విజయ్‌కుమార్, రోషన్ బషీర్, శ్రేయా రాణి రెడ్డి, వివా రాఘవ, రాబర్ట్ మాస్టర్, ఆర్నా ములేర్, కనకవ్వ ముఖ్య పాత్రలను పోషించారు. ఈ సినిమాని ఆగస్ట్ 14న భారీ ఎత్తున విడుదల చేబోతోన్నారు. ఈ క్రమంలో సోమవారం నాడు ట్రైలర్‌ను గ్రాండ్‌గా రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు డా. కెవిఎల్ఎన్ రాజు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో..

×ఎం.ఎస్. రాజు మాట్లాడుతూ× .. "అగధ' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. ట్రైలర్ అందరికీ నచ్చే ఉంటుందని భావిస్తున్నాను. అజయ్ గారు, కాశీ విశాలాక్షి గారు ఈ ప్రయాణంలో నాకెంతో సపోర్ట్ చేశారు. 'ఆరిజిన్ ఆఫ్ అగధ' కూడా చాలా వైరల్ అయింది. ముమ్ముందు ఈవెంట్లలో టీం అందరికీ గురించి చెబుతాను. ఆగస్ట్ 14న 'అగధ' రిలీజ్ కాబోతోంది. అది నాకు మంచి డేట్ అనిపిస్తోంది. ఆ డేట్‌కి వచ్చే ప్రతీ సినిమా హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను. మంచి కంటెంట్‌తో వచ్చే ప్రతీ చిత్రాన్ని ఆడియెన్స్ ఆదరిస్తారు. 'అగధ' సినిమాని అంత సులభంగా తెరకెక్కించలేరు. వీఎఫ్ఎక్స్, గ్రాఫిక్స్ వంటివి ఎక్కువగా ఉన్న ఈ మూవీని ఏడాదిలోనే పూర్తి చేశాం. రాకేష్ ఈ మూవీకి అద్భుతమైన స్కోర్ ఇచ్చారు. పూర్తిగా భక్తిరస చిత్రాన్ని తీసినా కష్టమే అవుతుంది. యూత్, జెన్ జీ ఆడియెన్స్‌ని ఆకట్టుకునే అన్ని రకాల అంశాల్ని ఇందులో పొందుపర్చాం. నాకు రిటైర్ అవ్వడం అనేది ఇష్టం ఉండదు. నా శ్వాస ఉన్నంత వరకు సినిమాలు తీస్తూనే ఉంటాను. కథకి ఎవరు నప్పుతారు అన్నది మాత్రమే చూసి.. ఆర్టిస్టుల్ని సెలెక్ట్ చేసుకుంటాను. 'అగధ' కోసం అద్భుతమైన ఆర్టిస్టుల్ని తీసుకున్నాను. ఇంతకు ముందు నేను చేయని కథల్ని ఇప్పుడు ట్రై చేయాలని అనుకుంటున్నాను. చిన్నప్పుడు నాకు గాలి సోకిందని కొన్ని రోజులు స్కూల్ కూడా మాన్పించారు. ఆ సంఘటన నా మదిలో అలా ఉండిపోయింది. అది కూడా ఈ 'అగధ' చేయడానికి ఒక కారణం. అందరూ మా సినిమాను ఆదరిస్తారని ఆశిస్తున్నాను. ఎక్కువ స్క్రీన్‌లలో మూవీని రిలీజ్ చేయబోతోన్నాం. మాకు మంచి ఓపెనింగ్స్ వస్తాయని నమ్ముతున్నాను. అన్ని భాషల్లో డబ్బింగ్ రెడీ చేసి పెట్టాం. కానీ ముందు తెలుగు మీద ఫోకస్ పెట్టమని అంతా సలహా ఇచ్చారు. అందుకే అన్ని చోట్లకు వెళ్లి హడావిడిగా ప్రమోషన్స్ చేయడం లేదు. ముందు మా మూవీ గురించి ఇక్కడి ఆడియెన్స్ మాట్లాడాలి. కొన్ని స్క్రీన్‌లలోనే వేద్దామని ఓవర్సీస్ డిస్ట్రిబ్యూటర్ అన్నారు. అతనికి పూర్తి చిత్రాన్ని చూపించాను. దాంతో ఓవర్సీస్‌లో ఆయనే భారీ ఎత్తున రిలీజ్ చేసేందుకు ముందుకు వచ్చారు. 'ఒక్కడు' సినిమాకి మహేష్ బాబు కరెక్ట్, 'వర్షం'కి ప్రభాస్ కరెక్ట్, 'నువ్వొస్తానంటే నేనొద్దంటానా'కి సిద్ధార్థ్ కరెక్ట్, 'మనసంతా నువ్వే'కి ఉదయ్ కిరణ్ కరెక్ట్, 'అగధ' మూవీకి ఇందులో నటించిన వారంతా కరెక్ట్. శ్రవణ్, కామాక్షి, జోవికా, ఉల్కా అందరూ అద్భుతంగా నటించారు. 'అగధ'లో అద్భుతమైన కథతో పాటు స్క్రీన్ ప్లే కొత్తగా ఉంటుంది. ప్రతీ రోజూ ఉదయం మూడు గంటలకు నిద్ర లేచి స్క్రిప్ట్ రాసేవాడ్ని. ఆ కష్టమే మంచి ఫలితాన్ని ఇస్తుందని నమ్ముతున్నాను' అని అన్నారు.

×కామాక్షి భాస్కర్ల మాట్లాడుతూ× .. 'డిఫరెంట్ కారెక్టర్స్‌ను పోషించాలని ప్రతీ నటికి ఉంటుంది. 'పొలిమేర' తర్వాత మళ్లీ ఆ స్థాయి పాత్ర నాకు లభించలేదు. కానీ రాజు గారు ఈ 'అగధ' కథ, అందులో నా పాత్రను



చెప్పిన తర్వాత ఆశ్చర్యపోయాను. నటిగా మళ్లీ నన్ను నేను ప్రూవ్ చేసుకోవడానికి చక్కటి అవకాశం లభించింది. నాకు ఇంత మంచి అవకాశం ఇచ్చిన రాజు గారికి ఎప్పుడూ రుణపడి ఉంటాను. నేను ప్రతీ సినిమాకి కష్టపడి ప్రమోషన్స్ చేస్తుంటాను. 'అగధ'కి కూడా అదే స్థాయిలో ప్రమోషన్ చేస్తున్నాను. నేను చేసే ప్రతీ సినిమాకి, అందులోని పాత్రకు వ్యత్యాసం ఉండేలా చూసుకుంటాను. నటిగా నాకు డిఫరెంట్ పాత్రలు వస్తుండటం నా అదృష్టం అనే చెప్పాలి. 'అగధ' వల్ల నాలో ఎంతో మార్పు వచ్చింది. ఇంతకు ముందు కంటే కామ్ అయ్యాను. స్పిరిట్యువల్‌గా మారిపోయాను. ఆగస్ట్ 14న 'అగధ' అంటే ఏంటో అందరికీ తెలుస్తుంది' అని అన్నారు.

×శ్రవణ్ రెడ్డి మాట్లాడుతూ× .. "అగధ' జర్నీ నాకెంతో ప్రత్యేకం. నేను ఎప్పుడూ సింపుల్ సినిమాల్ని చేయలేదు. రాజు గారి మీద నాకు నమ్మకం ఉంది. ఆయన్నుంచి మేం ఎంతో నేర్చుకున్నాం. 'డర్టీ హరి' తర్వాత 'అగధ'లో నాకు మంచి పాత్రను ఇచ్చారు. ఆయనకు ఎప్పుడూ రుణపడి ఉంటాను' అని అన్నారు.

×కాశీ విశాలాక్షి మాట్లాడుతూ× .. "అగధ' చిత్రీకరణ సమయంలో నేను కూడా సెట్‌కి వెళ్లాను. ప్రతీ ఒక్కరూ అద్భుతంగా నటించారు. ఇప్పటి వరకు రాజు గారు అంటే 'దేవీ', 'వర్షం' అని అంటున్నారు కదా.. 'అగధ' తర్వాత.. 'అగధ' రాజు అని అంటారు. ఆయన కథ చెప్పిన దాని కంటే అద్భుతంగా తెరకెక్కించారు. మళ్లీ ఆయనతోనే సినిమాని చేయబోతోన్నాం' అని అన్నారు.

×ఉల్కా గుప్తా మాట్లాడుతూ× .. 'రాజు గారు చెప్పిన 'అగధ' కథ నాకు ఎంతో నచ్చింది. పదేళ్ల తర్వాత మళ్లీ తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తుండటం ఆనందంగా ఉంది. నాకు ఇంత మంచి పాత్రను ఇచ్చిన రాజు గారికి థాంక్స్. నా కెరీర్‌లో 'అగధ' ఓ మైల్ స్టోన్‌గా నిలుస్తుంది' అని అన్నారు.

×జోవికా విజయ్ కుమార్ మాట్లాడుతూ× .. 'మాకు రాజు గారు ఫ్యామిలీ మెంబర్‌లా ఉంటారు. ప్రతీ సీన్‌ను ఎంతో గొప్పగా వివరిస్తారు. ఆయనకు గొప్ప విజన్ ఉంటుంది. ఆర్టిస్టులకు అర్థమయ్యేలా సీన్‌ను చెబుతారు. ఆయనతో నా మొదటి సినిమాని చేస్తుండటం ఆనందంగా ఉంది. ఇలాంటి ఓ డిఫరెంట్ పాత్ర నా కెరీర్ ఆరంభంలోనే రావడం, పైగా అమ్మతో కలిసి నటించడం నా అదృష్టం' అని అన్నారు.

నటీనటులు : కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి, ఉల్కా గుప్తా, జోవికా విజయ్ కుమార్, సిజ్జు , రోషన్, శ్రేయరాణి రెడ్డి తదితరులు

'ఇరుముడి' మూవీ నుంచి 'యాలాలో యాలాలో'

మాస్ మహారాజా మోస్ట్ ఎవైటెడ్ కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'ఇరుముడి' ప్రమోషన్స్ తో ఉత్సాహాన్ని పెంచుతోంది. శివ నిర్వాణ దర్శకత్వంలో, మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రం, తన భక్తి గీతమైన మొదటి పాట 'ఇరుముడి కట్టు'తో ఇప్పటికే ప్రేక్షకులను ఆకట్టుకుంది. అదే జోరును కొనసాగిస్తూ, కుటుంబ బంధాలలోని ఆప్యాయతను అందంగా చాటిచెప్పే రెండవ పాట 'యాలాలో యాలాలో'ను చిత్ర బృందం విడుదల చేసింది.

జీవీ ప్రకాష్ కుమార్ స్వరపరిచిన ఈ పాటకు ఆయన అందించిన సాఫ్ట్ మెలోడీ, ఆర్కెస్ట్రేషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంత శ్రీరామ్ రాసిన సాహిత్యం మధ్యతరగతి కుటుంబంలోని ప్రేమ, అనుబంధాలు, ఆప్యాయతలే అనలైన సంపద అనే భావాన్ని హృదయానికి హత్తుకునేలా చెబుతుంది. హెషామ్ అబ్దుల్ వహాబ్, సాధికా కెఆర్ ఆలపించిన తీరు పాటకు మరింత భావోద్వేగాన్ని జోడించింది.

ఈ పాట ద్వారా సినిమా ఎమోషనల్ కోర్‌ను కూడా మేకర్స్ చూపించారు. రవితేజ కుటుంబాన్ని ప్రాణంగా ప్రేమించే ఓ ఆటో డ్రైవర్‌గా కనిపిస్తారు. మద్యానికి బానిసైనప్పటికీ కుటుంబం కోసం తపించే తండ్రి పాత్రలో ఆయన సహజమైన నటన ఆకట్టుకుంటోంది. ప్రియ భవాని శంకర్ కుటుంబ బాధ్యతలను భుజాన వేసుకునే భార్య పాత్రలో మెప్పించగా, బేబీ నక్షత్ర తండ్రితో విడదీయలేని అనుబంధం ఉన్న కూతురిగా మనసుని తాకింది. పాటలోని ప్రతి విజువల్, ప్రతి ఎమోషన్ సాహిత్యానికి అద్భుతంగా తోడై కుటుంబ బంధాలను ఎంతో సహజంగా చూపించింది. ఈ పాట విడుదలైన వెంటనే ప్రేక్షకులకి ఫేవరేట్ గా మారింది ఇప్పటివరకు మాస్, యాక్షన్ పాత్రలతో అలరించిన రవితేజ... ఈసారి పూర్తిగా భిన్నమైన భావోద్వేగ పాత్రలో కనిపిస్తున్నారు. ప్రియ భవాని శంకర్, బేబీ నక్షత్ర కూడా తమ సహజమైన నటనతో పాటకు మరింత బలం చేకూర్చారు. ముఖ్యంగా ఈ పాటకు దర్శకుడు శివ



నిర్వాణ స్వయంగా కోరియోగ్రఫీ చేయడం విశేషం. ఒకే పాటలో కుటుంబ ప్రేమ, బాధ, ఆప్యాయత, అనుబంధాలను ఎంతో అందంగా ఆవిష్కరించిన ఆయన వర్క్ ప్రత్యేక ప్రశంసలు అందుకునేలా ఉంది. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి విష్ణు శర్మ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, సాహి సురేష్ ప్రొడక్షన్ డిజైనర్‌గా, ప్రవీణ్ పూడి ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం ఈ చిత్రానికి మరో ప్రధాన ఆకర్షణగా నిలవనుంది.

ప్రతి ప్రమోషనల్ కంటెంట్‌తో ప్రేక్షకుల మనసులను తాకుతున్న 'ఇరుముడి' ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.

నటీనటులు: మాస్ మహారాజా రవితేజ, ప్రియా భవానీ శంకర్, సాయి కుమార్, బేబీ నక్షత్ర, అజయ్ ఘోష్, రమేష్ ఇందిర, స్వాసిక, మిసాల లక్ష్మణ్, రాజ్ కుమార్ కసిరెడ్డి, రమణ భార్గవ్, కిషోర్ కంచెరపాలెం, కార్తీక్ అడుసుమల్లి, మహేష్

'దొంగ నా కొడుకు' మూవీ ఫస్ట్ లుక్ రిలీజ్

ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ పెద్ద స్టార్ హీరోలతో గ్రాండ్ ఎంటర్‌టైనర్స్ చేస్తూనే, మరోవైపు కొత్త టాలెంట్‌తో కంటెంట్ బేస్డ్ సినిమాలను నిర్మిస్తోంది. తాజాగా మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌ను ప్రకటించింది. 'లిటిల్ హార్ట్స్' చిత్రంతో ప్రశంసలు అందుకున్న మౌళి తనూజ్ ప్రసాంత్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీను కంబాల దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. తాజాగా మేకర్స్ ఈ సినిమా 'దొంగ నా కొడుకు' అనే క్రేజీ టైటిల్‌తో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు.

'దొంగ నా కొడుకు' అనే టైటిల్ వినగానే అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. వినూత్నంగా డిజైన్ చేసిన లోగో సినిమా ఫన్, ఎంటర్‌టైనింగ్ టోన్‌ను పరిచయం చేస్తోంది. ఇక ఫస్ట్ లుక్ పోస్టర్‌లో భారీ జాక్ ప్లేయింగ్ కార్డ్ నుంచి చిరునవ్వుతో స్టైలిష్‌గా ఎంట్రీ ఇస్తున్న మౌళి లుక్ ఆకట్టుకుంటోంది. ఆయన బాడీ లాంగ్వేజ్ చూస్తుంటే... సరదా మనస్తత్వం ఉన్న యువకుడు వరుసగా జరిగే కామెడీ, దొంగతనాల నేపథ్యంలో సాగే థ్రిల్లింగ్ సంఘటనల్లో చిక్కుకోబోతున్నాడనే ఆసక్తిని కలిగిస్తోంది. ప్లేయింగ్ కార్డ్ కాన్సెప్ట్ సినిమాకు యూనిక్ విజువల్ ఐడెంటిటీని తీసుకొచ్చింది.



పోస్టర్‌లో కనిపించే బ్లాక్ బ్యాక్‌ప్యాక్, చెల్లాచెదురుగా పడిన బంగారు నగలు, గాలిలో ఎగురుతున్న కాగితాల ముక్కలు వంటి విజువల్ ఎలిమెంట్స్ కథలోని దొంగతనం కాన్సెప్ట్‌ను ఆసక్తికరంగా సూచిస్తున్నాయి. ఈ క్రియేటివ్ పోస్టర్ సినిమాపై మరింత క్యూరియాసిటీ పెంచుతోంది.

ఈ చిత్రాన్ని నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తుండగా, అనిల్ ఎర్నేని సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంలో సుష్మిత శెట్టి, అలీ, రాజిత, రఘుబాబు, ప్రియ, గుండు సుధర్షన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

ఈ చిత్రానికి సూర్య బాలాజీ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, సింజిత్ యర్రమిల్లి సంగీతం సమకూరుస్తున్నారు. శ్రీధర్ సోంపల్లి ఎడిటర్‌గా, నాగేంద్ర గువ్వల ప్రొడక్షన్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు.

వినగానే గుర్తుండిపోయే టైటిల్, క్రియేటివ్ ఫస్ట్ లుక్ పోస్టర్‌తో 'దొంగ నా కొడుకు' ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తించింది. సినిమా గురించి మరిన్ని వివరాలను మేకర్స్ త్వరలోనే వెల్లడించనున్నారు.

తారాగణం: మౌళి తనూజ్ ప్రశాంత్, సుష్మిత శెట్టి, అలీ, రజిత, రఘుబాబు, ప్రియ, గుండు సుదర్శన్

కార్తి, మోహన్ రాజా, ఎస్. లక్ష్మణ్ కుమార్, ప్రిన్స్ పిక్చర్స్ కొత్త సినిమా అనౌన్స్‌మెంట్

ప్రిన్స్ పిక్చర్స్ మరో క్రేజీ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించింది. హీరో కార్తీ, ప్రముఖ దర్శకుడు మోహన్ రాజా కాంబినేషన్‌లో కొత్త సినిమా అనౌన్స్ చేసింది. ఎన్. లక్ష్మణ్ కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రం కుటుంబ భావోద్వేగాలతో పాటు హీరోయిజాన్ని అద్భుతంగా మేళవించిన ఎంటర్‌టైనర్‌గా రూపొందనుంది.



కార్తీ, మోహన్ రాజా కలిసి పనిచేయడం ఇదే తొలిసారి. ప్రిన్స్ పిక్చర్స్ బ్యానర్‌లో కార్తీకి ఇది వరుసగా నాలుగో చిత్రం. ఇంతకుముందు 'దేవ్', 'సర్దార్', 'సర్దార్ 2' చిత్రాల తర్వాత మరోసారి ఈ బ్యానర్‌తో ఆయన చేతులు కలపడం విశేషం. ముఖ్యంగా 'సర్దార్ 2' విడుదలకంటే ముందే ఈ కొత్త ప్రాజెక్ట్‌ను ప్రకటించడం కార్తీ, ప్రిన్స్ పిక్చర్స్ మధ్య ఉన్న బలమైన అనుబంధానికి నిదర్శనం. ఈ సినిమాపై కేవలం ప్రకటనతోనే సినీ అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది.

బలమైన భావోద్వేగాలు, కమర్షియల్ ఎలిమెంట్స్‌ను మేళవిస్తూ మంచి సినిమాలు తెరకెక్కించే దర్శకుడిగా పేరు తెచ్చుకున్న మోహన్ రాజా, ఈ చిత్రంలో కార్తీని మరో కొత్త, పవర్‌ఫుల్ అవతార్‌లో చూపించబోతున్నారు.

ఈ చిత్రానికి సంబంధించిన నటీనటులు, సాంకేతిక బృందం, రెగ్యులర్ షూటింగ్ తదితర వివరాలను మేకర్స్ త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు. తారాగణం: కార్తీ

సూర్య 47 దీపావళి బరికోసం సిద్ధం

తమిళ స్టార్ హీరో సూర్యకు ఇప్పటికే వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. రీసెంట్ గా జీతు మాధవన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'సూర్య47' షూటింగ్‌ను పూర్తి చేశారు. చిత్రబృందం విడుదల చేసిన బీహైండ్ ది సీన్స్ వీడియోతో షూటింగ్ ముగిసిన విషయాన్ని అధికారికంగా వెల్లడించగా, ఇప్పుడు ఈ సినిమా విడుదల తేదీపై ఆసక్తికర చర్చ మొదలైంది. అందుతున్న సమాచారం ప్రకారం, 'సూర్య47'ను ఈ దీపావళి సందర్భంగా థియేటర్లలో విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఈ వార్త నిజమైతే సూర్యకు ఇది వరుసగా మూడో థియేట్రికల్ విడుదలగా నిలవనుంది. ఇప్పటికే 'కరుప్పు'తో ప్రేక్షకులను పలకరించిన ఆయన, ఆగస్టు 14న వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్'తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆ సినిమా విడుదలైన కొద్ది నెలలకే 'సూర్య47' కూడా థియేటర్లలోకి వస్తే, ఒకే ఏడాదిలో వరుసగా మూడు సినిమాలతో అభిమానులను అలరించిన హీరోగా సూర్య నిలుస్తారు. అయితే దీపావళి బరిలో వెట్రిమారన్ దర్శకత్వంలో సిలంబరసన్ టి.ఆర్ నటిస్తున్న 'అరసన్' కూడా విడుదలకు సిద్ధమవుతుండటంతో బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోటీ నెలకొనే అవకాశం కనిపిస్తోంది.



8న గ్రాండ్‌గా టాక్సిక్ ట్రైలర్ లాంచ్ ప్లాన్

TRENDING

యశ్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్'. ఈ సినిమా నుంచి భారీ అప్‌డేట్ సిద్ధమైంది. 'టాక్సిక్' చిత్రబృందం ఆగస్టు 8న బెంగళూరులో గ్రాండ్‌గా ట్రైలర్ లాంచ్‌ను ప్లాన్ చేస్తోంది. ట్రైలర్ లాంచ్‌కి ముందు ప్రత్యేక మీడియా సమావేశం ఏర్పాటు చేసి దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ సినిమాకు సంబంధించిన ఆసక్తికర విషయాలు పంచుకోనున్నారు. యశ్‌తో పాటు ఐదుగురు హీరోయిన్లు హాజరుకానున్నారు. దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించేలా ఈ ఈవెంట్‌ను నిర్వహించాలని నిర్మాణ సంస్థ ఏర్పాట్లు చేస్తోంది. భారీ స్థాయిలో రానున్న ఈ చిత్రాన్ని కన్నడ, ఇంగ్లిష్ భాషల్లో ఒకేసారి చిత్రీకరించారు. ప్రపంచవ్యాప్తంగా 40కి పైగా భాషల్లో డబ్ చేసి విడుదల చేయనున్నారు. ఆగస్టు 26న 'టాక్సిక్' ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, టీజర్, పాటలు నెట్టింట వైరల్ కాగా.. ట్రైలర్‌తో సినిమా అంచనాలు రెట్టింపు చేయాలని టీమ్ భావిస్తోంది. ఈ సినిమాలో బలమైన ఎమోషన్స్ ఉన్నాయని యశ్ అన్నారు. థియేటర్‌లో అందరూ ఆశ్చర్యపోతారన్నారు. యాక్షన్ సినిమాలంటే తనకు ఎంతో ఇష్టమని.. 'టాక్సిక్'లో హాలీవుడ్ స్టంట్ కోఆర్డినేటర్ జేజే పెర్రీ రూపొందించిన యాక్షన్ సీక్వెన్సులు సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయని తెలిపారు. ఇందులో ఈ రాకింగ్ స్టార్‌కు జోడీగా తారా సుతారియా, నయనతార, రుక్మిణి వసంత్, కియారా అడ్వాణీ, హ్యూమా ఖురేషీ మెరవనున్నారు.



Edited, Printed, Published and Owned by NASREEN KHAN , Printed at M/s DATTASAI GRAPHICS :1-1-651/8, Gandhi Nagar, Hyderabad-500 080
Published from H.No.1-7-137, Flat 402, Vijaysai Apartments, Zamistanpur, Musheerabad, Hyderabad- 20, (Telangana) Editor:Nasreen Khan, Ph : 040-27602786, Cell : 965243981 .R.N.I.No.TELTEL/2013/51844